మార్చి
2021

179

సంపుటి : 15 సంచిక : 10 వెల రు. 10/-

ఈ సంచికలో........

కోవిడ్ తరువాత ప్రపంచం - సోషలిజమే ప్రత్యామ్నాయం
సమ సమాజం కోసం పోరాటం అంటే
వేదకాలం- మలి దశ (క్రీపూ. 1000 - 700)
ప్రజా చరిత్రకారుడు ప్రొఫెసర్ డిఎన్ ఝా
'భారతదేశంలో స్వర్ణయుగం ఎప్పుడూ లేదు'
ప్రజాపంపిణి వ్యవస్థను నీరుగారుస్తున్న ప్రభుత్వాలు
72 సంవత్సరాల భారత గణతంత్రం
పుల్వామా దాడి గురించి ప్రభుత్వానికి ముందే తెలుసా
భారతదేశ సంపదను కొల్లగొట్టిన బ్రిటన్
భారతదేశ విప్లవ పంథా కోసం పోరాటం

# భారతదేశ విప్లవ పంథా కోసం పోరాటం

వివిధ రైతాంగ పోరాటాలు, ముఖ్యంగా వీరోచిత తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం, భారతదేశ విప్లవదశ, విప్లవం సాధించడానికి అనుసరించ వలసిన వ్యూహం, ఎత్తుగడలు సమస్యను ముందుకుతెచ్చింది. ఇవి పార్టీలో చర్చలు, వాద ప్రతివాదాలకు దారితీ శాయి.

భారతదేశ కమ్యూనిస్టులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించుకోవటం కోసం రెండవ పార్టీ మహాసభలో ఆమోదించిన రాజకీయ, ఎత్తుగడల విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించాల్సి వచ్చింది. తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహిస్తున్న ఆంధ్ర కమ్యూనిస్టు పార్టీ కమిటి ఈ పరిశీలన, ఆ తరువాత చర్చలకు నాయకత్వం వహించింది. ఆ తరువాత రాజకీయ, ఎత్తుగడల పంథాలోని లోపాలను, ఆ పంథాను అప్పటి పార్టీ నాయకత్వం అమలు జరిపిన విధానంపై సవివరమైన నోట్‌ను తయారు చేసింది. ఆంధ్ర కార్యదర్శి వర్గం సమర్పించిన నోట్ పూర్తిగా సంస్కరణ వాదమని, మార్క్సిస్టు లెనినిస్టు పంథా నుండి వైదొలగిందని అంటూ పార్టీ రెండో మహాసభలో ఎన్నికయిన పొలిట్ బ్యూరో దానిని పూరిగా తోసిపుచ్చింది.

1948 చివరికి పొలిట్‌బ్యూరో మూడు డాక్యుమెంట్లను రూపొందించింది – 'జనతా ప్రజాస్వామ్యం', 'వ్యవసాయ సమస్య', 'ఎత్తుగడల పంథా'. వామపక్ష దుందుడుకువాదంతో కూడిన ఈ డాక్యుమెంట్లు కార్యక్రమాలను అమలు చేసే క్రమంలో అనేక సైద్ధాంతిక సమస్యలను ముందుకు తెచ్చాయి.

ఈ పంథాను అనుసరించే క్రమంలోనే 1949 మార్చి 9వ తేదీన అఖిల భారత రైల్వే సమ్మెకి పిలుపునివ్వడం జరిగింది. భారత ప్రభుత్వం పార్టీ నాయకులపైనా, కార్మిక సంఘం నాయకుల పైనా తీవ్రమైన అణచివేత చర్యలకు తెరలేపింది. అనేక రాష్ట్రాలలో కార్మికులు వేలసంఖ్యలోఖైదు చేయబడ్డారు.' జైళ్ళను వర్గ పోరాట కేంద్రాలుగా 'మార్చాలంటూ పార్టీ పిలుపు నిచ్చింది. దీని ఫలితంగా, పార్టీకి, విప్లవానికి విధేయులైన అనేక



చంద్ర రాజేశ్వరరావు

మంది కామ్రేడ్లు తమ ప్రాణాలను బలియిచ్చారు.

భౌతిక పరిస్థితులు, కార్మికుల సంసిద్ధతను పరిగణనలోనికి తీసుకోకుండా ఈ సమ్మె, జైళ్లలో పోరాటానికి పిలుపులు ఇవ్వడం జరిగింది. ఇది అప్పటి పొలిట్ బ్యూరో అను సరించిన వామపక్ష దుందుడుకు వాదాన్ని సూచిస్తున్నది. సమ్మె పిలుపుకు తక్కువ స్పందన రావటాన్ని ఆత్మ విమర్శనాపూర్వకంగా పరిశీలించకుండా తమను ప్రశ్నించిన వారిని పిరికివారిగాను, సమ్మె విచ్ఛిన్నకారులుగాను, సంస్కరణ వాదులుగాను నాయకత్వం ముద్రవేసింది. ఈ కారణంగానే అనేక మంది కామ్రేడ్స్‌ను తొలగించారు. రాష్ట్ర కమిటీలు కూడా పునర్వ్యవస్థీకరించ బడ్డాయి. పొలిట్‌బ్యూరోతో ఏకీభవించని నాయకులు ఆత్మ విమర్శనా పూర్వకంగా లిఖిత పూర్వక సమాధానాలు సమర్పించాలని ఆదేశించడం జరిగింది. చాలా మంది అందుకనుగుణంగా సమాధానాలు ఇచ్చారు కూడా. నాయకత్వం అనుసరించిన ఈ విధానాల ఫలితంగా పార్టీ సభ్యత్వం 80,000 నుంచి 20,000లకు పడిపోయింది. పార్టీ పరిస్థితి బలహీనపడింది. పార్టీలో నిరాశా నిస్పృహలు అలముకున్నాయి. పార్టీ నాయకత్వం వహించిన రైతాంగ పోరాటాలే ఆనాడు కొంతలో కొంత ఊరట కల్పించాయి.

ఈ పరిస్థితులలో 'జనతా ప్రజాస్వామ్యం కోసం, దీర్ఘకాల శాంతికోసం' అనే సంపాదకీయం కొమిన్‌ఫార్మ్ (కమ్యూనిస్టు ఇన్ఫర్మేషన్ బ్యూరో) ప్రచురిస్తున్న పత్రికలో వచ్చింది. భారత కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకత్వం అనుసరిస్తున్న రాజకీయ పంథాను ఈ సంపాదకీయంలో తీవ్రంగా విమర్శించారు. ఇది పార్టీలో తీవ్ర అంతర్గత చర్చకు దారితీసింది. ఆంధ్రా పార్టీ కమిటి ఈ సంపాదకీయంలోని అంశాలను తీసుకుని పొలిట్‌బ్యూరో దుందుడుకువాద విధానానికి వ్యతిరేకంగా తాము ప్రారంభించిన పార్టీ అంతర్గత పోరాటాన్ని ముమ్మరం చేసింది.

కేంద్ర కమిటీ కన్నా పొలిట్‌బ్యూరో అత్యున్నత సంస్థ అన్న వాదనను తీవ్రంగా విమర్శించింది. దుందుడుకు రాజకీయ పంథాను అనుసరిస్తున్న పార్టీ ప్రధాన కార్యదర్శిని తప్పుపట్టింది. తప్పుడు నిర్మాణ సూత్రాలను అనుసరిస్తున్నారని, ఏ మూల నుండి విమర్శ ఎదురైనా నొక్కి పెడుతున్నారని, ఆత్మ విమర్శ చేసుకోవడం లేదని, ఉమ్మడిగా కార్యక్రమాలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోడం లేదని, కేంద్ర కమిటీ సమావేశాలు జరపకపోవటం వంటి కొన్ని ముఖ్యమైన అంశాలను గుర్తించి, ఇవి పార్టీ విచ్ఛిన్నానికి దారి తీస్తున్నాయని ఎత్తి చూపింది.

కొమిన్‌ఫార్మ్ సంపాదకీయం నేపథ్యంలో 1950 మధ్యలో కేంద్రకమిటీ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. తీవ్రమైన చర్చలు వాదోపవాదాలు, విమర్శలు, ఆత్మ విమర్శల తరువాత కొన్ని రాజకీయ, నిర్మాణపరమైన నిర్ణయాలు తీసుకున్నది.

పార్టీ రెండో మహాసభలో ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయిన కామ్రేడ్ బి టి. రణదివే స్థానంలో కామ్రేడ్ సి రాజేశ్వరరావును కార్యదర్శిగా ఎన్నుకున్నారు. కొత్తగా ముగ్గురు సభ్యులతో పొలిట్ బ్యూరో, పదకొండు మంది సభ్యులతో కేంద్ర కమిటీని ఎన్నుకున్నారు.. రాజకీయ,

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1. భారతదేశ విప్లవ పంథా కోసం పోరాటం ........ 2

2. కోవిడ్ తరువాత ప్రపంచం - సోషలిజమే ప్రత్యామ్నాయం
తమ్మినేని వీరభద్రం ..... 4

3. సమ సమాజం కోసం పోరాటం అంటే
ఎస్. వీరయ్య ......... 7

4. వేదకాలం- మలి దశ (క్రీపూ. 1000 - 700)
ఎంవిఎస్ శర్మ..... 10

5. ప్రజా చరిత్రకారుడు ప్రొఫెసర్ డిఎన్ ఝా
ఎస్. వెంకట్రావు ...... 13

6. 'భారతదేశంలో స్వర్ణయుగం ఎప్పుడూ లేదు'
డిఎన్ ఝా ......... 15

7. ప్రజాపంపిణీ వ్యవస్థను నీరుగారుస్తున్న ప్రభుత్వాలు
ఎ. కోటిరెడ్డి .......... 18

8. 72 సంవత్సరాల భారత గణతంత్రం
పి. అజయకుమార్ ...... 22

9. పుల్వామా దాడి గురించి ప్రభుత్వానికి ముందే తెలుసా
ఆనందో భక్తో........... 25

10. భారతదేశ సంపదను కొల్లగొట్టిన బ్రిటన్
ప్రభాత్ పట్నాయక్, ఉత్సాపట్నాయక్........ 28



**సంపాదకుడు:**
**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**



భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: బి.వి.రాఘవులు
సంపాదకుడు : ఎస్. వెంకట్రావు
ఫోన్: ఎడిటర్ : 9490099333
ముద్రణ: ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
మేనేజర్:కె. హరికిషోర్:9490098977
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com


# ప్రయివేటీకరణ

"వ్యాపారం చేయడం ప్రభుత్వం పని కాదు" అని ప్రధాని నరేంద్ర మోడీ ఇటీవల ప్రకటించారు. వ్యాపారం అంటే ఆయన దృష్టిలో ప్రభుత్వ రంగంలో పరిశ్రమలు పెట్టడం, ప్రజలకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించడం. ఆయన ఉద్దేశం ప్రకారం పారిశ్రామిక రంగం, విద్య, వైద్యం ఇతర సేవలనుండి ప్రభుత్వం తప్పుకుని వాటిని స్వదేశీ, విదేశీ బడా కార్పొరేట్ కంపెనీలకు అప్పగించాలి. దేశంలోని వనరులను ప్రజల నుండి లాక్కుని ఈ కార్పొరేట్లకు అప్పగించే ఫెలిసిటేటర్‌గా మాత్రమే ప్రభుత్వం ఉండాలి. అంటే దేశంలోని వనరులను ఒక క్రమపద్ధతిలో ఉపయోగించుకుని ప్రణాళిక ప్రకారం పరిశ్రమలు స్థాపించి ప్రజలకు ఉపాధి, విద్య, వైద్యం కల్పించే బాధ్యతలనుండి ప్రభుత్వం తప్పుకుని స్వదేశీ, విదేశీ ప్రయివేటు పెట్టుబడిదారులకు దేశంలోని వనరులన్నిటినీ అప్పగిస్తే వారే ప్రజలకు ఉపాధి కల్పిస్తారనే పాత సిద్ధాంతాన్నే ఆయన వల్లెవేశారు.

నిజానికి ఈ సిద్ధాంతం మోడీది కాదు. ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్‌లు మూడు దశాబ్దాలక్రితమే ప్రపంచం మీద రుద్దిన సిద్ధాంతం ఇది. దీన్ని అమలు జరిపే క్రమంలోనే సరళీకరణ, ప్రపంచీకరణ, ప్రయివేటీకరణ (ఎల్‌పిజి), "సంస్కరణలు", "ప్రభుత్వ ఉపసంహరణ", "కనిష్ఠ ప్రభుత్వం, గరిష్ఠ పాలన", "ట్రికిల్‌డౌన్ ఎఫెక్ట్", "గుడ్ గవర్నెన్స్", "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" వంటి అనేక నినాదాలు పుట్టుకొచ్చాయి. ఆచరణలో మోడీ ప్రభుత్వం చేస్తున్నది వ్యాపారం నుండి తప్పుకోవడం కాదు. ప్రభుత్వమే పూనుకుని ప్రజాధనాన్ని, ప్రజల ఉమ్మడి సంపదను ప్రైవేట్ కార్పొరేట్లకు కారుచౌకగా కట్టబెట్టడం.

మోడీగారు వల్లె వేస్తున్న ప్రపంచీకరణ కొద్దిమంది కుబేరులకు మాత్రమే లాభం చేకూర్చిందని ఆర్థిక గణాంకాలు సైతం చెబుతున్నాయి. మరోవైపు ఇది మొత్తం ప్రపంచాన్ని, భారత దేశాన్ని కూడా తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేసింది. ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, పేదరికం పెరిగిపోయాయి. దీన్నుండి బయటపడలేక పెట్టుబడిదారీ వ్యవస్థ కొట్టుమిట్టాడుతున్న తరుణంలో నరేంద్ర మోడీ ప్రయివేటీకరణ మంత్రాన్ని మరింతగా పటిస్తున్నారు. అన్ని రంగాలనూ ప్రయివేటీకరిస్తున్నారు. ప్రజల ఉపాధికి, దేశ స్వావలంబనకు తోడ్పడే వ్యవసాయ మార్కెట్టునూ, ప్రభుత్వ రంగాన్నీ గుండుగుత్తగా ప్రయివేటు కార్పొరేట్లకు అమ్మేయడానికి పూనుకున్నారు. విశాఖపట్నం స్టీలు ప్లాంటు ప్రయివేటీకరణ నిర్ణయం కూడా అందులో భాగమే.

బిజెపి ప్రభుత్వ ప్రయివేటీకరణను అడ్డుకోకపోతే రానున్న రోజుల్లో ఆర్థిక సంక్షోభం మరింత తీవ్రమవుతుందని సూచీలు తెలుపుతున్నాయి. కరోనాకు ముందునుండే నేల చూపులు చూసిన మన ఆర్థిక వ్యవస్థ కరోనాతో మరింత దిగజారిపోయింది. రికవరీ గురించి ఎన్నిక కబుర్లు చెబుతున్నప్పటికీ ఇప్పట్లో కోలుకునే పరిస్థితులు కనిపించడం లేదు. సంక్షోభం ఎంతగా ముదిరినా బడా పెట్టుబడిదారుల లాభాలకు డోకా లేకుండా ప్రభుత్వం చూస్తుంది. కానీ సంక్షోభ భారాలు ప్రజలపై తీవ్రంగాపడి వారి జీవన పరిస్థితులు ఇంకా దిగజారిపోతాయి. ఇప్పటికే నిరుద్యోగం, అధిక ధరలతో బాధపడుతున్న ప్రజలు రానున్న రోజుల్లో మరిన్ని సమస్యలు ఎదుర్కొంటారు.

అందువల్ల సంక్షోభాన్ని తీవ్రతరం చేసే ప్రయివేటీకరణను అనివార్యంగా ప్రతిఘటించ వలసిన పరిస్థితులు ప్రజల ముందు నిలబడ్డాయి. ఢిల్లీలో రైతులు, విశాఖలో కార్మికులు, దేశ వ్యాపితంగా ట్రాన్స్‌పోర్ట్ సంస్థలు చేస్తున్న ఆందోళనలు మచ్చుతునకలు మాత్రమే. ఈ నిరసనలు పెరిగి ప్రయివేటీకరణ విధానాలను తిప్పకొట్టినప్పుడు మాత్రమే కార్మికులకూ, ప్రజలకూ రక్షణ లభిస్తుంది.


**చందా వివరాలు**
విడిప్రతిక: **రూ.10**, సంవత్సర చందా:**రూ.100**, పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.



చిరునామా
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,**
**అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**
**పిన్ : 522501, గుంటూరు జిల్లా.**

# కోవిడ్ తరువాత ప్రపంచం - సోషలిజమే ప్రత్యామ్నాయం



సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి

**తమ్మినేని వీరభద్రం**

కోవిడ్19 తరువాత కాలంలో, ప్రపంచంలో అనేక మార్పులు వేగంగా జరిగే అవకాశాలు కనపడుతున్నాయి. కరోనా మహమ్మారి కనీసం 10 సంవత్సరాలు ప్రపంచాన్ని వెనక్కు నెట్టింది. ఒక్క చైనా తప్ప అన్ని ప్రధాన ఆర్థిక వ్యవస్థలూ 2020 ఆర్థిక సంవత్సరంలో మైనస్ జిడిపిలనే నమోదు చేశాయి. 2021లో కూడా 2020తో పోలిస్తే కొంత అభివృద్ధి సాధించినా, కరోనా పూర్వస్థాయికి ఆర్థిక వ్యవస్థలు చేరుకోవటం ఇపుడిపుడే సాధ్యం కాదని ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు లాంటి సంస్థలు కూడా అంచనా వేస్తున్నాయి. అది కూడా కరోనా వైరస్ మళ్లీ విజృంభించకుండా ఉంటే, వ్యాక్సినేషన్ ప్రక్రియ ప్రపంచమంతటా సక్రమంగా పూర్తయితేనే సాధ్యమవుతుంది. ఈ పరిస్థితుల్లో కరోనా కట్టడి కావాలన్నా, ఆర్థికవ్యవస్థలు కుదుటపడాలన్నా ప్రపంచ దేశాల మధ్య పరస్పర సహకారం, సమన్వయం అవసరం. కానీ అగ్రరాజ్యం అమెరికా మాత్రం అలాంటి చొరవ చూపక పోగా ఆటంకాలు కల్పిస్తోంది. కరోనా కట్టడి కంటే సోషలిస్టు చైనాను కట్టడి చేయటానికే ఎక్కువ ప్రాధాన్యమిస్తోంది. అందుకు మిగతా పెట్టుబడిదారీ దేశాలన్నింటినీ కూడగట్టే ప్రయత్నాలను ముమ్మరం చేస్తోంది. అయితే ఆ విధమైన చైనా వ్యతిరేక కూటములు ఏర్పడటం ఇపుడున్న పరిస్థితుల్లో అంత తేలికేం కాదు. ఎందుకంటే అనేక దేశాలు చైనాతో రాజకీయ వైరం కంటే ఆర్థిక స్నేహానికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేట్లున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న ఈ పెనుగులాటలో జయాపజయాలే భవిష్యత్తు ప్రపంచగమనాన్ని నిర్దేశిస్తాయనటం అతిశయోక్తి కాబోదు.

**అమెరికా ఏకపక్ష వైఖరి :**

2014లో డోనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడయ్యాక చైనా పట్ల అమెరికా వైఖరిలో మార్పు ప్రారంభమైంది. చైనాను ఆర్థికంగా దిగ్బంధనం చేయటానికి అనేక చర్యలు తీసుకున్నారు. దఫదఫాలుగా చైనా వస్తువులపై వందల బిలియన్ డాలర్ల టారిఫ్‌లు విధించారు. హ్యూస్టన్‌లోని చైనా రాయబార కార్యాలయం మూసివేయించారు. చైనా విధ్యార్థులపై ఆంక్షలు విధించారు. చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రపంచాన్ని కబళించే కుట్రలు చేస్తున్నదని ఆరోపణలు గుప్పించారు. కమ్యూనిస్టు పార్టీ నాయకుల అమెరికా ప్రయాణాలపై నిషేధం విధించారు. కెనడాపై వత్తిడి చేసి హువావే కంపెనీ సిఇఓను అకారణంగా అరెస్ట్ చేయించి రెండున్నరేండ్లుగా నిర్బంధంలో ఉంచారు. ఆఖరుకు కరోనా పుట్టుకకు కారణం చైనాయే అంటూ ప్రపంచమంతటా ప్రచారం చేశారు. పట్టుబట్టి ఈ అంశంపై విచారణ కోసం డబ్ల్యు.హెచ్.ఓ ఆధ్వర్యాన కమిటీని నియమింపజేశారు. ఇంకా అంర్జాతీయ వేదికలపై చైనాను అప్రదిష్టపాలు జేయటానికి అడుగడుగునా ప్రయత్నించారు. అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ ఓడిపోయాక కూడా ఈ ప్రయత్నాలు ఆగలేదు. ముఖ్యంగా అమెరికా స్టేట్ సెక్రటరీ మైక్ పాంపియో పదవిలోంచి దిగిపోవటానికి ముందు రోజు దాకా చైనాకు వ్యతిరేకంగా అనేక చర్యలు, ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లు అమల్లోకి తెచ్చారు. ఒకవైపు మానవాళి మొత్తాన్నే కబళించటానికి కరోనా మహమ్మారి విజృంబిస్తుంటే దానిని కట్టడి చేయటం గురించి కాకుండా ఈ రకమైన దాడులు చైనాపైనేగాక ఇంకా ఇతర సోషలిస్టు దేశాలపైనా, వామపక్ష ప్రభుత్వాలపైనా, తనకు మిత్రులుగాని దేశాలపైనా అమెరికా అమలుచేసింది.

**ట్రంప్ ఓడి .. బైడెన్ వచ్చినా ! :**

కోవిడ్ నియంత్రణలో వైఫల్యాలు వెంటాడి ట్రంప్ ఎన్నికల్లో ఓడిపోయాడు. డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి జో బైడెన్ అధికారంలోకి వచ్చాక కొన్ని ఆంతరంగిక పాలనాంశాలలో మార్పులు మినహా విదేశాంగ విధానంలో, ముఖ్యంగా చైనా తదితర సోషలిస్టు దేశాల పట్ల వైఖరిలో పెద్ద తేడా ఏమీ ఉండే అవకాశం కనిపించటం లేదు. అమెరికా కొత్త అధ్యక్షుడు జో బైడెన్ తన విదేశాంగ విధానం గురించి, ముఖ్యంగా చైనా పట్ల వైఖరి గురించి మొదటి సారిగా ఫిబ్రవరిలో మాట్లాడాడు. ఆయన అన్న మాటలివి.. "ట్రంప్‌లాగా కాకుండా చైనాతో అమెరికా ప్రయోజనాల కోసం కలిసి పనిజేస్తాం. అయితే నిబంధనలుంటాయి. వాటిని పాటించాలి. చైనాయే మా ప్రధాన పోటీదారు". దీనికి చైనా అధికార పత్రిక 'గ్లోబల్ టైమ్స్' ఇలా స్పందించింది.. "స్నేహ పూర్వక పోటీకి చైనా సిద్ధమే. అంతర్జాతీయ నిబంధనలు అనేవి అందరి ప్రయోజనాల కోసం ఉండాలి. అమెరికా ప్రయోజనాల కోసం మాత్రమే కాదు" అని. అంతకు ముందు అధ్యక్షుడు బైడెన్ టీమ్‌లో విదేశాంగ మంత్రిగా ఎంపికైన ఆంటోనీ బ్లింకెన్ తన అప్పాయింట్‌మెంట్ ఇంటర్వ్యూలో ఇలా చెప్పాడు.. "ట్రంప్ తీసుకున్న ఇతర వైఖరులతో నాకు విభేదం ఉన్నా చైనా పట్ల తీసుకున్న వైఖరిని మాత్రం సంపూర్ణంగా సమర్థిస్తాను. దానినే మేమూ కొనసాగిస్తాం" అని స్పష్టంగా చెప్పాడు. దీనిని బట్టి కొత్త అధ్యక్షుడు బైడెన్ కూడా చిన్న, చిన్న తేడాలేమైనా ఉన్నా సారాంశంలో ట్రంప్ తీసుకున్న చైనా

వ్యతిరేక వైఖరినే కొనసాగించే అవకాశాలున్నా యనేది స్పష్టం.

**చైనా అంటే ఎందుకు వ్యతిరేకం ? :**

చైనా పట్ల అమెరికా ఈ వ్యతిరేక వైఖరికి చూపుతున్న కారణాలేమిటి? చైనాలో ప్రజాస్వామ్యం లేదనీ, మానవహక్కులు, పౌరహక్కులు పాటించబడటం లేదనీ, ఆర్థిక వ్యవహారాలలో పారదర్శకత పాటించటం లేదనీ ఆరోపణలు చేస్తుంటారు. జిన్‌జియాంగ్ రాష్ట్రంలో వుయ్‌గర్ ముస్లింల సమస్య, హాంగ్‌కాంగ్, టిబెట్, తైవాన్ సమస్యలు ఇందుకు ఉదాహరణగా అమెరికా, ఇతర పాశ్చాత్య దేశాలు చూపుతుంటాయి. ఈ ఆరోపణలు ఎలా కల్పితాలో, అక్కడ జరుగుతున్న వాస్తవాలేమిటో చైనా ఎప్పటికపుడు సమాధానాలు చెబుతూనే ఉంది. అంతేగాక అవన్నీ చైనా అంతరంగిక సమస్యలు. చైనా తన ప్రజలను ఎలా పరిపాలిం చాలో ఇతర ప్రభుత్వాలు చెప్పలేవు గదా!. ఎన్నాళ్లుగానో ఈ సమస్యలన్నీ ఉన్నా చైనాతో సత్సంబంధాలు అమెరికా కొనసాగించింది కదా? ఇపుడు ఆకస్మాత్తుగా చైనా వ్యతిరేక ప్రచారానికి, మిలటరీ పరమైన కూటములతో దాని కట్టడికీ ఎందుకు అమెరికా పూనుకుం టోంది. పైకి చెప్పే కారణాలు కాకుండా ఇందుకు అసలు కారణాలు వేరే ఉన్నాయి.

సోవియట్ యూనియన్‌ను విచ్ఛిన్నం చేసినట్లుగానే చైనాలో సోషలిజాన్ని కూడా కబళించాలనేది అమెరికా అసలు పన్నాగం. ప్రపంచీకరణ, సరళీకరణ ఆర్థిక విధానాల అమలుతో చైనా క్రమంగా రాజకీయంగా కూడా 'లిబరల్ డెమొక్రసీ' వైపుగా మారుతుం దనేది వాళ్ల అంచనా. ఇన్నాళ్లూ ఆ ఆశతోనే చైనాతో సఖ్యంగా ఉన్నారు. కానీ చైనా సరళీ కరణ ఆర్థిక విధానాలను తన అభివృద్ధికి ఉ పయోగించుకుంటూనే ఆర్థికవ్యవస్థపై ప్రభుత్వ పట్టును మాత్రం చెదరనీయటం లేదు. సోషలిస్టు పంథాను వీడలేదు. 2001లో డబ్ల్యు.టి.వో లోకి ప్రవేశించాక చైనా ఆర్థికశక్తి అమోఘంగా పెంచుకోగలిగింది. ఇపుడు ప్రపంచంలో రెండో ఆర్థికవ్యవస్థగా ఉంది. 2028 నాటికల్లా అమెరికాను మించిపోయి మొదటి శక్తిగా నిలుస్తుందనేది అందరూ అంగీకరిస్తున్న సత్యం. మిలటరీ పరంగా కూడా అమెరికాకు దీటైన శక్తిగా చైనా తయారవుతోంది. 2008 నుండి ప్రపంచం ఎదుర్కొంటున్న ఆర్థిక మాంద్యాన్ని చైనా జయప్రదంగా ఎదుర్కొంది. కోవిడ్ మొదట సోకింది చైనాలోనే అయినా ప్రభు

❝ కానీ చైనా సరళీ కరణ ఆర్థిక విధానాలను తన అభివృద్ధికి ఉపయోగించుకుంటూనే ఆర్థికవ్యవస్థపై ప్రభుత్వ పట్టును మాత్రం చెదరనీయటం లేదు. సోషలిస్టు పంథాను వీడలేదు. 2001లో డబ్ల్యు.టి.వో లోకి ప్రవేశించాక చైనా ఆర్థికశక్తి అమోఘంగా పెంచుకోగలిగింది. ఇపుడు ప్రపంచంలో రెండో ఆర్థికవ్యవస్థగా ఉంది. 2028 నాటికల్లా అమెరికాను మించిపోయి మొదటి శక్తిగా నిలుస్తుందనేది అందరూ అంగీకరిస్తున్న సత్యం.❞



సైన్యాల ఉపసంహరణ కోసం చర్చలకు సన్నద్ధమైన భారత, చైనా సైనిక అధికారులు

త్వమూ, ప్రజలు పెద్దఎత్తున కేంద్రీకరించి కృషి చేయటం ద్వారా ఆ మహమ్మారి నుండి బయటపడ గలిగారు. ప్రపంచంలోని ప్రధాన ఆర్థికవ్యవస్థలన్నీ 2020లో మైనస్ అభివృద్ధిని రికార్డు చేస్తే ఒక్క చైనాలో మాత్రం జిడిపి 2.3శాతం అభివృద్ధిని నమోదు చేయగలిగింది. 2021లో కూడా 7శాతం పైగా అభివృద్ధి ఉంటుందని ఐఎంఎఫ్ అంచనా వేస్తున్నది.

**పెరుగుతున్న చైనా పలుకుబడి :**

ఈ పరిణామాలతో ప్రపంచ దేశాలలో చైనా పలుకుబడి కూడా గణనీయంగా పెరిగి ంది. ముఖ్యంగా బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ ద్వారా చైనా ప్రభుత్వ కంపెనీలు, ఆర్థిక సంస్థలు, బ్యాంకుల సహకారంతో అనేక దేశాలలో హైవేలు, ఎనర్జీ ప్రాజెక్టులు, పోర్టులు, రైల్వేలైన్లు తదితర అభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టింది. ఇప్పటివరకూ మొత్తం 138 దేశాలు ఈ ప్రాజెక్టు క్రింద చైనాతో ఒప్పందాలు చేసుకున్నాయి. గత 7 సంవత్సరాలుగా నిర్మాణ పనులు సాగు తున్నాయి. ఆసియా, మధ్యప్రాచ్యం, ఆఫ్రికా, యూరప్ దేశాలను సముద్ర, భూ మార్గాల ద్వారా కలిపి వ్యాపార రూట్లను నిర్మించటం ఈ ప్రాజెక్టు లక్ష్యంగా ఉంది. ఒబామా కాలంలో దీనికి విరుగుడుగా సిపిటిపిపి లాంటి కూటములకు ప్రయత్నాలు జరిగినా ట్రంప్ వాటినుండి వైదొలగటంతో అవేవీ సఫలం కాలేదు. కోవిడ్ కాలం సంక్షోభాలను చైనా జయప్రదంగా అధిగమించటం, అమెరికా దారుణంగా విఫలం కావటంతో ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారీ వ్యవస్థ వైఫల్యాలు ప్రముఖంగా చర్చకు రావట ప్రారంభమైంది. ఆశించిన విధంగా చైనా సోషలిజం లిబరల్ పాలసీల వల్ల బలహీన పడకపోగా ఆర్థికంగా, రాజకీయంగా చైనా బలపడటం అమెరికాకు కంటగింపుగా తయారైంది. చైనా ఆర్థిక శక్తిని దెబ్బగొడితే తప్ప దానినేమీ చేయలేమనే అంచనాకు అమెరికా రావటమే ట్రంప్ కాలంలో ఆరంభించిన 'ట్రేడ్ వార్' అంతర్యం అనేది వాస్తవం. ప్రపంచ ప్రధాన ఆర్థిక కేంద్రాలైన ఆసియా, యూరోప్ దేశాలను తన

**“ ఈ అనుభవాలతో ఇటీవలి వరకూ అమెరికాను అతిగా నమ్మిన మనదేశం కూడా చైనాతో సరిహద్దు ఉద్రిక్తతను సడలించు కోవటానికి, ఇరువురి సైన్యాలనూ సరిహద్దుల నుండి ఉపసంహరించు కోవటానికి చొరవ తీసు కోవటం మంచి నిర్ణయం. చైనా పెట్టు బడులపై ఇదివరకు విధించిన ఆంక్షల విషయంలో కూడా మన ప్రభుత్వం పునరాలో చిస్తున్నట్లుగా కొన్ని పత్రికలు ఇటీవల వార్తలు ప్రచురించాయి. ”**

ఆధిపత్యంతో చైనాకు వ్యతిరేకంగా నిలబెట్టాలని అమెరికా పథకాలు పన్నింది.

అందులో భాగంగానే దక్షిణ చైనా సముద్ర జలాలపై హక్కుల విషయంలో చైనాతో విభేధాలున్న వియత్నాం, ఫిలిప్పీన్స్ లాంటి ఆగ్నేయాసియా దేశాలను అక్కున చేర్చుకోవటానికి, వారిని చైనాపై ఎగదోలటానికి అమెరికా ప్రయత్నించింది. మరోవైపు ఇండో పసిఫిక్ పేరుతో క్వాడ్ ఒప్పందానికి ఇండియా, ఆస్ట్రేలియా, జపాన్ దేశాలను ఒప్పించింది. ఇంకోవైపున యూరోపియన్ యూనియన్ దేశాలతో ట్రంప్ కాలంలో దెబ్బతిన్న సంబంధాలను పునరుద్ధరించేందుకు ఆ దేశాలన్నింటిని చైనాకు వ్యతిరేకంగా నిలిపేందుకు బైడెన్ యంత్రాంగం తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. అలాగే కరోనాకు కారణం చైనాయే అని నిరూపిం చేందుకు డబ్ల్యుటివో కమిటీ ద్వారా ప్రయత్నం చేసింది. కానీ అమెరికా ప్రయత్నాలు ఫలించకపోగా, అనూహ్యమైన ఎదురు దెబ్బలు తగిలాయి. తాను కూటములు నిర్మించాలనుకున్న దేశాలన్నీ చైనాతో ఆర్థిక ఒప్పందాలలోకి ప్రవేశించాయి.

**ఆర్.సి.ఇ.పి. ఒప్పందం :**

2020 నవంబర్ 15న, చైనాతో 10 ఆగ్నేయాసియా దేశాలు సహా, మొత్తం 15 దేశాల మధ్య ఆర్.సి.ఇ.పి (రీజినల్ కాంప్రెహెన్సివ్ ఎకనామిక్ పార్టనర్‌షిప్) ఒప్పందం జరిగింది. ప్రపంచంలోనే అతి పెద్ద 'ఫ్రీ ట్రేడ్' ఒప్పందం ఇది. ఫ్రీ ట్రేడ్ అంటే టాక్స్‌లు, సుంకాలు లేని వ్యాపారం. ప్రపంచ జనాభాలో 30 శాతం జనాభా 35 శాతం జిడిపి ఉన్న ఈ దేశాలు పరస్పరం ఈ ఒప్పందం ద్వారా లాభం పొందుతాయి. ఈ దేశాలలో చైనాతో పాటు పది ఏసియాన్ దేశాలు (బ్రూనే, కంబోడియా, ఇండోనేసియా, లావోస్, మలేషియా, మయన్మార్, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయ్ లాండ్, వియత్నాం), ఆస్ట్రేలియా, జపాన్, దక్షిణ కొరియా, న్యూజిలాండ్ దేశాలున్నాయి. విస్తారమైన చైనా మార్కెట్‌పైన ఆధారపడి ఈ దేశాలన్నీ కోవిడ్ అనంతర ఆర్థికాభివృద్ధిని సాధించే ప్రయత్నంలో ఉన్నాయి. ఈ దేశాలలో కొన్నింటికి దక్షిణ చైనా సముద్ర జలాల విషయంలో ఉన్న తేడాలను చర్చల ద్వారా పరిష్కరించుకుంటామని అవి ప్రకటించటం గమనార్హం.

**చైనా – యూరోపియన్ యూనియన్ ఒప్పందం:**

మరో ముఖ్యమైన ఒప్పందం డిశంబర్ 30న జరిగింది. 27 దేశాలున్న యూరోపియన్ యూనియన్ చైనాతో పెట్టుబడుల ఒప్పందంపై అంగీకారానికి వచ్చింది. ఈ ఒప్పందానికి జర్మనీ ఛాన్సలర్ ఏంజెలా మెర్కెల్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమాన్యుయేల్ మెక్రాన్ ఎక్కువ చొరవ చూపించారు. అప్పటికింకా జో బైడెన్ అధికారంలోకి రాలేదు. అయినా ఈ ఒప్పందాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించాడు. బైడెన్ భద్రతా సలహాదారుగా ఎంచుకున్న 'జేక్ సల్లివాన్' యూరోపియన్ యూనియన్ దేశాలనుద్దేశించి బహిరంగంగా ఒక ప్రకటన చేసాడు. ఏమనంటే 'బైడెన్ ప్రమాణ స్వీకారం కాగానే యూరోపియన్ మిత్రులతో సమావేశం కావటానికి, చైనాను ఎలా కట్టడి చేయాలనే దానిపై చర్చించటానికి చాలా ఆసక్తిగా ఉన్నారని, చైనాతో ఒప్పందానికి అపుడే తొందర పడొద్దని' ప్రకటన చేశాడు. అయినా సరే ఈ విజ్ఞప్తులేవీ ఖాతరు చేయకుండా, ఇటలీ, పోలండ్ లాంటి కొన్ని దేశాల అభ్యంతరాలను పక్కనబెట్టి మరీ డిశంబర్ 30న చైనా అధ్యక్షుడితో జరిగిన ఆన్ లైన్ సమావేశంలో యూరోపియన్ దేశాల నేతలు ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం యూరోపియన్ పార్లమెంట్ ఆమోదం పొందితే 2022 ప్రారంభం నాటికి అమల్లోకి వస్తుంది. ట్రంప్ కాలంలో యూరోపియన్ దేశాలతో అమెరికా సంబంధాలు దెబ్బతిన్నాయి. వాటిపై ఆయన అనేక ఆంక్షలు విధించి ఉక్కపోతకు గురి చేశాడు. ఆ అనుభవాలతో అంతర్జాతీయ వ్యవహారాలలో 'స్వతంత్రం'గా వ్యవహరించాలని అవి నిర్ణయానికి వచ్చాయి. అంత మాత్రాన అవి అమెరికాకు వ్యతిరేకమని కాదు గానీ ఇదివరకులాగా అమెరికా ఏం చెబితే దానికి తలూపటం కాకుండా తమ స్వంత ప్రయోజనాలు రక్షించుకోవటానికి స్వతంత్రంగా వ్యవహరించటానికి సిద్ధపడుతున్నాయి.

**చైనా – సి.ఇ.ఇ.సి సమావేశం :**

ఫిబ్రవరి 9న చైనా అధ్యక్షుడు షీజిన్‌పింగ్ అధ్యక్షతన సెంట్రల్ యూరోప్, ఈస్ట్రన్ యూరోప్ (సిఇఇసి) దేశాల సమావేశం జరిగింది. రాబోయే కాలంలో చైనా, యూరోపు దేశాల వ్యాపార సంబంధాలను మరింత బలోపేతం చేయాలని నిర్ణయాలు తీసుకుంది. ఒకవైపు అమెరికా అధ్యక్షుడు బైడెన్ చైనాను ప్రధాన పోటీదారుగా చిత్రించేందుకు, దానికి వ్యతిరేకంగా యూరోపియన్ దేశాలను కూడగట్టేందుకు ప్రయత్నిస్తున్న నేపథ్యంలో జరిగిన ఈ సమావేశం అమెరికాకు గట్టి సంకేతాలిచ్చింది. "చైనా మాకు పోటీదారు కాదు. చైనాతో స్నేహమే మాకు ఆర్థికాభివృద్ధిని చేకూరుస్తుంది. మాకు మీ నినాదాలు అవసరం లేదు" అని చెప్పినట్లయింది.

ఈ అనుభవాలతో ఇటీవలి వరకూ అమెరికాను అతిగా నమ్మిన మనదేశం కూడా చైనాతో సరిహద్దు ఉద్రిక్తతను సడలించు కోవటానికి, ఇరువురి సైన్యాలనూ సరిహద్దుల నుండి ఉపసంహరించు కోవటానికి చొరవ తీసు కోవటం మంచి నిర్ణయం. చైనా పెట్టు బడులపై ఇదివరకు విధించిన ఆంక్షల విషయంలో కూడా మన ప్రభుత్వం పునరాలోచిస్తున్నట్లుగా కొన్ని పత్రికలు ఇటీవల వార్తలు ప్రచురించాయి. అలాగే పాకిస్తాన్‌తో కూడా కాల్పుల విరమణ ఖచ్చితంగా అమలు జరపాలని ఇరుదేశాల సైనిక అధికారులూ నిర్ణయించుకోవటం కూడా మనకు మంచి చేస్తుంది. పొరుగుదేశాలతో ఘర్షణల కంటే పరస్పర సహకారమే ఆర్థికాభివృద్ధికి, శాంతి సుస్థిరతలకు తోడ్పడుతుంది.

**కరోనా జన్మస్థానం వూహాన్ ల్యాబ్ కాదు :**

కరోనా వైరస్‌కు కారణమైన వైరస్ జన్మస్థానమేది? అనే విషయం నిర్ధారిం చేందుకు ఏర్పడ్డ

(తరువాయి 34వ పేజీ)

పార్టీ నిర్మాణం

# సమ సమాజం కోసం పోరాటం అంటే...!

ఎస్.వీరయ్య



రచయిత సిపిఐ(ఎం) కేంద్రకమిటీ సభ్యులు

**శ్రమ దోపిడీ లేని సమాజం కోసం పోరాటం అంటే ఏమిటి?**
**ప్రత్యామ్నాయ సంస్కృతి అంటే ఏమిటి?**
**నిత్య జీవితంలో దాన్నెలా ఆచరించాలి.**

ఔను..... సిద్ధాంతపరంగా దోపిడీ రహిత సమాజం కోసం పోరాడాలంటున్నాం. మనువాద సంస్కృతికీ, పాలకవర్గ సంస్కృతికీ ప్రత్యామ్నాయం కావాలంటున్నాం. సిద్ధాంత పరంగా చెప్పటం వరకు బాగానే ఉన్నది. ఇది ఆచరణలో పెట్టటమే అసలైన సమస్య. సాధారణ సభ్యులకూ, కమ్యూనిస్టు అభిమానులకు ఈ విషయంలో స్పష్టత అవసరం. ఆగ్జిలరీ గ్రూపులలో ఉన్నపుడే ఈ అంశాల మీద ఒక అవగాహనకు రావటం అవసరం. వీటి మీద చర్చించాలి. వర్గ సంఘర్షణకు సిద్ధపడాలి. కార్మికులను, ఇతర శ్రామికులను సమీకరించటం, పోరాడటం ఒక సామూహిక ప్రక్రియ. యాజమాన్యాలను, భూస్వాములను, పోలీసులను, ఇతర ప్రభుత్వ యంత్రాంగాన్నీ ఎదుర్కొని నిలబడవల్సి వస్తుంది. కష్టనష్టాలకు తట్టుకుని పోరాడవల్సి వస్తుంది. సామాజిక, సాంస్కృతిక రంగాలలో ఈ పోరాటం సామూహికంగా ఉండకపోవచ్చు. అనేక సందర్భాలలో వ్యక్తిగతంగా పరీక్షకు తట్టుకుని, వత్తిడులకు తలొగ్గకుండా ధైర్యం ప్రదర్శించవల్సి వస్తుంది.

దోపిడీ రహిత సమాజం కోసం అనేక రంగాలలో పోరాడవల్సి ఉంటుంది. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ తదితర రంగాలలో వర్గపోరాటం చేయాలి. అంటే కార్మికవర్గం, ఇతర శ్రామికుల జీవితంలో ఎదుర్కొనే అన్ని రకాల సమస్యల మీద కృషి చేయాలి. ఇది కూడా చెప్పటం సులభమే. ఆచరణే ముఖ్యం.

ఆర్థికరంగంలో వర్గపోరాటం సులభంగానే అర్థమవుతుంది. కార్మికులు పనిచేస్తున్న పరిశ్రమలో యాజమాన్యం దోపిడీని ప్రత్యక్షంగా ఎదుర్కొంటారు. కాంట్రాక్టర్లు, వ్యాపారుల దోపిడీని సులభంగానే గ్రహించగల్గుతారు. వేతనాల పెంపు కోసం, ఇతర సౌకర్యాల కోసం, చట్టపరమైన హక్కుల అమలు కోసం తమ యజమానితో పోరాడుతారు. పెట్టుబడిదారీ వర్గం మీద పోరాటం ఆవశ్యకతను వివరించినపుడు అర్థం చేసుకుంటారు. భూస్వామి మీద పోరాటం గానీ, ధనిక రైతు మీద పోరాటం ఆవశ్యకత గానీ వ్యవసాయ కూలీలు, పేద రైతులు సులభంగానే గ్రహిస్తారు. శ్రమదోపిడీని ప్రత్యక్షంగా అనుభవిస్తున్న వీరిని భూమికోసం, కూలిపెంపు కోసం, వెట్టిచాకిరీ నుండి విముక్తి కోసం, హక్కుల అమలు కోసం సమీకరించి పోరాడవచ్చు. దోపిడీ లేని సమాజం కోసం సాగే పోరాటంలో కార్మికవర్గం నాయకత్వ పాత్ర వహిస్తుంది. రైతులు, వ్యవసాయ కార్మికులతో కలిసి నడవాల్సి ఉంటుంది. ఇతర మిత్రుల మద్దతు కూడగట్టాలి. అందువల్ల కార్మికవర్గం, వ్యవసాయ కూలీలు, పేదరైతులు పునాదివర్గాలు. వీరిని సమీకరించి పోరాడటం ద్వారానే ఇతర మిత్రులను ఆకర్షించగల్గుతారు. ఈ రంగాలలో జరిగే పోరాటాలు, వీరు ప్రదర్శించే ఐక్యత ద్వారానే సమాజంలోని ఇతర ప్రజాస్వామ్యవాదుల మద్దతు కూడగట్టగలుగుతారు. కార్మికరంగంలో ఒక కంపెనీలో కార్మికులను సంఘటితం చేయటం, ఒక పారిశ్రామిక ప్రాంతంలో సంఘటితం చేయటం, నివాస ప్రాంతాలలో అసంఘటిత కార్మికులను సంఘటితం చేయటంతో ఈ కృషి మొదలవుతుంది. వ్యవసాయ రంగంలో గ్రామస్థాయి కృషి ప్రధానం. గ్రామంలో వ్యవసాయ కూలీలను, పేదరైతులను సంఘటితం చేయటం ద్వారా మొదలవుతుంది. క్షేత్ర స్థాయిలో బలమైన పునాదులు పడాలంటే అనేక కంపెనీలలో, పారిశ్రామిక ప్రాంతాలలో, నిర్దిష్ట నివాస ప్రాంతంలో అసంఘటిత కార్మికులను సంఘటితం చేయాలి. గ్రామాలలో వ్యవసాయ కూలీలను, పేదరైతులు, కౌలు రైతులను కూడగట్టాలి.

సామాజిక రంగంలో పోరాటం సంక్లిష్టమైనది. కులవ్యవస్థతోనూ, పురుషాధిక్యత తోనూ ముడిపడి ఉన్నది. ఆర్థికాంశాలతో పెనవేసుకుని ఉన్నది. భావజాల రంగంలోనూ సునిశితమైన పోరాటం చేయాలి. బాధితులను సమీకరించటం, సంఘటితం చేయటంలో అనేక అవాంతరాలను అధిగమించాల్సి ఉంటుంది. భూస్వామ్య సమాజంలో పెత్తందార్ల ప్రయోజనాల కనుగుణంగానే కులవ్యవస్థ బలపడింది. కానీ కులాన్ని సాధారణ ప్రజలు తమదిగా భావిస్తున్నారు. పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నారు. దోపిడీలేని సమాజం కోసం జరిగే పోరాటంలో తమకు కులం ఆటంకమవుతుందని గ్రహించటం అంత సులభం కాదు. నిచ్చెనమెట్ల కులవ్యవస్థలో ప్రతి కులం, తనకన్నా కింది కులాలుగా తాను భావిస్తున్న వారిమీద పెత్తనం చేసేందుకు ప్రయత్నిస్తుంది. తనకన్నా పై కులాలని భావిస్తున్న వారినుంచి వివక్షను ఎదుర్కొంటుంది. ఈ కులవ్యవస్థే గ్రామీణ పేదలు ఐక్యం కాకుండా చూసేందుకు పెత్తందార్లకు వరప్రసాదంగా ఉన్నది. కులవివక్ష మీద పోరాటానికి పేదలు అంత సులభంగా సిద్ధపడరు. కుల కట్టుబాట్లను వారు నమ్ముతూ ఉండటం ఒక కారణం. పెత్తందార్ల భూమి మీదనే కూలీలుగా వెళ్ళవల్సి రావటం మరొక కారణం. కులవివక్షను ప్రశ్నిస్తే కూలికి పిలవరనే భయం కూడా పనిచేస్తుంది. పెత్తందార్లతో ఉన్న అప్పుల బంధం కూడా ఒక అడ్డంకి. అందువల్ల కార్మికుల వేతనాల పెంపు కోసం, ఇతర సౌకర్యాల కోసం, వ్యవసాయ కూలీల కూలిపోరాటాలు, ఉపాధి కోసం, అప్పుల కోసం పోరాటాలు చేయాలి. రైతులు అప్పులూ, మద్దతు ధర కోసమూ పోరాడాలి. ఆర్థికంగా చితికిపోయిన వృత్తిదారులకు ప్రత్యామ్నాయ ఉపాధి కోసం పోరాడాలి. వీటితోపాటు కులవివక్ష మీద పోరాటం కూడా చేయాలి. ఇతర పోరాటాలు లేకుండా కేవలం కులవివక్ష మీద చేసే కృషి,

**❝ సాధారణ ప్రజలలో సంప్రదాయాల పేరుతో బలంగా జీర్ణించుకుని ఉన్న భూస్వామ్య భావజాలం ఫలితంగానే ఈ ఘర్షణ కుటుంబం నుంచే మొదలవుతుంది. తల్లిదండ్రులు, బంధు మిత్రులతోనే.... ఒంటరిగా ఘర్షణ పడవల్సి రావచ్చు. ఒత్తిడులను తట్టుకుని లక్ష్యసాధన కోసం పట్టుదలగా నిలబడాలి. కుటుంబసభ్యులు గానీ, బంధుమిత్రులుగానీ ఏ దురుద్దేశంతోనో ఒత్తిడి చేస్తున్నారనుకుంటే పొరపాటు. సంప్రదాయాలను ప్రశ్నించటమంటే చెడి పోవటమని వారు నమ్ముతారు. ❞**

నిలదొక్కుకునేందుకు పరిమితు లుంటాయి.

పురుషాధిక్యత కూడా ఒక సంక్లిష్ట సమస్యగా ముందుకొస్తున్నది. ఉన్నత చదువులు చదివిన మధ్యతరగతి ఉద్యోగులు, సాధారణ కార్మికులు, వ్యవసాయ కూలీలు, ఇతర శ్రామికులు కూడా స్త్రీ పురుష సమానత్వాన్ని అంగీకరించరు. స్త్రీలు కూడా పతియే ప్రత్యక్ష దైవమని నమ్ముతున్న సమాజం. ఇది భూస్వామ్య సమాజం నుంచి వారసత్వంగా సంక్రమించిన జాడ్యం. తప్పుడు సంప్రదాయం. మహిళను పురుషులు తమ ఆస్తిగా పరిగణిం చటం, పెట్టుబడిదారీ సమాజంలో స్త్రీని వ్యాపార సరుకుగా పరిగణించటం వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. ఒకవైపు కష్టజీవుల ఐక్యతకు ఆటంకం... మరోవైపు మహిళల మీద పని స్థలాలతో సహా, అన్ని చోట్లా వేధింపులు పెరుగుతున్నాయి. లైంగిక వేధింపులకు, దాడులకు వ్యతిరేకంగా శ్రామికులంతా నిలవాలి. మహిళల స్వతంత్ర వ్యక్తిత్వాన్ని గౌరవించాలి. ఆనంద్, గోదావరి లాంటి సినిమాలలో చూసి ఆనందించటం, దర్శకులను అభినందించటం వేరు. నిత్య జీవితంలో వీటిని అంగీకరించటం వేరు.

సాంస్కృతిక రంగంలో పోరాటం మరింత సున్నితమైంది. వ్యక్తిగతంగా తలపడవల్సిన రంగం కూడా. కుల కట్టుబాట్లు ఛేదించాలి. మతం పేరుతో ప్రజల మధ్య విభజన ప్రయత్నాలను నిలువరించాలి. మూఢ నమ్మ కాలకు దూరంగా ఉండాలి. ప్రజల మధ్య శాస్త్రీయ దృక్పథం పెంపుదలకు కృషి చేయాలి. సంప్రదాయాల పేరుతో జరిగే అశాస్త్రీయ క్రతువుల పట్ల కుటుంబానికీ, శ్రామికులకూ, ఇతర ప్రజానీకానికి శాస్త్రీయ అవగాహన కల్పించాలి. ఇలాంటి సమస్యల పట్ల ఒత్తిడి సొంత కుటుంబం నుంచే ప్రారంభమ వుతుంది. సాధారణ ప్రజలలో సంప్రదా యాల పేరుతో బలంగా జీర్ణించుకుని ఉన్న భూస్వామ్య భావజాలం ఫలితంగానే ఈ ఘర్షణ కుటుంబం నుంచే మొదలవుతుంది.

తల్లిదండ్రులు, బంధుమిత్రులతోనే.... ఒంటరిగా ఘర్షణ పడవల్సి రావచ్చు. ఒత్తిడులను తట్టుకుని లక్ష్యసాధన కోసం పట్టుదలగా నిలబడాలి. కుటుంబసభ్యులు గానీ, బంధుమిత్రులుగానీ ఏ దురుద్దేశంతోనో ఒత్తిడి చేస్తున్నారనుకుంటే పొరపాటు. సంప్రదాయాలను ప్రశ్నించటమంటే చెడి పోవటమని వారు నమ్ముతారు. దేవుడికి కోపం వస్తుందని భయపడతారు. బంధుమిత్రులకు దూరం కావల్సి వస్తుందని ఆందోళన చెందు తారు. పొరపాటు అభిప్రాయాలతో ఉన్నారనీ, వారిని సరిదిద్దటం కోసమే తాము వత్తిడి చేస్తున్నామని నమ్ముతారు. అందువల్ల వ్యక్తిగతంగా వారెవరూ శత్రువులు కాదు. అత్యంత ఆప్తులు కూడా. కానీ భూస్వామ్య సమాజ, మనువాద భావజాలం ప్రభావంతోనే బలమైన మూఢ విశ్వాసాలు ప్రదర్శిస్తారు. ఈ భావజాలం కార్మికవర్గానికీ, శ్రామికులకు శత్రుపూరితం. ఆ నమ్మకాలతో ఉన్న కుటుంబీ కులనూ, బంధుమిత్రులనూ శత్రువులుగా చూడవద్దు. కానీ వారంతా కలిసి తీవ్రమైన ఒత్తిడి చేస్తారు. భయపెడతారు. వెలివేస్తా మంటారు. బంధాలు తెంచుకుంటామంటారు. కుల గౌరవాన్నీ, పరువు ప్రతిష్టలు మంట గలుపుతున్నావని నిందలు వేస్తారు. అయినా పట్టుదలతో, మనో నిబ్బరం ప్రదర్శించాలి. ఇది కత్తిమీద సాములాంటిదే.


కులాంతర, మతాంతర వివాహాలు కొత్త కాదు. కమ్యూనిస్టులు మాత్రమే చెపుతున్నవి కూడా కాదు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలం నుంచే.... స్వాతంత్ర్యోద్యమ కాలం నుంచే కులమతాల కతీతంగా, మూఢ నమ్మకాలకు అతీతంగా ఆదర్శ వివాహాలు అనేకం జరిగాయి. ఉద్యమ బంధంతో కలిసిన ప్రేమ వివాహ బంధాలు అవి. వీటికన్నా ముందునుంచే ఈ కట్టుబాట్లను, మూఢ నమ్మకాలను ప్రశ్నించే ధోరణులు అనాదిగా వస్తున్నవే. "కులముగలవాడు, గోత్రమ్ము గలవాడు/విద్యచేత విర్రవీగువాడు/పసిడి గలవాని బానిస కొడుకురా" అన్నది మనందరికీ తెలిసిన వేమన పద్యం. "మంచి అన్నది మాల అయితే మాలనేనవుదున్" అన్నాడు మహాకవి గురజాడ. వీటితో నిమిత్తం లేకుండానే, సమాజంలో వస్తున్న ఆర్థిక, సాంఘిక మార్పుల ఫలితంగానే, సంఘసంస్కర్తలూ, కమ్యూనిస్టు లతో ఏ మాత్రం సంబంధం లేని వారు కూడా సంప్రదాయ బంధాలు తిరస్కరిస్తున్న సంద ర్భాలు అనేకం. ఉన్నత చదువులు కలిసి చదువుతున్న సందర్భాలు, ఒకే కంపెనీలో లేదా కార్యాలయంలో లేదా వ్యాపార సంస్థలో పనిచేస్తున్న సందర్భంగా పరస్పరం అర్థం చేసుకుని దగ్గరవుతున్నవారు గణనీయంగానే ఉన్నారు. స్వగ్రామం వదిలి, పట్టణంలో నివాస ప్రాంతాలలో ఏర్పడిన సాన్నిహిత్యం కూడా కట్టుబాట్లను వదిలి దగ్గరికి చేర్చుతున్నది. వారం రోజుల పెండ్లి... ఐదురోజుల పెండ్లి...రెండు రోజుల పెండ్లి దగ్గరి నుంచి ఒక రోజు పెండ్లి, మరో రోజు వరుడి ఇంటి దగ్గర విందుకు చేరింది. ఇప్పుడది ఒకేచోట వధూవరుల కుటుంబాలు కలిసి విందు ఏర్పాటు చేయటం కూడా చూస్తున్నాం. పాతకాలపు క్రతువులు అనేకం విస్మరిస్తున్నారు. తగ్గించుకుంటున్నారు. విదేశాలలో ఉద్యోగం చేస్తున్నవారైతే... పెండ్లి సమయానికి వచ్చి, అయ్యిందనిపించుకుని వెళ్ళిపోతున్నారు. ఆర్థిక అవసరాలే మార్పులకు మార్గం వేస్తున్నాయి. ఆధునీకరణ, పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి ఫలితమిది. సినిమారంగం ప్రభావం కూడా చెప్పుకోదగిందే. ఇతర అంశాల విషయం పక్కనబెడితే, ప్రేమకు కులమత అడ్డుగోడలు లేవన్న సందేశాన్ని ఇవ్వటంలో సినిమారంగం శక్తివంతంగా ప్రభావం చూపింది. ఈ సమాజం మారాలనీ, దాన్ని మార్చాలనీ మనం బలంగా కోరుకుంటున్నాం కదా ! ఆ క్రమంలో ఎదురయ్యే కష్టాలూ భరించాలి. ముహూర్తాలూ, తాళిబొట్టూ, మంత్రతంత్రాలూ, పూజలు అవసరమా? ప్రేమబంధాన్నీ మించిన బంధమేముంటుంది. లక్ష్య సాధనలో ఐక్య అవగాహనకు మించిన సహకారం ఎక్కడ దొరుకుతుంది? ప్రేమబంధాన్ని, పరస్పరం అర్థం చేసుకున్న ఆత్మీయతనూ, కష్టసుఖాలను సమాన బాధ్యతతో భరించే అవగాహనను కట్నకానుకలతో పోల్చగలమా? కట్నకానుకలూ, ఆడంబరాలు అవసరమా! వీటన్నింటిని ప్రశ్నించటం, వదులుకోవటం అంత సులువు కాదు. ఏటికి ఎదురీదటం కష్టమే! వాలున పడి కొట్టుకుపోవటం సులభమే ! కానీ ''ప్రాణం ఉన్న మనిషి ఏటికి ఎదురీదుతాడు. శవాలూ, కట్టెపుల్లలూ ఏటివాలునబడి కొట్టుకుపోతా" యన్నాడు ఒక రచయిత. నిజమే కదా ! మనం ప్రాణం ఉ

న్న మనుషులమే కాదు. మానవ త్వాన్నీ, ప్రేమబంధాన్ని చూస్తాం. వీటికి అడ్డు నిలిచే కుల, మత భేదాలనూ, పురుషా ధిక్యతనూ, ఆధిపత్య ధోరణులను వ్యతిరేకిస్తాం.

కులమత అడ్డుగోడలనూ, క్రతువులనూ అధిగమించటంలో ఎంతోకొంత ప్రభావం చూపిన పెట్టుబడిదారీ వ్యవస్థ ఆడంబరాలను ప్రోత్సహిస్తున్నది. సరుకుల అమ్మకాలకు ఆడంబరాలూ, దర్పం ప్రదర్శించే ధోరణులూ అవసరమే కదా! పెట్టుబడిదారీ కుటుంబాలు, ఉన్నత వర్గాలు తమ వ్యాపార ప్రయోజనాల విస్తరణకు పెండ్లిండ్లు కూడా ఒక సందర్భంగా వాడుకుంటున్నారు. డాబుసరి ప్రదర్శిస్తున్నారు. కష్టపడి సంపాదించిన సొమ్ము కాదుకదా! నీళ్ళలాగా ఖర్చు చేస్తున్నారు. చెమటోడ్చి, కష్టపడి సంపాదిస్తున్న కార్మికులకు, వ్యవసాయ కూలీలకూ, రైతులకూ, వృత్తిదారులకు అవసరం లేని ఖర్చులివి. అదనపు భారాలు. అప్పులపాలు చేస్తున్నాయి. 'జీవితంలో ఒక్కసారి చేసుకునే పెండ్లి' అనే పేరుతో దుబారాను ప్రోత్సహిస్తున్నది పెట్టుబడిదారీ సమాజం. ఇది తమ వ్యాపార ప్రయోజనం. ఆత్మాభిమానం పేరుతో, డాంబికాలకు పోయి ఎంతమంది అప్పులపాలైతే...అంతగా బడా వ్యాపారులూ, పారిశ్రామికవేత్తలూ బలిసిపోతారు.

పెండ్లి సందర్భంగానే కాదు, వీలైనన్ని ఎక్కువ పేర్లతో, ఎక్కువ సందర్భాలలో, ఎక్కువ ఖర్చు పెట్టటం పెట్టుబడిదారీ వర్గానికి అవసరం. అందుకే పెండ్లిరోజు, పుట్టినరోజు, షష్టిపూర్తి లాంటి అనేక పేర్లతో సంబురాలు జరుపుకోవటం, అలంకరణలూ, కానుకలూ ప్రోత్సహిస్తున్నారు. మన కుటుంబాలలో ఇలాంటి పేర్లతో ఖర్చు పెట్టడం అవసరమా? పుచ్చలపల్లి సుందరయ్య, భగత్‌సింగ్, అయిలమ్మ, దొడ్డి కొమరయ్యలు తమ పుట్టినరోజు జరుపుకున్న దాఖలాలు లేవు. కానీ ఇప్పుడు ప్రజలే వారి పుట్టినరోజు లేదా వర్ధంతి రోజు స్మరించుకుంటున్నారు. ఇలాంటి వాటికి ప్రాధాన్యతనివ్వటం మనం తగ్గించగల్గితే, మన కుటుంబాలలో పిల్లలకు కూడా సరైన సందేశం ఇవ్వగలం. మన పుట్టినరోజు మనం జరుపుకోవటంలో గొప్పతనమేముంది? ఒక సుందరయ్యలాగానో, ఒక భగత్‌సింగ్ లాగానో, ఒక గాంధీ లాగానో తన మరణానంతరం కూడా ప్రజలు గుర్తుపెట్టుకునే విధంగా జీవించటమే గొప్పతనమని పిల్లలకు చెప్పగలం... ఒప్పించగలం. అదే సందర్భంలో, సాధారాణ ప్రజలు ఎవరైనా, ఇలాంటి సంబురాలు జరుపుకుంటున్నపుడు, మనను ఆహ్వానిస్తే, ఏమాత్రం అవకాశం ఉన్నా వెళ్ళి ఆశీర్వదించాలి. వయసులో

**"కుటుంబంలోనూ, సమూహంలోనూ వ్యవహరించే తీరులో కూడా మనువాద భావజాలం, పురుషాధిక్యత ప్రదర్శిస్తుంటాం. ఇంట్లో తాను తిన్న పళ్ళెం తానే కడిగేవారెం దరు? కుటుంబసభ్యుల బట్టల విషయం అట్లా ఉంచితే, కనీసం తన బట్టలు తానే ఉతుక్కుని, ఆరేసి, మడత పెట్టుకునే పురుషులెంతమంది? పిల్లలకు స్నానం చేయించి, వారి ఆలనా, పాలనా చూసేవారెందరు? మార్కెట్‌కు పోయి కూరగాయలు, సరుకులు కొనుగోలు చేయటం కూడా స్త్రీల బాధ్యతగా పరిగణించటం బలంగానే ఉన్నది."**



కులాంతర వివాహం చేసుకున్న దంపతులు

పెద్దవారైతే శుభాకాంక్షలు తెలపాలి.

కుటుంబంలోనూ, సమూహంలోనూ వ్యవహరించే తీరులో కూడా మనువాద భావజాలం, పురుషాధిక్యత ప్రదర్శిస్తుంటాం. ఇంట్లో తాను తిన్న పళ్ళెం తానే కడిగేవారెం దరు? కుటుంబసభ్యుల బట్టల విషయం అట్లా ఉంచితే, కనీసం తన బట్టలు తానే ఉతుక్కుని, ఆరేసి, మడత పెట్టుకునే పురుషులెంతమంది? పిల్లలకు స్నానం చేయించి, వారి ఆలనా, పాలనా చూసేవారెందరు? మార్కెట్‌కు పోయి కూరగాయలు, సరుకులు కొనుగోలు చేయటం కూడా స్త్రీల బాధ్యతగా పరిగణించటం బలంగానే ఉన్నది. ఈ విషయాలలో కూడా పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రభావంతో కొన్ని మార్పులు చూస్తున్నాం. కుటుంబాలలో భార్యాభర్తలిద్దరూ పొద్దున్నే ఉద్యోగానికి బయలుదేరవల్సి వస్తున్నది. ఈ క్రమంలో పురుషులు కూడా ఇంటి పనులు పంచుకోవటం కొన్ని కుటుంబాలలో చూస్తున్నాం. వీరెవరూ కమ్యూనిస్టులు కాదు. ఆర్థిక అవసరాలే వారిని మార్చాయి.


పెట్టుబడిదారీ వ్యవస్థలో సహజ పరిణామంగానే కులమతాల కట్టుబాట్లను ప్రశ్నించే ధోరణి పెరుగుతున్నది. మూఢ విశ్వాసాలనూ, సంప్రదాయాలనూ, అనవసర క్రతువులను తగ్గించుకునే ధోరణి కూడా కొంతమందిలో వ్యక్తమవుతున్నది. కొన్ని కుటుంబాలలో స్త్రీ పురుషుల మధ్య పెరుగుతున్న సహకార ధోరణి కూడా ఇలాంటిదే. పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రభావమే ఇన్ని మార్పులు తెస్తుంటే.... పెట్టుబడిదారీ వ్యవస్థనే మార్చే యాలనీ, సమసమాజం సాధించాలని కోరుకునే మనం ఇంకెంత మారాలి! అవును... ఎంతో మారాలి. మనమే ఆదర్శంగా నిలవాలి. ప్రత్యామ్నాయ సంస్కృతి అంటే భూస్వామ్య, మనువాద సంస్కృతికి మాత్రమే ప్రత్యామ్నాయం కాదు. వ్యాపార ధోరణులకూ, ఆడంబరాలకూ, డాంబికాలకు కూడా ప్రత్యామ్నాయ సంస్కృతిని నిర్మించాలి. కార్మికవర్గ సంస్కృతిని ప్రదర్శించాలి. అగ్రవర్ణాలుగా చెప్పుకునే వారితోనో, సంపన్నులతోనో పోటీ పడటం ప్రత్యామ్నాయ సంస్కృతి కాదు. శ్రమైక జీవన సౌందర్యానికి విలువనీయటం, శ్రమను గౌరవించటం, ప్రేమ, అప్యాయతలకు ప్రాధాన్యతనివ్వటమే ప్రత్యామ్నాయ సంస్కృతి.

❋

# వేద కాలం - మలి దశ

## (క్రీ.పూ. 1000- 700)

**ఎం.వి.ఎస్.శర్మ**



రచయిత ప్రజాశక్తి సంపాదకులు

**ఋ**గ్వేదం తర్వాత వచ్చినవి మూడు వేదాలు- సామవేదం, యజుర్వేదం, అధర్వ వేదం. (అధర్వణవేదం అని కూడా వాడుక ఉంది) ఇవి యజ్ఞం నిర్వహించే సందర్భంలో అవసరమైన మూడు విధాల పరిజ్ఞానాన్ని కలిగివున్నాయి. మొదటిది సామ లేదా ఉద్గాత్రి. అంటే గానం చేయడం. రెండవది ఆధ్వర్యం. అంటే యజ్ఞ సూత్రాలను వల్లించడం. ఈ సూత్రాలనే యజు అంటారు. మూడవది అధ ర్వం. అంటే అగ్నిహోత్రాన్ని (నిప్పు) నిర్వహిం చడం.

యజ్ఞం జరిగే సమయంలో చేసే సామవేద గానంలో ఉండే మంత్రాలు అన్నీ దాదాపుగా ఋగ్వేదం నుండి స్వీకరించినవే. ఏ విధంగా ఆ మంత్రాలను ఆలపించాలో దానికి సంబ ంధించిన ఆరోహణ, అవరోహణ, తదితర సంగీత సంబంధ అంశాలపైన సామవేదం కేంద్రీకరణ ఉంటుంది. ఒక విధంగా చెప్పా లంటే భారతీయ సంగీత చరిత్రలో మొదటి గ్రంధంగా సామవేదం గురించి చెప్పవచ్చు. ఋగ్వేదం మొత్తం రూపొందిన అనంతరమే సామవేదం వచ్చిందని నిర్ధారించారు. కనుక సామవేదం సుమారు క్రీ.పూ. 1000 నాటికి రూపొందివుండాలి.

యజుర్వేదంలో కృష్ణ యజుర్వేదం, శుక్ల యజుర్వేదం అని రెండు భాగాలు ఉన్నాయి. కృష్ణ (నల్లని) యజుర్వేదంలో మంత్రాలతో పాటు ఆ మంత్రాలను యజ్ఞ నిర్వహణలో ఏ సందర్భంగా ఉపయోగించాలో వివరణ కూడా ఉంటుంది. శుక్ల యజుర్వేదంలో కేవలం ప్రార్ధనలు, మంత్రాలు మాత్రమే ఉంటాయి తప్ప వివరణ ఉండదు. కృష్ణ, శుక్ల యజుర్వేదం రెండింటిలోనూ ఇనుము గురించిన ప్రస్తావన ఉంది. 'శ్యామ' అని ఇనుమును అన్నారు. ఇనుము వాడకం క్రీ.పూ.1000 కాలంలో మొద లైంది. కనుక యజుర్వేదం కూడా అంతకన్నా ముందు రూపొందివుండే అవకాశంలేదు.

అధర్వవేదం నాలుగు వేదాలలోనూ అతి తక్కువ పవిత్రత కలిగినదిగా కొందరు పరిగణి స్తారు. కాని ఈ మూడు వేదాలలో అధర్వ వేదం చాలా ముఖ్యమైనది. ఈ వేదంలో కూడా ఎక్కువ భాగం ఋగ్వేదం నుండే తీసుకు న్నప్పటికీ, అదనంగా చేర్చిన సాహిత్యం కూడా గణనీయంగానే ఉంది. అధర్వవేదంలో ఉన్న భూమండల ప్రాంత వర్ణనలు పరిశీలిస్తే ఆర్యులు గంగా పరీవాహక ప్రాంతం వైపుగా విస్తరించిన కాలంలో అధర్వవేదం రూపొందిం దని విదితమౌతుంది. ఇందులో ఎక్కువ భాగం మంత్రాల రూపంలో కాకుండా, గద్య రూపం లో (వచన రూపంలో) ఉంది. అందులో ఋగ్వేదంలో మాదిరి అతి ప్రాచీనమైన భాష కాకుండా తదుపరి కాలంలో కొంత అభివృద్ధి చెందిన భాషను ఉపయోగించారు. ఇందు లోనూ ఇనుము గురించి ప్రస్తావన ఉంది. ఈ వేదం కూడా క్రీ.పూ. 1000 అనంతరమే రూపొందింది.

మలి వేదకాలం గురించి తెలుసుకోవ డానికి ఆధారాలుగా ఉపయోగపడే ఇతర సాహిత్యం కూడా ఉంది. వాటి గురించి క్లుప్తంగా తెలుసుకుందాం.

యజ్ఞంలో అనుసరించాల్సిన పద్ధతులు, ఇవ్వవలసిన బలులు(బలి అంటే కానుక), వాటి ప్రయోజనాలను వివరించేవి బ్రాహ్మణాలు. నాలుగు వేదాలకూ అనుబం ధంగా వేరువేరు బ్రాహ్మణాలు ఉంటాయి. ఋగ్వేదానికి అనుబంధంగా ఐతరేయ బ్రాహ్మణ ం, కౌశీతకి బ్రాహ్మణం ఉన్నాయి. సామ వేదానికి అనుబంధంగా జైమినీయ బ్రాహ్మణం, పంచవింశ బ్రాహ్మణం ఉంటే, కృష్ణ యజుర్వే దానికి అనుబంధంగా తైత్తీరియ బ్రాహ్మణం, శుక్ల యజుర్వేదానికి అనుబంధంగా శతపథ బ్రాహ్మణం ఉన్నాయి. అధర్వవేదానికి అనుబంధంగా గోపద బ్రాహ్మణ ం ఉంది. ఇది చాలా తరువాతి కాలంలో వచ్చినది. తొలి బ్రాహ్మణాలు క్రీ.పూ. 900-700 మధ్య కాలంలో రూపొందాయి. ఆ కాలపు సమాజ జీవన పరిస్థితులను తెలుసుకోడానికి ఇవి తోడ్పడతాయి.

ఆరణ్యకాలు బ్రాహ్మణాలకు అనుబంధంగా ఇవి వచ్చాయి. ఆత్మ గురించి, కర్మకాండల గురించి నిగూఢ విషయాలను సమాజానికి దూరంగా అడవులలో మాత్రమే తెలుసు కోవడం సాధ్యం అనే భావన నుండి వీటికి ఆ పేరు వచ్చింది. ఆరణ్యకాలలో ఎక్కువ భాగం ఋగ్వేదానికి, యజుర్వేదానికి, వాటికి అను బంధంగా ఉండే బ్రాహ్మణాలకి జతపడి వున్నాయి.

ఉపనిషత్తులు 'ఉప'+'ని'+ 'షద్' అంటే దగ్గరగా కూర్చుని రహస్యంగా విషయాలను గ్రహించడం అని అర్ధం. ఉపనిషత్తులలో రహ స్యంగా చేయవలసిన కర్మకాండల గురించి, పూజల గురించి, తాయెత్తుల గురించిన విష యాలతో బాటు తాత్విక చర్చలు కూడా ఉన్నాయి. ఈ ఉపనిషత్తులు 200 కు పైగా ఉన్నాయి. ఈ ఉపనిషత్తులలో అన్నీ మలివేద కాలంలోనే రూపొందాయని భావించరాదు. వీటిలో ఐతరేయ, కౌశీతకి, తైత్తీరియ, బృహ దారణ్యక, ఛాందోగ్య, జైమినీయ, కేన ఉపని షత్తులు వేదకాలంలోనే రూపొందాయి. కథక, ముండక, శ్వేతాశ్వర, ప్రశ్న, మహానారాయణ ఉపనిషత్తుల వంటివి క్రీ.పూ.500 తర్వాతనే వచ్చాయి.

సూత్రాలు బ్రాహ్మణాలు, తొలినాటి ఉపని షత్తుల తర్వాత సూత్రాలు రూపొందాయి. కర్మకాండలలో, యజ్ఞాలలో తప్పనిసరిగా పాటించవలసిన విధులను మరిచిపోకుండా గుర్తుపెట్టుకునే విధంగా రూపొందించినవే ఈ సూత్రాలు. కల్ప సూత్రాలు, శ్రౌత సూత్రాలు (బలులకు సంబంధించి), గృహ్య సూత్రాలు (ఇళ్ళల్లో చేయవలసిన బలులు) వంటివి ఇలా రూపొందినవే. మొత్తంగా సమాజంలో పాటించవలసిన ధర్మ సూత్రాలు వీటినుండే వచ్చాయి. శుల్వ సూత్రాలు తాడుతో పొడవు, వెడల్పు, ఎత్తు వంటివి కొలిచేందుకు రూపొం దించినవి. వేదాలను అభ్యసించేటప్పుడు ఉచ్ఛారణ ఏ విధంగా ఉండాలో శిక్ష సూత్రాలు

వివరిస్తాయి. ఒక విధంగా ఇవి తొలినాటి వ్యాకరణం అని చెప్పాలి. ఐతే ఈ సూత్రాలలో అధికభాగం క్రీ.పూ.400 తర్వాత రూపొంది నవే.

ఋగ్వేదకాలంతో పోల్చితే మలి వేద కాలంనాటికి వాటిని రూపొందించినవారు ఆగ్నేయ దిశగా తమ సరిహద్దులను విస్తరించారని స్పష్టమౌతుంది. ఈ ప్రాంతంలో కురు, పాంచాల, వషస్, ఉషినరస్ వంటి ఆర్య తెగలు జీవించాయి. కురుక్షేత్రం అంటే కురు తెగ ప్రజలు జీవించిన ప్రాంతం. ఇప్పటికీ ఆ పేరుతో ఆ ప్రాంతంలో ఒక పట్టణం ఉంది. సింధునదీ పరీవాహక ప్రాంతం నుండి గంగాయమున పరీవాహక ప్రాంతం వైపు ఈ తెగలు విస్తరించాయి.

అధర్వవేదంలోని ప్రస్తావనలను బట్టి పైన తెలిపిన తెగలు గాక, ఈశాన్య ఉత్తరప్రదేశ్, ఉత్తర బీహార్ ప్రాంతంలో కాశీ, విదేహ, వారణాసి ప్రాంతాలలో జీవించే తెగలు ఉండేవి. ఇంకా తూర్పు వైపుగా వస్తే అంగ (తూర్పు బీహార్), మగధ (మధ్యబీహార్) వంటి తెగల గురించి ప్రస్తావించారు. అదేవిధంగా ఉత్తర బెంగాల్ ప్రాంతంలోని పుండ్ర, దక్షిణాది ప్రాంతంలోని ఆంధ్ర తెగల ప్రస్తావన ఉంది. అధర్వవేద రచయితలు అంగ, మగధ ప్రాంతాల ప్రజలను శత్రువులుగా వర్ణించారు. అదే పుండ్ర, ఆంధ్ర తెగలను వెలివేయబడినవని పేర్కొన్నారు.


ఇక పశ్చిమ దిశగా చూస్తే అంబష్ఠ, గాంధార, ముజవంశ, బాల్హిక వంటి తెగల ప్రస్తావన ఉంది. ఈ తెగలకు, కురు, పాంచాల తదితర తెగలకు తీవ్ర వైరం ఉండేదని ఆ ప్రస్తావనలు సూచిస్తున్నాయి.

ఇండో-ఇరానియన్ తెగల ప్రజలలో కొన్ని తెగలవారు సింధునదికి పశ్చిమం వైపు ఇరాన్ వరకూ ఉన్న ప్రాంతంలో విస్తరిస్తే మరికొన్ని తెగలవారు సింధునదికి తూర్పువైపు గంగానది వరకూ విస్తరించారు.

ఇరానియన్‌లకు పవిత్రగ్రంథం అవేస్తను, భారతీయుల వేదాలను చారిత్రికంగా పరిశీలిస్తే వాటిలోని వివిధ ప్రస్తావనలు ఆర్యతెగల నడుమ చాలా తీవ్రంగా ఘర్షణలు, యుద్ధాలు జరిగినట్టు సూచిస్తున్నాయి. చాలా కాలం పాటు జరిగిన ఈ యుద్ధాల పర్యవసానంగా వేదకాలపు ఆర్య తెగలు క్రమంగా తూర్పువైపు, ఆగ్నేయం వైపు, అటు ఈశాన్యం వైపు విస్తరించారని తేటతెల్లమవుతుంది. ఈ విస్తరణ క్రమంలో ఆర్యేతర తెగల నుండి ఎదురైన ప్రతిఘటనలో ఆర్యులు పైచేయి సాధించారు. ఇందులో వారికి విల్లంబులు కీలక ఆయుధాలుగా ఉపయోగపడ్డాయి. వాటితో బాటు

"ఆ తర్వాత ఇనుమును ఉపయోగించే విజ్ఞానం సింధు ప్రాంతానికి, ఆ తర్వాత ఇంకా తూర్పు వైపు విస్తరించింది. అందుచేత రెండు పక్షాల మధ్య జరిగిన ఘర్షణలో ఇనుము వాడకం ముందుగా తెలుసుకున్న పక్షానిదే పైచేయి అయింది. ఆర్యులు ఉన్నత స్థాయి తెగలవారని, అంతకు ముందునుండి ఇక్కడ జీవిస్తున్నవారు తక్కువ స్థాయి వారని, అందుకే ఆర్యులు పైచేయి సాధించగలిగారని చెప్పడం పూర్తిగా తప్పు."

MAP 2.1 Late Vedic Zone




మలివేద కాలంలో ఆర్యులు విస్తరించిన ప్రాంతం

గుర్రాలను పూన్చిన రథాలను ఉపయోగించడం వారి ఆధిపత్యానికి తోడ్పడింది.

సింధునదీ పరీవాహక ప్రాంతానికి ఇటూ, అటూ ఆర్యుల తెగల నడుమ జరిగిన యుద్ధాల్లో కూడా ఈ విల్లంబులు, రథాలే ఇరానియన్-ఆర్య తెగలకు ఇండో- ఆర్య తెగలపై ఆధిపత్యం సాధించడానికి తోడ్పడ్డాయి. ప్రస్తుత ఆఫ్ఘనిస్తాన్ పరిసరాల్లో తొలుత ఇనుము కనుగొన్నారు. ఆ తర్వాత ఇనుమును ఉపయోగించే విజ్ఞానం సింధు ప్రాంతానికి, ఆ తర్వాత ఇంకా తూర్పు వైపు విస్తరించింది. అందుచేత రెండు పక్షాల మధ్య జరిగిన ఘర్షణలో ఇనుము వాడకం ముందుగా తెలుసుకున్న పక్షానిదే పైచేయి అయింది. ఆర్యులు ఉన్నత స్థాయి తెగలవారని, అంతకు ముందునుండి ఇక్కడ జీవిస్తున్నవారు తక్కువ స్థాయి వారని, అందుకే ఆర్యులు పైచేయి సాధించగలిగారని చెప్పడం పూర్తిగా తప్పు.

తెగల నడుమ తరచూ జరిగిన ఘర్షణలలో ఎక్కువ దూకుడుగా దాడులకు పాల్పడి, తన తెగకు ఎక్కువ ప్రాంతం మీద ఆధిపత్యం సంపాదించిపెట్టిన నాయకులకు గౌరవం కల్పిస్తూ, వారిని పొగడ్తలతో ముంచెత్తిన ప్రస్తావనలు అధర్వవేదంలో మనకు కానవస్తాయి. తక్కిన వారందరికీ ఆ రాజే భగవంతుడు అన్న అర్థం వచ్చే ప్రస్తావనలు ఉన్నాయి. అటువంటి నాయకులలోకెల్లా ఎక్కువ పొగడ్తలను అందుకున్నవాడు ఇంద్రుడు. తనకు అనుకూలంగా ఉండే తెగల నాయకులందరికీ ఇంద్రుడు నాయకుడు. రాజుకు గ్రామంలోని భూమిలో వాటా ఉంటుంది. గుర్రాలమందలో, గోవులమందలో కూడా వాటా ఉంటుంది. బలం ఉన్న రాజు ఇతరులను వారి భూముల నుండి తరిమివేసి, ఆ భూములతో బాటు పశువులను స్వాధీనం చేసుకునే అధికారం ఉంటుందని ఈ ప్రస్తావనలలో ఉంది.

రాజుచుట్టూ అతనికి లోబడి వ్యవహరించే వారిలో సేనాని, పురోహితుడు, రాణి, సలహాదారులు, గ్రామణి (గ్రామ పెద్ద- బహుశా శిస్తు వసూలు చేసేవాడు అయివుండాలి) కంచుకి (రాజు ఇంట్లో వ్యవహారాలను పర్యవేక్షించే అధికారి) రథసారథి, పాలెగాడు (సమాచారం చేరవేసేవాడు) ఉంటారని శతపథబ్రాహ్మణం పేర్కొంది. వీరుగాక, వాటాలను పంచేవాడు, పాచికలాట నిర్వహించేవాడు, గోవులను చంపి మాంసం అందించేవాడు ఉన్నట్టు అందులో ఉంది. తన బలం ప్రదర్శించి ఇతరుల నుండి సంపదను స్వాధీనం చేసుకోడానికి నిర్వహించే తంతునే రాజసూయం అన్నారు. గుర్రాన్ని వదిలిపెట్టి అది ఎంతమేరకు తిరిగిందో ఆ భూమి యావత్తూ తనకే చెందుతుందని ప్రకటించి, ప్రతిఘటించిన వారిని ఓడించి, ఆ

**" పురాణ గాధలను సృజనాత్మక రచనలుగానే చూడాలి తప్ప వాస్తవ చరిత్రతో కలగాపులగం చేయకూడదు. నిజానికి వేద సాహిత్యంలో శ్రీలంక పై యుద్ధం గురించి గాని, మహాభారతంలో వర్ణించిన స్థాయిలో భారీస్థాయి యుద్ధంగాని జరిగినట్టు ఎక్కడా ప్రస్తావనలు లేనేలేవు. అందుచేత వేద సాహిత్యంలో లభించే చారిత్రిక ఆధారాల మీద పురాణాలలోని కల్పనలను రుద్దేసి గందరగోళ పరచకూడదు. "**

భూమిపై అధికారాన్ని ప్రకటించుకునే తంతునే అశ్వమేధం అన్నారు. దానికి ముగింపుగా జరిగే యాగంలో ఆ గుర్రాన్ని వధించేవారు.

బలమైన తెగలు కొన్ని చిన్న తెగలను తమలో కలుపుకుని పెద్ద ప్రాంతాలపై ఆధిపత్యం సాధించడం గురించి కూడా ఐతరేయం, శతపథ బ్రాహ్మణాలలో కనపడుతుంది. ఆ విధంగా కురు తెగ వాయవ్యం నుండి వచ్చిన క్రివి అనే తెగను కలుపుకుంది. ఈ క్రివి అన్న తెగ సింధు నది ప్రాంతం నుండి వాయవ్య ఉత్తరప్రదేశ్ ప్రాంతానికి వచ్చాక పాంచాల అన్న పేరు పొందింది. ఆ విధంగా కురు – పాంచాల తెగలు కలిసి బలంగా తయారై, భరతులు అనే మరొక తెగకు ప్రత్యర్థిగా నిలిచింది. భరత తెగ రాజ్యం ప్రస్తుత హర్యానా నుండి గంగా – యమున దిగువ అంచుల వరకు విస్తరించింది.

వేద సాహిత్యంలో వివిధ తెగల గురించి, రాజుల గురించి అస్పష్టమైన ప్రస్తావనలు ఉన్నాయి. దుష్యంతుడు, శతానీకుడు, జనకుడు, ధృతరాష్ట్రుడు, అజాతశత్రుడు, మాధవుడు వంటి రాజుల పేర్లు, విదేహ, కోసల, కాశీ, వంటి రాజ్యాల పేర్లు ఉన్నాయి. ఈ అస్పష్టమైన వివరాలకు ఆ తర్వాత కాలంలో వచ్చిన రామాయణ, భారత పురాణ గాధలలో పేర్కొన్న వివరాలను కలిపివేసి ఇదే అసలైన చరిత్ర అని చెప్పడానికి కొందరు ప్రయత్నిస్తున్నారు. పురాణ గాధలను సృజనాత్మక రచనలుగానే చూడాలి తప్ప వాస్తవ చరిత్రతో కలగాపులగం చేయకూడదు. నిజానికి వేద సాహిత్యంలో శ్రీలంక పై యుద్ధం గురించి గాని, మహాభారతంలో వర్ణించిన స్థాయిలో భారీస్థాయి యుద్ధంగాని జరిగినట్టు ఎక్కడా ప్రస్తావనలు లేనేలేవు. అందుచేత వేద సాహిత్యంలో లభించే చారిత్రిక ఆధారాల మీద పురాణాలలోని కల్పనలను రుద్దేసి గందరగోళ పరచకూడదు.

మలివేదకాలంలో ఆర్యులు సింధునదీ పరీవాహక ప్రాంతం నుండి గంగానదీ పరీవాహక ప్రాంతాల దిశగా తమ జనావాసాలను విస్తరించారు. ఆ ప్రాంతంలో వర్షపాతం చాలా ఎక్కువ. అందుచేత దట్టమైన అడవులతో నిండివుండేది. ఆ అడవులను తగులబెట్టి అక్కడ భూమిని సాగుకు వీలుగా మార్చుకున్నారు. శతపథ బ్రాహ్మణంలో అగ్ని ఏవిధంగా అడవులను కాల్చి, భూమిని సాగుకు వీలుగా మార్చివేసిందో వివరించే ప్రస్తావనలు ఉన్నాయి. ఈ విధంగా తూర్పు దిశగా విస్తరించడానికి ఇంకొక భౌగోళిక కారణం కూడా ఉంది. సింధునదికి ఉపనది అయిన సట్లెజ్ నదికి యమునానదికి నడుమ ఉన్న ప్రాంతంలో కాలువల ద్వారా నీటిని పారించడానికి తగినంత నీరు ఆ నదులలో లభ్యం కాలేదు. దానికి తోడు సరస్వతీనది కూడా అంతరించింది. అందుచేత అనివార్యంగా కొన్ని జనావాసాలు ఎక్కువ నీటి లభ్యత ఉన్న గంగా మైదాన ప్రాంతాలకు మళ్ళ వలసి వచ్చింది.

గంగామైదాన ప్రాంతంలో ఆర్యులకు పూర్వమే కొన్ని జనావాసాలు నిప్పును ఉపయోగించి అడవులను తగులబెట్టి సాగుకు యోగ్యంగా మార్చుకుని జీవిస్తూవుండేవి. క్రీ.పూ.1500 నాటికి అటువంటి జనావాసాలు ఉండేవి. వాటికన్నా ఎక్కువ విస్తృతిలో ఆర్యులు అడవులను సాగుకు యోగ్యంగా మార్చగలిగారు. అందుకు తోడ్పడినది ఇనుపగొడ్డలి. ఇనుపగొడ్డలి గురించి శుక్ల యజుర్వేదంలో వర్ణన ఉంది. కర్రపిడి తగిలించడానికి వీలు లేకుండా ఉండే ఇనుపగొడ్డలి దోబ్ ప్రాంతంలో లభించింది. అది సుమారు క్రీ.పూ.700 నాటిది. అటువంటి పనిముట్టుతో చెట్లు నరకడం చాలా కష్టం. ఎక్కువ ప్రాంతంలో విస్తరించడానికి అది చాలదు. మధుర ప్రాంతంలో కర్రపిడి తగిలించడానికి వీలుండే ఒక గొడ్డలి లభించింది. అది క్రీ.పూ. 800–400 మధ్య కాలానికి చెందినది. ఐతే ఇనుప గొడ్డలి గాని, కొడవలి గాని, నాగలికి తగిలించే ఇనుప కర్రు గాని ఎక్కువగా ఉపయోగించిన దాఖలాలేవీ ఆ ప్రాంతాల పురావస్తు తవ్వకాలలో దొరకలేదు. ఎక్కువగా కొయ్యనాగలికి బరువైన, పదునుగా అంచు చెక్కివుండే రాళ్ళను కట్టి

ఆ నాగలిని లాగేందుకు ఆరు, ఎనిమిది, ఎడ్లను ఉపయోగించేవారు. నీటిని తోడేందుకు కప్పీని వాడారు.

ఆకాలంలో పండించిన పన్నెండు రకాల ధాన్యాల గురించి వాజసనేయ సంహితలో పేర్కొన్నారు. వరి, బార్లీ, శనగ, పెసర తదితర పప్పు ధాన్యాలు, గోధుమ, వంటివి పండించారని తెలుస్తోంది. కొన్ని చోట్ల ఇక్షు (చెరుకు) పంట ప్రస్తావన కూడా ఉంది. ఐతే ఎందుకనో గాని ఎక్కడా పత్తి పంట గురించి పేర్కొనలేదు.

మొత్తంగా చూస్తే ఈ కాలంలో ఆర్య సమాజంలో పశుపోషణ, వేట ప్రాధాన్యతల్లో వెనక్కి పోయాయి. ఐతే ఆవు, ఎద్దు వ్యవసాయానికి కీలకం గనుక "ఈ భూమిపై ప్రతీదీ గోవుపై ఆధారపడవలసిందే" అని శతపథ బ్రాహ్మణం పేర్కొంది. అందుకే వాటి మాంసాన్ని తినరాదని చెప్పింది. అదే సమయంలో ఆ విషయాన్ని అందులో ప్రస్తావించిన యాజ్ఞవల్క్యుడు మాత్రం "నావరకు నేను మాత్రం లేతగా ఉండే గోమాంసాన్ని బాగా ఇష్టపడతాను" అని ఆ సందర్భంలోనే చెప్పాడు.

ఎంత పెద్ద పశువుల మంద ఉంటే అంత సంపన్నుడిగా పరిగణించేవారు.

అడవులను తొలగించి సాగుభూములుగా మారుస్తున్న కొద్దీ ఏనుగులతో తలపడవలసిన అగత్యం పెరిగింది. క్రమంగా ఏనుగులను మచ్చిక చేయడం మొదలైంది.

వాజసనేయి సంహిత లో ఆరు రకాల లోహాలను పేర్కొన్నారు. బంగారం, కంచు, ఇనుము, రాగి, సీసం, తగరం. ఇతర గ్రంధాలలో వెండి ప్రస్తావన ఉంది. పనిముట్లను ప్రధానంగా కర్రతోనే తయారు చేసేవారు. విస్తారంగా ఇనుమును ఉత్పత్తి చేసిన దాఖలాలు లేవు. రాగి లోహాన్ని కరిగించి పోతపోసి నప్పుడు ఒక ఉప ఉత్పత్తిగా ఎక్కడైనా ఇనుము ఉత్పత్తి జరిగివుండాలి. కాకపోతే ముడిఇనప ఖనిజాన్ని ఉపయోగించి కొన్ని పరికరాలను తయారు చేసుకుని వుండవచ్చు. రాతి తిరగళ్ళను, గానుగలను ఉపయోగించారు. మట్టి కుండలను తయారు చేసే "కులాలులు" (కుమ్మరులు) గురించి ప్రస్తావనలున్నాయి.

ఉన్నిని పేని దారం తయారు చేయడం, దానితో దుస్తులు తయారు చేయడం గురించి పేర్కొన్నారు. ఈ వృత్తి ప్రధానంగా మహిళలే నిర్వహించేవారు. మగ్గం మీద పని మాత్రం మగవారు చేస్తే తక్కిన అన్ని దశలలోనూ

(తరువాయి 14వ పేజీలో)

# ప్రజా చరిత్రకారుడు ప్రొఫెసర్ డిఎన్ ఝా


రచయిత 'మార్క్సిస్టు' సంపాదకులు

ఎస్. వెంకట్రావు

ఫిబ్రవరి 4వ తేదీన భారతదేశం ఒక గొప్ప ప్రజా చరిత్రకారుణ్ణి కోల్పోయింది. పుక్కిటి పురాణాలనే చరిత్రగా చలామణీ చేస్తున్న చీకటి శక్తుల బెదిరింపులకూ, దాడులకూ తలొగ్గక భారతదేశ చరిత్రను శాస్త్రీయ పరిశోధనల పట్టాలపై నిలపడానికి చివరికంటా కృషి చేసిన చరిత్రకారుడు ద్విజేంద్ర నారాయణ్ ఝా (డిఎన్ ఝా) తన 81వ ఏట కన్నుమూశారు. భారతదేశ చరిత్రకారుల్లో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఆర్ఎస్ శర్మ, బిపన్ చంద్ర, సతీశ్ చంద్ర, ఇర్ఫాన్ హబీబ్, రొమిలా థాపర్, బిడి చటోపాధ్యాయ, ఎంజిఎస్ నారాయణ్ తరానికి చెందిన సుప్రసిద్ధ చరిత్ర కారుడు ప్రొఫెసర్ ఝా. అటు బ్రిటిష్ వారి వలసవాద దృక్కోణం నుండి, ఇటు భారత మతతత్వ వాదుల ముస్లిం వ్యతిరేక విశ్లేషణల నుండి భారతదేశ చరిత్రను రక్షించి, పరిశోధనల ఆధారంగా శాస్త్రీయమైన పద్ధతిలో భారత ప్రజల నిజమైన చరిత్రను మనకు అందించిన వ్యక్తి ఆయన. గో మాత, గోవు పవిత్రత, గోవధ నిషేధం అంటూ ఆర్ఎస్ఎస్ మతతత్వ శక్తులు తీవ్ర స్థాయిలో గగ్గోలు పెడుతున్న సమయంలో, ఆ పేరుతో ప్రజలపై ఫాసిస్టు దాడులకు పాల్పడుతున్న తరుణంలో 2001లో ఝా "గోవు పవిత్రత: ఓ కట్టు కథ" అనే పరిశోధనా గ్రంధాన్ని విడుదల చేశాడు. భాతరదేశ చరిత్రలో ఏనాడూ గోవును పవిత్రంగా బావించలేదు, అందువల్లనే నందికి ఆలయాలున్నాయిగానీ ఆవుకు ఆలయాలు కట్టలేదు, పైగా బ్రాహ్మణులు కూడా గోమాంసాన్ని పరమ ఇష్టంగా తినేవారు అని శాస్త్రీయ ఆధారాలతో ప్రకటించిన ధీశాలి ఆయన. భౌతికవాద దృక్పథంతో దేశ చరిత్రను పరిశోధించే క్రమంలో ఆయన ఎటువంటి భావావేశాలకూ స్థానం కల్పించలేదు, ఎటువంటి ఒత్తిళ్లకూ లంగలేదు. పైన పేర్కొన్న పుస్తకంతో పాటు ఆయన రాసిన "ప్రాచీన భారత దేశం", "ప్రాచీన భారత దేశంలో ఆహారపు అలవాట్లు" అన్న పుస్తకాలను ప్రజాశక్తి ప్రచురణ సంస్థవారు తెలుగులో ప్రచురించారు. ఈ పుస్తకాలు ప్రాచీన భారత ప్రజల చరిత్ర గురించి మతతత్వ వాదులు చేస్తున్న వాదనలను చీల్చి చెండాడుతాయి, మనకు సరైన అవగాహన కల్పిస్తాయి.

డిఎస్ ఝా బీహార్ రాష్ట్రానికి చెందిన వారు. కలకత్తా యూనివర్శిటీకి చెందిన ప్రెసిడెన్సీ కళాశాలలో చరిత్రలో బిఎ (హానర్స్) చదివారు. అక్కడే ఆయనకు జీవిత కాల సహచరుడైన బిడి చటోపాధ్యాయతో పరిచయం ఏర్పడింది. అక్కడి నుండి పాట్నా యూనివర్శిటీకి వెళ్లి అక్కడ చరిత్రలో ఎంఎ చదివారు. ప్రఖ్యాత చరిత్రకారుడు ప్రొఫెసర్ ఆర్ఎస్ శర్మ ఆయనకు గురువు. భారతదేశ చరిత్రలో ప్రాచీన, మధ్య యుగాల సమాజాల్లో ఆర్థిక పునాదులపై అధ్యయనం జరిపిన ఝా దానిపై వ్యాసాలు రాయడం ప్రారంభించారు. తరువాత ఢిల్లీ యూరివర్శిటీలో చరిత్ర ప్రొఫెసర్గా నియమితుడై ప్రాచీన, మధ్య యుగాల చరిత్రపై స్పెషలైజ్ చేశారు. అప్పటికే ఆ యూనిర్శిటీకి మారిన ఆర్ఎస్ శర్మతో కలిసి ఆయన ఢిల్లీ యూనివర్శిటీని భారతీయ చరిత్రపై గొప్ప పరిశోధనా కేంద్రంగా మార్చడానికి తోడ్పడ్డారు. అనేక మంది యువ చరిత్రకారులను యూనివర్శిటీ ఆకర్షించింది. పక్కనే ఉన్న జవహర్లాల్ నెహ్రూ యూనివర్శిటీ (జెఎన్యు)లో పనిచేసే బిడి ఛటోపాధ్యాయ, రొమిలా థాపర్, సువిరా జైశ్వాల్ వంటి వామపక్ష చరిత్రకారులతో కలిసి వారు భారతీయ చరిత్ర పరిశోధనను అంతర్జాతీయ స్థాయికి తీసుకుపోయారు.

మూడు దశాబ్దాల చరిత్ర పరిశోధనలో ఝా, ప్రాచీన భారత దేశ సామాజిక-ఆర్థిక నిర్మాణం గురించీ, సంస్కృతికీ, సాంకేతిక శాస్త్రానికీ మధ్య సంబంధాల ఫలితంగా ఏర్పడిన సామాజిక, రాజ్య వ్యవస్థల గురించి అనేక విషయాలు కనుగొన్నారు. ప్రాచీన భారత దేశంలో రెవిన్యూ వ్యవస్థలు, ఆర్థిక వ్యవస్థకూ సామాజిక నిర్మాణానికీ మధ్య సంబంధాలను తెలియజేశారు. భారతదేశ చరిత్రను శాస్త్రీయంగా పరిశీలించారు గనుకనే ఆయన హిందూ జాతీయవాదం పేరుతో ముందుకు వచ్చిన ఆర్ఎస్ఎస్ మతతత్వాన్నీ, దేశ చరిత్రను కాషాయీకరించడాన్నీ తుదకంటా వ్యతిరేకించాడు. అయోధ్యలో బాబ్రీమసీదు కింద ఆలయం ఉన్నట్లు ఎటువంటి ఆధారాలు లేవని ఆర్ఎస్ శర్మ, సూరజ్ భాన్లతో కలిసి 1991 లో ఆయన ఒక పత్రాన్ని తయారుచేశారు. "రామజన్మభూమి-బాబ్రీ మసీదు: దేశానికి ఒక చరిత్రకారుని నివేదిక (1991) పేరుతో ఆయన రూపొందించిన పత్రంలో ఆయన భారత పురాతత్వ సర్వే నివేదికలోని అనేక అంశాలతో విభేదించారు.

2001లో ఆయన "గోవు పవిత్రత: ఒక కట్టుకథ" అనే పుస్తకం రాస్తూ ప్రాచీన కాలంలో బ్రాహ్మణులతో సహా భారతీయుల ఆహారంలో గోవు మాంసం ఒక భాగంగా ఎలా ఉండేదో ప్రాచీన హిందూ గ్రంథాల నుండి ఉదాహరణలతో సహా నిరూపించాడు. ఆహారంగానే కాకుండా ఆవు మాంసంతో చేసిన సూప్ జ్వరాలు తగ్గించడానికీ, నీరసం వదిలించడానికీ, క్షయవ్యాధికీ ఉపయోగపడుతుందని, ఆవు కొవ్వు కీళ్ల నొప్పులను నయం చేస్తుందని చరకసంహితలో చెప్పిన విషయాలను ఉటంకించారు. దేవుళ్లకు పశువులను బలి ఇవ్వడం ప్రాచీన భారతీయుల సంప్రదాయం అని వేదాలు, ఉపనిషత్తులను ఉటంకిస్తూ చెప్పారు. గోవును ఇటీవలి కాలంలో మాత్రమే పవిత్ర

**“ఆహారంగానే కాకుండా ఆవు మాంసంతో చేసిన సూప్ జ్వరాలు తగ్గించడానికీ, నీరసం వదిలించడానికీ, క్షయవ్యాధికీ ఉపయోగపడుతుందని, ఆవు కొవ్వు కీళ్ల నొప్పులను నయం చేస్తుందని చరకసంహితలో చెప్పిన విషయాలను ఉటంకించారు. దేవుళ్లకు పశువులను బలి ఇవ్వడం ప్రాచీన భారతీయుల సంప్రదాయం అని వేదాలు, ఉపనిషత్తులను ఉటంకిస్తూ చెప్పారు.”**




వ్యవసాయ సంక్షోభం – గో రాజకీయాలు అన్న అంశంపై ప్రసంగిస్తున్న డి.ఎన్.ఝా ప్రక్కన కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి హన్నన్ మొల్లా

జంతువుగా పేర్కొనడం ప్రారంభించారని తెలిపారు. గో రక్షణ పేరుతో మానవ హత్యలకు పాల్పడుతున్న కాషాయ మూకలకు ఝా పరిశోధనలు మింగుడుపడలేదు. ఆయనను హత్య చేస్తామని బెదిరించారు. దాడులకు దిగారు. సోషల్ మీడియాలో పనిగట్టుకుని దుర్భాషలకు దిగారు. అయినా ఝా ఏమాత్రం బెసకలేదు. తను పరిశోధించి తేల్చిన విషయం నుండి కొంచెం కూడా పక్కకు మళ్లలేదు.

మొఘలులు భారత దేశానికి రాకముందు గుప్తుల కాలం స్వర్ణయుగంగా భాసిల్లిందన్న భావనను కూడా ఆయన తిరస్కరించారు. ఇదంతా స్వాతంత్ర్యోద్యమాన్ని బలపరిచేందుకు చరిత్రకారులు సృష్టించిన భావన అని అందులో నిజం లేదని తేల్చారు. భారతీయులు ప్రాచీన యుగాల నుండి శాంతియుత సహజీవనాన్ని సాగించేవారనీ, శాఖాహారం ఆరగించేవారనీ, సహనాన్ని ప్రదర్శించేవారనీ చెబుతూ హిందూత్వ చరిత్రకారులు భారత దేశ వాస్తవ చరిత్రను కాషాయీకరణ గావించేందుకు ప్రయత్నిస్తున్నప్పుడు ప్రొఫెసర్ ఝా వారి ప్రయత్నాలను వాస్తవ పరిశోధనల ద్వారా ధైర్యంగా ఎదుర్కొన్నాడు. బ్రాహ్మణ్యానికీ, శ్రామికుల మతాలైన బౌద్ధం, జైనం వంటి వాటికీ మధ్య జరిగిన యుద్ధాలను గురించి వివరిస్తూ, బౌద్ధాన్ని ఈ దేశం నుండి వెళ్లగొట్టడానికి బ్రాహ్మణ్యం భీకర యుద్ధాలు చేసిందని చెప్పారు. అలాగే పరదేశీయులను మ్లేచ్ఛులు, అప్రాచ్యులు అని దూషిస్తూ అసహనం ప్రదర్శించిన విషయాన్ని కూడా పేర్కొన్నారు.

డిఎన్ ఝా “దక్షిణ భారత దేశంలో దేవాలయాలు, వ్యాపారులు (క్రీ.శ. 900–1300)” అన్న పరిశోధనా పత్రంలో దేవాలయాలకూ, వ్యాపారులకూ ఉన్న సంబంధాన్ని గురించి విపులంగా తెలియజేశారు. ఆ రోజుల్లో దేవాలయాలు సంపద పోగుచేసుకునే కేంద్రాలు గా ఉండేవి. వ్యాపారులు ఈ దేవాలయాలను ఆధారం చేసుకుని వ్యాపారాలు సాగించేవారు. చోళులు, ఇతర చక్రవర్తులు దేవాలయాలకు పెద్ద ఎత్తున భూములు ఇవ్వడంతో క్రమంగా గ్రామీణ వ్యవసాయంలో ఫ్యూడల్ సంబంధాలు ప్రారంభమైనాయని, చక్రవర్తుల అధికారం క్రమంగా తగుతూ వచ్చిందని చెప్పారు. ఝా చివరిగా రాసిన పుస్తకం “అమృత పానం” (డ్రింక్ ఆఫ్ ఇమ్మోర్టాలిటీ) 2020లో ప్రచురితమైంది. ప్రాచీన భారతదేశంలో స్త్రీ, పురుషులు 50 రకాల మద్యాలు సేవించేవారని ఆయన వేదాలు, రామాయణ, మహాభారతాల నుండి ఉటంకిస్తూ తెలియజేశారు.

ప్రొఫెసర్ ఝా తన చరిత్ర పరిశోధనల ద్వారా భారతదేశ చరిత్రలోని గొప్ప అంశాలను మనకు తెలియజేయడమే కాదు భారత చరిత్ర కాంగ్రెస్ కార్యదర్శిగా, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యునిగా, అధ్యక్షునిగా వివిధ హోదాల్లో పనిచేసి చరిత్ర కాంగ్రెస్‌ను గొప్ప సంస్థగా తీర్చిదిద్దారు. అకాడమిక్ జీవితంలోనూ, సామాజిక జీవితంలోనూ ఉన్నత విలువలు నెలకొల్పిన ఝా నిత్య జీవితంలో ఎంతో ఉల్లాసంగా, జోక్‌లు వేస్తూ కలుపుగోలుగా వ్యవహరించేవారు. చివరి రోజుల్లో ఆయన పక్షవాతంతోనూ, వినికిడి సమస్యతో బాధపడ్డారు. భారతీయ ప్రాచీన చరిత్రపై అతి గొప్ప పరిశోధనా సంపదను మనకు విడిచిపెట్టి వెళ్లిపోయారు. ఆయన మరణించినా వామపక్ష వాదిగా, నిబద్ధత కలిగిన ప్రజా చరిత్రకారుడిగా ఆయన అందించిన ఆయుధాలు మతతత్వ చీకటి శక్తులపై పోరాటంలో మనకు ఉపయోగపడతాయి.

❋

## వేద కాలం - మలి దశ (క్రీపూ. 1000- 700)

(12వ పేజీ తరువాయి)

ఆడవారే ఉండేవారు.

విల్లు తయారీ, తాడు పేనడం, వింటినారి తయారీ, అమ్ముల తయారీ, తోలుతో దుస్తుల తయారీ, వెదురుతో బుట్టలు తయారీ, లేపనాల తయారీ, గుర్రాలను సంరక్షించేవృత్తి, నిప్పు తయారీ, ఎండుకట్టెపుల్లల సేకరణ, పశువుల కాపలా, వేట, చేపలు పట్టడం, కమ్మరం, కంసాలి, వ్యాపారి, వైద్యం, జ్యోతిష్యం వంటి వృత్తుల ప్రస్తావన వాజసనేయి సంహితలో ఉంది.

పలురకాల వృత్తులద్వారా పలు వస్తువులు, సేవలు అందుతున్నందున వాటిని పొందడానికి ఒక మారకసాధనంగా డబ్బు అవసరం పెరిగింది. నిష్కము అని బంగారు నాణేన్ని అనేవారు. నిష్కములు, గుర్రాలు ఖరీదైన బహుమతులు.

ఎక్కడా పట్టణాలు ఏర్పడినట్టు ప్రస్తావనలు లేవు. అంటే పట్టణాలు ఏర్పడవలసిన స్థాయికి సరుకుల ఉత్పత్తి అభివృద్ధి చెందలేదు.

ఇంటర్వ్యూ

# 'భారతదేశంలో స్వర్ణయుగం ఎప్పుడూ లేదు'



రచయిత ప్రముఖ చరిత్రకారుడు

చరిత్రకారుడు ప్రొఫెసర్ **డి.ఎన్. ఝూ**తో పాత్రికేయుడు జియా ఉస్ సలాం జరిపిన ఇంటర్వ్యూను పాఠకులకు అందిస్తున్నాం.

*భారతీయ చరిత్రను హిందూత్వవాదులు వక్రీకరిస్తున్నారని చెప్పబోయే ముందు హిందూమతంలో ఆవుకున్న స్థానాన్ని గురించి ప్రస్తావించారు. ఆయన తన వాదనకు ఎక్కువగా లేఖనాలపై ఆధారపడ్డారు. ఆవు పవిత్రమైన జంతువు కాదని కొట్టిపడేశారు. ఆవును పవిత్రమైన దానిగా చూడటం కంటే రాజకీయంగా చూడడానికే ప్రాధాన్యమిచ్చారని ఝూ తన వాదనలో పేర్కొన్నాడు. "ఆవు కంటే ఎద్దు పవిత్రతకు అర్హమైనది" అని చెప్పాడు. నందికి ప్రత్యేకంగా ఆలయాలు ఉండటాన్ని ఉదహరించాడు.*

*భారత్ మాతాకి జై నినాదం నిస్సారతను బహిర్గతం చేయడం ద్వారా మైనారిటీలు, దళితులపై జరుగుతున్న దారుణాలకు వ్యతిరేకంగా ఝూ వాదనలు చరిత్ర లోతులను తడిమాయి. బ్రాహ్మణ ఆధిపత్యం ద్వారా కాక అందరి అభివృద్ధిని ప్రతిబింబించే విధంగా, భారత్ మాతా కి జై వంటి నినాదం కాక జై హింద్ నినాదాన్ని తీసుకోవాలని ఆయన వాదించారు. భారతీయ చరిత్రలో స్వర్ణయుగం ఉన్నదనే భావనతోనూ ఆయన విభేదిస్తున్నాడు. వారి మతం ఏమైనప్పటికీ, రాజకీయ ఆధిపత్యం కోసం రాజులు ఎల్లప్పుడూ యుద్ధాలు చేశారని వాదించారు.*

*ఇటీవల విడుదలైన తన తాజా పుస్తకం ఎగైనెస్ట్ ది గ్రెయిన్‌లో చరిత్రను ప్రామాణికంగా వ్రాయడానికి చేస్తున్న పోరాటాన్ని కొనసాగించాడు.*

*ఆయనఇంటర్వ్యూలోని ముఖ్యాంశాలు:*

---


**రా**జ్యాంగం "ఇండియా అంటే భారత్" అని చెప్తుంది, అయినప్పటికీ ఎక్కువ కాలం భారత్ ఒక సమైక్య దేశంగా కొనసాగలేదు. ఈ అంశాన్ని మీరు ఎలా వివరిస్తారు? అలాగే భారత్ మాతాకి జై నినాదాన్ని జాతీయవాదానికి చిహ్నంగా చేయడం ఎంతవరకు సబబు?

సుదీర్ఘకాలంలో భారత్ ఒక దేశంగా ఏర్పడిందన్నది నిజం. వేద గ్రంథాలలో ప్రస్తావించిన భరత తెగ నుంచి భారతదేశం ఉద్భవించలేదు. అయినప్పటికీ భరత్ తెగ గురించి కొన్నింటిలో ప్రస్తావించబడింది. భారతదేశం గురించి ప్రాదేశిక కోణంలో మొదటి ప్రస్తావన కళింగ రాజు ఖారవేలుని (క్రీ.పూ. 1 వ శతాబ్దం) శాసనాలలో, తరువాత సంస్కృత గ్రంథాలలో (నేను చదివిన) కనిపించింది. ఎక్కడ పేర్కొన్నప్పటికీ దాని భౌగోళిక చిత్రం అస్పష్టంగానే ఉంది. 19 వ శతాబ్దం చివరలోనే ఈ రోజు మనం చూస్తున్న భారతదేశం ఏర్పడింది. భారత జాతీయవాదం పెరుగుదలతో సమానంగా ఇదిఏదిగింది. కాని ఈనాడు దానిని తల్లిగా చూయించటం ఆసక్తికరమైనది. అంతకుముందు ద్విజేంద్ర లాల్ రాయ్ (1863-1913) తన పాటలో భారత్‌ను భారతమాతగా మార్చటం, 19వ శతాబ్దిలో అనేక రచనలలో అదే విధంగా ప్రస్తావించటం, బంకిం చంద్ర చటోపాధ్యాయ రాసిన ఆనందమఠం వంటి వాటి వల్ల అది ఎంతో ప్రాముఖ్యాన్ని పొందింది. ఈ విధంగా ప్రత్యేక జాతీయవాదం గురించి ప్రచారం చేస్తున్నవారు, విక్టోరియా రాణిని భారతమాత సంరక్షకురాలిగా భావించటం వింతగా ఉంది. 1904 ఆరంభంలో హిందీ పంచ్ లో ప్రచురితమైన కార్టూన్లలో బ్రిటీష్ సామ్రాజ్యం జెండాను బ్రిటానికాతో సంయుక్తంగా భారతమాత పట్టుకున్నట్లు వర్ణించడం కూడా అంతే ఆసక్తి కలిగిస్తుంది. కాబట్టి ఇది ఎలాంటి జాతీయ వాదం అని కొందరు ప్రశ్నించవచ్చు. చారిత్రకంగా చూస్తే భారతమాత అనే భావన నూట పాతిక సంవత్సరాల క్రితం నాటిది మాత్రమే. గోమాత ప్రస్తావన కూడా అంతే పాతది. ఇటీవల మధ్యప్రదేశ్ ప్రభుత్వం మాలిక్ ముహమ్మద్ జయాసి "పద్మావతి" తో మరో మాత, రాష్ట్రమాతను సృష్టించింది. కాబట్టి ఈ మాతల్లో దేనిని భారత జాతీయవాదానికి ప్రమాణంగా చూడాలా అని నేను అయోమయంలో పడ్డాను. అందువల్ల నేను భారత్ మాత కంటే జై హింద్ ను ఇష్టపడతాను.

**హిందువులు సరళ స్వభావం కలవారని, అందరినీ కలుపుకుపోతారని భారతదేశాన్ని సందర్శించిన ప్రముఖ యాత్రీకులు ఫ్రాంకోయిస్ బెర్నియర్, జోహన్ గాట్ఫ్రైడ్ వాన్ హెర్డర్‌లు రాశారు. అయినప్పటికీ అల్‌బెరూనీ భిన్నాభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. హిందువులు సాధుస్వభావం గలవారైనా విదేశీయులను అపవిత్రులుగా, మ్లేచ్ఛులుగా పరిగణించారా? సహనశీలత ఉన్నదని భావించినట్లైతే బౌద్ధం పట్ల బ్రాహ్మణవాదుల శత్రుత్వాన్ని ఎలా వివరించాలి?**

రెండు అభిప్రాయాలు సరైనవని నేను చెబుతాను. అల్‌బెరూనీ ప్రస్తావించిన కాలం (973-1048)లో అసహనం, హిందువుల అహంకారం, బ్రాహ్మణ, శ్రమణ మతాలమధ్య సంఘర్షణ (మునుపటి బౌద్ధమతం, జైనం) పతాకస్థాయిలో ఉంది; బౌద్ధ సంస్థలపై బ్రాహ్మణవాదులు నిరంతర దాడులు చేయడంతో బౌద్ధమతం దేశం నుండి తరిమి వేయబడే స్థితిలో ఉంది.

**" అలాగే బ్రాహ్మణవాదంలోని శాఖల మధ్య సంఘర్షణకు సుదీర్ఘ చరిత్ర, ఇతర మతాల పట్ల దాని వైరుధ్యంతో పాటు, భారతదేశంలో మతాల సహజీవనం, వాటిమధ్య పరస్పరం ఇచ్చిపుచ్చుకోవడం వంటి చరిత్ర ఉందని గుర్తుం చుకోవాలి. ఈ ఐక్యత భారతదేశ చరిత్రలో ఒక ముఖ్యమైన లక్షణం. హిందూ, ముస్లిం మతాల మధ్య తీవ్రమైన వివాదం ఉన్నప్పటికీ, ఈ రెండు మతాలు కూడా ఒకదాని కొకటి అనేకం ఇచ్చిపుచ్చుకున్నాయి. "**



బ్రాహ్మణ్యం పుంజుకుంటున్న సందర్భంలో భౌద్ధులపై దాడి చేస్తున్న బ్రాహ్మణ వాదులు

ఇతర మతాల పట్ల బ్రాహ్మణ అసహనాన్ని ధృవీకరించటానికి తగినన్ని ఆధారాలు ఉన్నాయి. బ్రాహ్మణులు విదేశీ యులను మ్లేచ్ఛులుగా భావించారని మీరు చెప్పడం సరైనది. బ్రాహ్మణ బ్రాహ్మణేతర మతాల మధ్య గల శతృత్వ నేపథ్యంలో అల్‌బెరూనీ విరుద్ధమైన అభిప్రాయాలను వ్యక్తం చేసి ఉండవచ్చు.

కానీ విదేశీయులు ఫ్రాంకోయిస్ బెర్నియర్ (1620-1688) మరికొందరు భారతదేశం గురించి రాసిన దానిలో మతపరమైన దృశ్యం భిన్నంగా ఉంది: బ్రాహ్మణవాదులు, శ్రమణుల మధ్య మతపరమైన శత్రుత్వం లేదు. పుట్టిన దేశం నుండి బౌద్ధమతం దాదాపుగా కనుమరుగై భారతదేశం వెలుపల స్థిరపడింది. హిందూ, ఇస్లాం మతాల మధ్య వైరుధ్యం కూడా అంత తీవ్రంగా లేదు.

అలాగే బ్రాహ్మణవాదంలోని శాఖల మధ్య సంఘర్షణకు సుదీర్ఘ చరిత్ర, ఇతర మతాల పట్ల దాని వైరుధ్యంతో పాటు, భారతదేశంలో మతాల సహజీవనం, వాటిమధ్య పరస్పరం ఇచ్చిపుచ్చుకోవడం వంటి చరిత్ర ఉందని గుర్తుం చుకోవాలి. ఈ ఐక్యత భారతదేశ చరిత్రలో ఒక ముఖ్యమైన లక్షణం. హిందూ, ముస్లిం మతాల మధ్య తీవ్రమైన వివాదం ఉన్నప్పటికీ, ఈ రెండు మతాలు కూడా ఒకదాని కొకటి అనేకం ఇచ్చిపుచ్చుకున్నాయి. రెండు మతాల మధ్య పరస్పర ఇచ్చిపుచ్చుకునే ధోరణికి ఉదాహరణగా ముస్లింల సత్య పీర్, బెంగాల్‌తో పాటు సమీప ప్రాంతాల్లో చేసే సత్యనారాయణ పూజను చెప్పవచ్చు. కాబట్టి భారతదేశంలో సహనంతో కూడిన హిందూ మతం గురించి బెర్నియర్, ఇతర విదేశీయులు మాట్లాడారు.

**ఇటీవలి కాలంలో దయానంద సరస్వతి, రామకృష్ణ పరమహంసలను గురించి ప్రస్తావిస్తున్నారు. వారిని ఆ విధంగా ప్రత్యేకత లున్న వారిగా అంగీకరించటం సరైనదేనా?**

లేదు, నేను అలా అనుకోను. దయానంద సరస్వతి 1875 లో ఆర్య సమాజ్‌ను స్థాపించారు. అదే సంవత్సరం ఆయన సత్యార్థ ప్రకాశ్ అనే గ్రంథాన్ని రాశాడు. దీని చివరి రెండు అధ్యాయాలు పూర్తిగా క్రైస్తవ, ఇస్లాం మతాలను తెగనాడేందుకు కేటాయించాడు. రామకృష్ణ బోధలు కూడా ముందుకు వెళ్ళేందుకు దోహదం చేయవు. అతని ప్రముఖ శిష్యుడు, వివేకానందుడు (1863-1902) అద్వైత వేదాంత ప్రచారం కోసం 1897 లో రామకృష్ణ మిషన్ ను స్థాపించారు, మత సహనం గురించి మాట్లాడారు, "పసిఫిక్ నుండి అట్లాంటిక్ వరకు ఐదు వందల సంవత్సరాలు రక్తప్రవాహం సాగింది, అది మహమ్మదీయవాదం" అని ఇస్లాంకు వ్యతిరేకంగా విషం కక్కాడు. (షేక్స్పియర్ క్లబ్ ఆఫ్ పసదేనా, కాలిఫోర్నియా, ఫిబ్రవరి 3, 1900). ఈ వాస్తవాలను బట్టి చూస్తే, ఇద్దరు "గొప్ప" ఆధ్యాత్మిక నేతల ఆలోచనలు ఆమోదయోగ్యం కాదు. అంతే కాకుండా, రోజువారీ జీవితంలో ముస్లింలు, దళితులను కించపరచడం, మసీదులు, చర్చిలపై దాడులు, మహిళలపై భయంకరమైన నేరాలకు పాల్పడడం మొదలైన వాటికి వారి ఆలోచనలు దోహదం చేస్తూ హిందూత్వలో భాగం అవుతున్నాయి.

అందువల్ల ప్రజల ఇష్టానికి వదిలేయడం ఉత్తమ మార్గం. మన రాజ్యాంగం ఇచ్చిన హామీ మేరకు ప్రతి వ్యక్తి తనకు నచ్చిన మతాన్ని ఆచరించడానికి అనుమతించి రాజ్యం ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా జోక్యం చేసుకోకుండాఉండాలి.

**కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు ముందే లింగాయత్‌లకు ఒక ప్రత్యేకమైన మత హోదాను ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ వాదన, నిర్ణయానికి చరిత్రలో ఆధారాలున్నాయా?**

కర్ణాటక ఎన్నికల రాజకీయాలను చర్చించడానికి నేను ఇష్టపడను. నేను దానిని రాజకీయ వ్యాఖ్యాతలకు వదిలివేస్తాను. కానీ లింగాయత్‌ల విషయానికొస్తే, 12 వ శతాబ్దంలో వాయువ్య కర్ణాటకలో ఒక ప్రధాన మత శక్తిగా వారి ఆవిర్భావం జరిగిందని అందరికీ తెలుసు. సనాతన హిందూ మతానికి భిన్నంగా ఉన్న వారి ఉద్యమానికి బసవన్న ఎంతో దోహదపడ్డారు. ఇది బ్రాహ్మణ వ్యతిరేక, కుల వ్యతిరేక, వేద వ్యతిరేకమైంది. దాని అనుచరులు, పురుషులు, స్త్రీలు ఇద్దరూ తమ శరీరంపై లింగాన్ని ధరిస్తారు (వారు ఇష్టలింగ అని పిలుస్తారు). వారు ఆలయంలో విగ్రహారాధన చేయరు. లింగాయతుల ఈ నేపథ్యాన్ని బట్టి వారిని ప్రత్యేక మతంగా గుర్తించడం సరైనదేనని నేను భావిస్తున్నాను.

**హిందూత్వ దూకుడుగా వ్యవహరిస్తుండటంతో చాలా మంది దళితులు, మాయవతి వంటి నాయకులు కూడా బౌద్ధమతంలోకి**

మారుతామని బెదిరించారు. ఇది తిరోగమనం కాదా? ఎందుకంటే చరిత్రలో విజయం పొందిన రాజు ఓడిపోయిన వారిపై తమ విశ్వాసాలు రుద్దిన సందర్భాలు మనకున్నాయి. జైన మత విశ్వాసం ఉన్న పాండ్యరాజు శైవంలోకి మారాల్సి వచ్చింది.

పాండ్యరాజు కథను గురించి విస్తృతంగా రాసినప్పటికీ పండితులు దాని ప్రామాణికతను ప్రశ్నిస్తున్నారు. దళితుల మార్పిడికి సంబంధించి నంత వరకు, బౌద్ధమతానికి లేదా ఇస్లాం మతానికి కూడా వారి సామూహిక మార్పిడి ఎక్కువగా హిందుత్వ సిద్ధాంతకర్తలచే సమర్థించ బడిన భారతీయ కుల వ్యవస్థ అసమానతల వల్ల సంభవించిందని నేను చెప్పాలనుకుం టున్నాను. ఈ సందర్భంలో 1956 లో దాదాపు ఐదు లక్షలమంది "అంటరానివారి" తో బాబా సాహెబ్ అంబే ద్కర్ బౌద్ధమతంలోకి మారడం గుర్తుంచు కోదగినది.

“ దళితుల మార్పిడికి సంబంధించి నంత వరకు, బౌద్ధమతానికి లేదా ఇస్లాం మతానికి కూడా వారి సామూహిక మార్పిడి ఎక్కువగా హిందుత్వ సిద్ధాంతకర్తలచే సమర్థించ బడిన భారతీయ కుల వ్యవస్థ అసమానతల వల్ల సంభవించిందని నేను చెప్పాలనుకుం టున్నాను. ఈ సందర్భంలో 1956 లో దాదాపు ఐదు లక్షలమంది "అంటరానివారి" తో బాబా సాహెబ్ అంబేద్కర్ బౌద్ధమతంలోకి మారడం గుర్తుంచు కోదగినది. ”

**"ఎగైనెస్ట్ ది గ్రెయిన్"లో పురాతన భారతదేశంలో సామాజిక సామరస్యం, ఆర్థిక అభివృద్ధి, పౌరాణిక స్వర్ణయుగం ఉన్నట్లు హిందుత్వ సిద్ధాంతకర్తలు ప్రచారం చేస్తున్నారని మీరు పేర్కొన్నారు. దీనిని ఎలా పరిగణిస్తారు, ఇందులో ఎంతమేరకు వాస్తవం ఉంది?**

స్వాతంత్ర్య పోరాటకాలంలో ఇస్లామిక్ పూర్వ భారతదేశం గురించి భారతీయ చరిత్ర కారులు విమర్శనారహితంగా గొప్పగా చెప్పారు. భారత రాజ్యాన్ని రాజ్యాంగబద్ధ రాచరికం అని, గిరిజన తెగల పాలనా విధానాన్ని ఏథెన్స్ ప్రజాస్వామ్యంతో సమానమంటూ అభివర్ణిం చారు. దక్షిణ భారతదేశంలో జరిగే గ్రామ సభలను చిన్నస్థాయి ప్రజాస్వామ్యాలుగా చిత్రీ కరించారు. గుప్తుల పాలనా కాలంలో భారత ప్రజలు సంతోషంగా, సంపన్నంగా, శాంతి సామరస్యంతో స్వర్ణయుగంలో జీవించా రనే ప్రాచీన భారతదేశ చిత్రం స్వాతంత్ర్య సమర యోధులకు ప్రేరణకు అవసరమైన సైద్ధాంతిక మద్దతును అందించింది. కానీ భారతదేశం స్వాతంత్ర్యం సాధించిన తరువాత హిందుత్వ సిద్ధాంతకర్తలు ఈ ఆలోచనలకు అతుక్కు పోయినప్పటికీ ఎలాంటి ప్రయోజనం కలగలేదు. అనేక సందర్భాల్లో మన ప్రధాన మంత్రి కూడా భారతదేశ గతం గురించి హాస్యాస్పదమైన ప్రకటనలు చేశారు. కానీ చరిత్రలో ఏ దశలో నూ భారతదేశంలోని సాధారణ ప్రజలు నిజం గా స్వర్ణయుగాన్ని చూడలేదని శాస్త్రీయ విశ్లేషణ రుజువు చేస్తుంది. ఇతర దేశాల మాదిరిగానే భారతదేశంలోనూ సామాజిక అసమానతలు, సామాన్య ప్రజలను దోపిడీ చేయడం, మత వివాదం మొదలైనవి ఉన్నాయి. స్వర్ణయుగం అనే ఆలోచన భారత దేశంలో, ఇతర దేశాల్లో కూడా అన్నివేళలా దుర్వినియో గమైంది.

**బాబ్రీ మసీదుపై పోరాటం కొనసాగు తున్నది. బౌద్ధాన్ని అణగదొక్కి అధికారానికి వచ్చిన అప్పటి హిందూ రాజులు కూడా కొన్ని బౌద్ధ నిర్మాణాలను తాకలేదని మనకు తెలుసు. నలంద విశ్వవిద్యాలయంలోని దేవాలయాలు అందుకు ఉదాహరణ. అయితే మన మొత్తం చరిత్ర "బలవంతుడిదే హక్కు" గా సాగిందని భావిం చటం సరైనదవుతుందా?**

"బలవంతుడిదే హక్కు" అనేది ఒక స్థాయి వరకు నిజమే. కానీ అది కూడా అతిగా తేలిక చేసి మాట్లాడటం అవుతుంది. మత ఘర్షణల విషయంలో రాజు అన్నివేళలా అటువంటి పాత్ర పోషించి ఉండకపోవచ్చు. భారత ప్రభుత్వ కుమ్మక్కుతో బాబ్రీ మసీదును కూల్చి వేశారు. ఒక మతాన్ని అనుసరించేవారు వారి ప్రత్యర్థులు అనుసరించే మతాలపై దాడులు చేశారని చరిత్ర స్పష్టం చేస్తున్నది.

లోతైన చారిత్రక సంఘటనలు దీనికి కారణం. అలా అని రాజు తన మతాన్ని ఇతరు లపై రుద్దాడని వాదించలేం. ఉదాహరణ కు బౌద్ధమతంపై బ్రాహ్మణ్యం దాడి గురించి మాట్లా డేటప్పుడు బౌద్ధం, బ్రాహ్మణ మతాల్లో సిద్ధాంత పరమైన మార్పుల నేపథ్యం, అందుకు అనుగు ణంగా సామాజిక, భౌతిక పరిస్థితుల్లో వచ్చిన మార్పులు, వారి సామాజిక పునాది, వారికి మద్దతిచ్చినవారు తదితర అంశాలను పరిగణన లోకి తీసుకోవాలి.

(అనువాదం: జి ఆంజనేయులు)

❈

**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవిందా హైస్కూల్ వద్ద, తాడేపల్లి - 522501, గుంటూరు జిల్లా.**

ఆహార భద్రత

# ప్రజాపంపిణి వ్యవస్థను నీరుగారుస్తున్న ప్రభుత్వాలు



రచయిత మార్క్సిస్టు పత్రిక బాధ్యులు

ఎ. కోటిరెడ్డి

ఒకవైపున రైతు వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చి వ్యవసాయ రంగాన్ని, రైతాంగ భూములను కార్పొరేట్లు, బహుళజాతి సంస్థలకు అప్పగించటానికి పూనుకున్న బిజెపి నేతృత్వం లోని కేంద్ర ప్రభుత్వం మరోవైపున ప్రజాపంపిణి వ్యవస్థను రద్దు చేయటం కోసం చర్యలు తీసుకొంటున్నది. వాటిలో ప్రధానమైనది ఎఫ్‌సిఐ – భారత ఆహారసంస్థ–కి అవసరమైన నిధులను కేటాయించకుండా ఆ సంస్థను అప్పులలో ముంచుతున్నది. ఎఫ్‌సిఐ రుణాలు "భరించలేనంతగా పెరిగిపోతున్నాయని" ఈ సంవత్సరం ఆర్థికసర్వేలో ప్రభుత్వం పేర్కొంది. ఆ సంస్థకు నిధులు కేటాయించటం, కార్యకలాపాలు నిర్వహించటం దేశానికి భారమన్న భావాన్ని ప్రజలలో వ్యాపింపజేస్తున్నారు. ఆహారధాన్యాల సేకరణ, నిల్వ, పంపిణీలపై ప్రజాపంపిణీ వ్యవస్థ ఆధారపడి ఉంది. ప్రజాపంపిణీ వ్యవస్థ రద్దయితే ఆహారధాన్యాలను సేకరించటం, నిల్వ చేయటం, పంపిణి చేయాల్సిన అవసరం ఉండదు. అపుడు ఆహారధాన్యాల పంపిణీతో పాటు సేకరణ వ్యవస్థ కూడా రద్దైపోతుంది. ప్రభుత్వం సేకరించనపుడు ఆహారధాన్యాల కనీసమద్దతు ధరలను నిర్ణయించాల్సిన అవసరం ఉండదు. ఒకవేళ ధరను నిర్ణయించినా ప్రభుత్వం సేకరించదు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ప్రైవేటు వారు కొనుగోలు చేయరు. కాబట్టి ప్రభుత్వం నిర్ణయించే మద్దతు ధరలకు విలువ ఉండదు. అందువలన ఆహారధాన్యాల సేకరణ, నిల్వ, పంపిణీల నుండి ప్రభుత్వం తప్పుకొంటే వాటిపై పూర్తి ఆధిపత్యం బడా కార్పొరేట్లు, బహుళజాతి సంస్థల చేతుల్లోకి పోతుంది. దేశంలోని పేద వినియోగదారులు, సామాన్య ప్రజలు తీవ్రమైన ఆహారకొరతను ఎదుర్కోవాల్సి వస్తుంది. దేశ ఆహారభద్రతకు ప్రమాదం ఏర్పడు తుంది. ఎఫ్‌సిఐ వద్ద నిల్వలు ఉండటం వలననే కోవిడ్ మహమ్మారి దేశాన్ని చుట్టు ముట్టినపుడు కొంతమంది ప్రజలకైనా ఆహారధా న్యాలను పంపిణీ చేయగలిగారు. అవే ప్రైవేటు వారి చేతిలో ఉంటే ప్రజలకు పంపిణీ చేయటం సాధ్యమయేది కాదు. ఆహారధాన్యాల ధరలు విపరీతంగా పెరిగేవి. అభివృద్ధి చెందిన దేశాలు, ఆహారధాన్యాలపై ఆధిపత్యం వహిస్తున్న బహుళజాతి సంస్థలు ప్రభుత్వాన్ని లొంగదీసు కోవటం కోసం ఆహారాన్ని ఆయుధంగా ప్రయోగిస్తాయి. మన ప్రజలు ఆహారకొరతతో అల్లాడే పరిస్థితులను కల్పిస్తాయి.

**ఎఫ్‌సిఐ రద్దుకోసం ప్రణాళికాబద్ధంగా ప్రయత్నాలు**

ఎఫ్‌సిఐని, ప్రజాపంపిణీ విధానాన్ని రద్దుచేయటానికి గత కొన్ని సంవత్సరాల నుండి ప్రభుత్వాలు ప్రయత్నం చేస్తున్నాయి. అందులో భాగంగా ఎఫ్‌సిఐ తన కార్యకలాపాలు నిర్వహించటానికి అవసరమైన మేరకు బడ్జెట్‌లో నిధులు కేటాయించటం లేదు. గత సంవత్సరం 1.15 లక్షల కోట్ల రూపాయలు కేటాయించగా రివైజ్డ్ అంచనాలలో ఖర్చు 4.22 లక్షల కోట్ల రూపాయలకు చేరుకున్నది. ఆహారధాన్యాలతో పాటు రుణాల చెల్లింపులకు కూడా కలిపి ప్రభుత్వం 2021–22 బడ్జెట్‌లో ఎఫ్‌సిఐకి 2.43 లక్షల కోట్ల రూపాయలు కేటాయిస్తున్నది.

గోధుమలు, బియ్యం సేకరించి, నిల్వచేసి, పంపిణి చేయటానికి కిలో గోధుమకు 27 రూపాయలు, కిలో బియ్యానికి 37 రూపాయల చొప్పున ఎఫ్‌సిఐకి ఖర్చు అవుతున్నది. కిలో గోధుమ 2 రూపాయలు, కిలో బియ్యం 3 రూపాయలు, ముతకధాన్యాలను కిలో రూపాయికి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు అందజేస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ధరలకు ప్రజలకు పంపిణి చేస్తున్నాయి. చాలా సంవత్సరాల నుండి ఈ ధరలు మార్పులేకుండా కొనసాగుతున్నాయి. మరోవైపున ధాన్యం, గోధుమ సేకరణ ధరలను ప్రభుత్వం ప్రతి సంవత్సరం పెంచుతున్నది. కాని అందుకు అనుగుణంగా ఎఫ్‌సిఐకి కేటాయింపులు పెంచటం లేదు. 2019–20 సంవత్సరంలో తన అవసరాల కోసం 3,17,905 కోట్ల రూపాయలు కావాలని ఎఫ్‌సిఐ ప్రభుత్వాన్ని కోరింది. కాని ప్రభుత్వం 75,000 కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించింది. అవసరాలకు, ప్రభుత్వ కేటాయింపులకు మధ్య ఈ విధమైన వ్యత్యాసాన్ని పూడ్చుకోవటానికి ఎఫ్‌సిఐ జాతీయ చిన్న పొదుపు మొత్తాల సంస్థ–ఎన్‌ఎస్‌ఎస్‌ఎఫ్–నుండి 8 శాతం వడ్డీకి రుణాలు తీసుకొంటున్నది. ఫలితంగా ఎఫ్‌సిఐ అప్పుల ఊబిలో కూరుకుపోయింది. 2020 మార్చి 31వ తేదినాటికి ఎన్‌ఎస్‌ఎస్‌ఎఫ్‌కు ఎఫ్‌సిఐ 2,54,600 కోట్ల రూపాయలు బకాయిపడింది. ఈ విధంగా ప్రభుత్వం ఆహారసబ్సిడీకి అవసరమైన మొత్తాన్ని ఎఫ్‌సిఐకి అందించక పోవటంతో ఆ సంస్థ రుణభారం భరించ లేనిదిగా తయారౌతున్నది. రుణభారం మరింత గా పెరిగితే ఎఫ్‌సిఐ కార్యకలాపాలు నిర్వహించ లేని స్థితికి చేరుకుంటుంది. దానితో ఆహార ధాన్యాల సేకరణ, ప్రజాపంపిణి విధానం రెండూ దెబ్బతింటాయి.

2020 ఏప్రిల్ 1వ తేదినాటికి ఎఫ్‌సిఐ వద్ద రికార్డుస్థాయిలో 7.383 కోట్ల టన్నుల ఆహారధాన్యాల నిల్వలు ఉన్నాయి. బఫర్ స్టాక్ నిబంధనల ప్రకారం ఆ తేదీకి 2.01 కోట్ల టన్నులు ఉండాలి. గోధుమలు 74.60 లక్షల టన్నులు ఉండల్సివుండగా, 2.47 కోట్ల టన్నులు, 3.3 రెట్లు అధికంగా ఉన్నాయి. బియ్యం 1.35 కోట్ల టన్నులకు గానూ 3.22

కోట్ల టన్నులు ఉన్నాయి. 2.52 కోట్ల మిల్లు పట్టించని ధాన్యం ఉంది. ఇది 67 శాతం దిగుబడి ప్రకారం 1.69 కోట్ల టన్నుల బియ్యానికి సమానం. ఎన్ఎఫ్ ఎస్ఎకు 5.28 కోట్ల టన్నులు, మధ్యాహ్న భోజన పథకానికి 37.7 లక్షల టన్నులు వినియోగించారు. 52.5 లక్షల టన్నులు వేలం ద్వారా బహిరంగ మార్కెట్‌లో అమ్మారు. ప్రధాని గరీబ్‌కల్యాణ్ యోజనలో భాగంగా లాక్‌డౌన్ కాలం ఏప్రిల్–జూన్ నెలల్లో ఉచితంగా పంపిణి చేయటం కోసం 1.21 కోట్ల టన్నులను అదనంగా కేటాయించారు. ఎఫ్‌సిఐ, రాష్ట్ర గోడౌన్ల మొత్తం నిల్వ సామర్థ్యం 7.58 కోట్ల టన్నులు ఉంది. దీనిలో 6.26 కోట్ల టన్నులకు గోడౌన్‌లలోనూ, 1.32 కోట్ల టన్నులు బహిరంగ ప్రదేశంలో పట్టాలు కప్పటం, ఇతర ఏర్పాట్ల ద్వారా నిల్వ చేస్తున్నారు.

> “ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ఆహారధాన్యాలను పంపిణి చేయటం ఆపివేసిన తర్వాత నిర్ణీత మొత్తాన్ని, ఉదాహరణకు ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న కిలోబియ్యం ధర 35 రూపాయలను ప్రాతిపదికగా తీసుకొని, ప్రజాపంపిణి వ్యవస్థ ద్వారా ఆహారధాన్యాలను పొందుతున్న వారి ఎకౌంట్లలో ఆ మొత్తాన్ని ప్రభుత్వం జమ చేస్తుంది. కాని ఆహారధాన్యాల ధరలు స్థిరంగా ఉండవు.”

**ప్రజాపంపిణి వ్యవస్థ రద్దైతే జరిగే పరిణామాలు**

దేశంలోని 80 కోట్లమంది ప్రజలు ప్రజాపంపిణి వ్యవస్థ ద్వారా అతి తక్కువ ధరలకు ఆహారధాన్యాలను పొందుతున్నారు. ప్రజాపంపిణి వ్యవస్థ ద్వారా ఆహారధాన్యాలను పొందటానికి కేంద్రం ఆదాయ పరిమితిని నిర్ణయించింది. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా రాష్ట్రాలలోని పరిస్థితుల ఆధారంగా ప్రజా పంపిణి వ్యవస్థను విస్తరించి, కేంద్రం నిర్ణయించిన వారి కన్నా ఎక్కువ సంఖ్యలో ప్రజలకు ఆహారధాన్యాలను అందిస్తున్నాయి. బియ్యం, గోధుమలు, పప్పులు, వంటనూనె, కిరోసిన్ తదితరాలు తక్కువ ధరలకు అందటం పేద కుటుంబాలకు వెసులుబాటుగా ఉంటున్నది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కిలో బియ్యం రూపాయికి అందిస్తున్నది. తలకు ఐదు కిలోల చొప్పున నలుగురున్న కుటుంబానికి నెలకు 20 కిలోల బియ్యం వస్తాయి. మార్కెట్‌లో తక్కువ రకం బియ్యం ధర కిలో 35 రూపాయలు ఉన్నది. అంటే కుటుంబానికి బియ్యం కొనుగోలు పైనే నెలకు 680 రూపాయలు కలిసివస్తాయి. పంచదార, కందిపప్పు ధరలను కూడా కలుపుకుంటే నెలకు 750 రూపాయలకు పైగా కుటుంబానికి రాయితి వస్తుంది. 80 శాతం కుటుంబాలకు నెలకు 10 వేల రూపాయలకు మించి ఆదాయం రావటం లేదని వివిధ అధ్యయనాలలో వెల్లడౌతున్నది. 10 వేల రూపాయల ఆదాయం రాని కుటుంబాలకు 750 రూపాయల రాయితీ చిన్న మొత్తం కాదు. డబ్బు మొత్తం కన్నా కూడా ఆహారధాన్యాలు నికరంగా ప్రతినెలా నామమాత్రపు ధరలకు లభించటం అనేది ముఖ్యమైనది.

**నగదు బదిలి పథకంతో నష్టాలు**


ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ఇస్తున్న సరుకులను ఆపివేసి, సరుకులు పొందుతున్న ప్రజలందరికీ ప్రత్యక్షంగా నగదు బదిలీ చేస్తామని, అందువలన వినియోగదారులకు నష్టం జరగదని, వినియోగదారులు తమ ఇష్టం వచ్చినచోట సరుకులు కొనుగోలు చేయవచ్చునని ప్రజలను మభ్యపెట్టి, ఆహారధాన్యాల పంపిణిని రద్దు చేయటానికి ప్రభుత్వాలు చాలాకాలం నుండి ప్రయత్నాలు చేస్తున్నాయి. కాని ఆహార ధాన్యాలకు నగదు బదిలి ఏ మాత్రం ప్రత్యామ్నాయం కాదు. ప్రభుత్వ నగదు బదిలీ పథకాలు అత్యంత లోపభూయిష్టంగా ఉంటున్నాయి. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న రైతులకు నగదు బదిలీ పథకంలో మూడోవంతు మంది, అంటే దాదాపు నాలుగు కోట్లమంది రైతులకు డబ్బు అందటం లేదు. డబ్బు అందని వారుచేస్తున్న ఆందోళనను కేంద్ర ప్రభుత్వం పట్టించు కోవటం లేదు. వంటగ్యాస్ సబ్సిడీ పొందటానికి అర్హులై, సబ్సిడి అందనివారు కూడా కోట్లసంఖ్యలోనే ఉన్నారు. ఆహారధాన్యాలకు బదులు నగదు బదిలీని ప్రవేశపెడితే ఈ పథకాలలో జరుగుతున్న విధంగానే గణనీయమైన సంఖ్యలో అర్హులకు డబ్బు అందకుండాపోయే ప్రమాదం ఉంది.

రెండవది, అత్యంత ముఖ్యమైనది ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ఆహారధాన్యాలను పంపిణి చేయటం ఆపివేసిన తర్వాత నిర్ణీత మొత్తాన్ని, ఉదాహరణకు ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న కిలోబియ్యం ధర 35 రూపాయలను ప్రాతిపదికగా తీసుకొని, ప్రజాపంపిణి వ్యవస్థ ద్వారా ఆహారధాన్యాలను పొందుతున్న వారి ఎకౌంట్లలో ఆ మొత్తాన్ని ప్రభుత్వం జమ చేస్తుంది. కాని ఆహారధాన్యాల ధరలు స్థిరంగా ఉండవు. ముఖ్యంగా ప్రజా పంపిణీ వ్యవస్థ నుండి ప్రభుత్వం తప్పుకున్న తర్వాత ఆహార ధాన్యాల మార్కెట్‌పై కార్పొరేట్ సంస్థల ఆధిపత్యం ఏర్పడుతుంది. వారు కృత్రిమ కొరతను సృష్టించి, ధరలను విపరీతంగా పెంచుతారు. కేంద్రం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలలో ఒకటైన నిత్యావసర సరుకుల సవరణ చట్టంలో నిత్యావసర సరుకుల ధరలు 50 శాతం పెరిగే వరకు జోక్యం చేసుకోనని ప్రభుత్వం చెప్పింది. కాబట్టి మార్కెట్ లో 35 రూపాయలకు అమ్ముతున్న బియ్యాన్ని 52 రూపాయలకు అమ్ముతున్నా ధర 50 శాతం పెరగలేదు కాబట్టి ప్రభుత్వం జోక్యం చేసుకోదు. 50 శాతం మించి ధరలు పెరిగేవరకు మార్కెట్‌లో జోక్యం చేసుకోనని చెబుతున్న ప్రభుత్వం లబ్దిదారులకు చెల్లించే మొత్తాన్ని కూడా పెంచదు. అంటే ధరల పెరుగుదల భారమంతా పేదప్రజలపై పడుతుంది. వారి కొనుగోలు శక్తి హరించుకుపోతుంది.

ప్రపంచ ఆకలిసూచిలో ఉన్న 107 దేశాలలో మనదేశం 94వ స్థానంలో ఉన్నది. దేశప్రజలలో 50 శాతం మందికి పైగా రక్తహీనతతో బాధపడుతున్నారు. గిడసబారిన (వయసుకు తగినంత ఎత్తులేకపోవటటం), కుంచించుకుపోయిన (ఎత్తుకు తగినంత బరువు లేకపోవటం) బాలలు, యువత ఎక్కువ మంది మనదేశంలోనే ఉన్నారు. ఇటువంటి పరిస్థితులలో పేదప్రజలకు తక్కువ ధరలకు అందుతున్న ఆహారధాన్యాలను ఆపివేసి కొనుగోలు శక్తిని హరించటం వారిని మరింత దరిద్రంలో ముంచుతుంది. వీరు ఎదుర్కొం టున్న ఆకలి, ఆరోగ్య సమస్యలు మరింత తీవ్రం కావటం, ఆకలితో అలమటిస్తున్న దేశాల జాబితాలో మనదేశం మరింత కిందిస్థాయికి దిగజారటానికి ఈ విధానం దారితీస్తుంది.

ప్రభుత్వం అందరికీ పోషకాహారాన్ని అందించటానికి అవసరమైన విధానాలను రూపొందించి, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవటం ఉపయుక్తంగా ఉంటుంది.

> **"ఈ సంవత్సరం ఖరీఫ్‌లో వరిధాన్యానికి క్వింటాలుకు సాధారణ రకానికి 1868, గ్రేడ్ ఎ రకానికి 1888 రూపాయలను కనీసమద్దతు ధరగా కేంద్రప్రభుత్వం నిర్ణయిం చింది. ఈ ధరల ప్రకారం గ్రేడ్ ఎ రకం ధాన్యం 75 కిలోల బస్తాకు 1366 రూపాయలు రావాలి. కాని ఎక్కువ మంది రైతాంగం బస్తా 1000 నుండి 1150 రూపాయల మధ్యనే అమ్ముకున్నారు. బస్తాకు 216 నుండి 366 రూపాయల వరకు నష్టపోయారు."**



లక్షలాది టన్నుల ఆహార ధాన్యాలను నిల్వచేస్తున్న ప్రభుత్వ గోడౌన్‌లు

అందరికీ పోషకాహారం అందించటానికి ప్రభుత్వం రెండు చర్యలు తీసుకోవాలి. ఒకటి ప్రజలు తమకు అవసరమై పోషకాహారాన్ని తీసుకొంటూ ఆరోగ్యంగా బతకటానికి అవసరమైనంత ఆదాయం ప్రతి కుటుంబానికి వచ్చే విధంగా ఆర్థిక విధానాలను రూపొందించాలి. కార్మికులు, వ్యవసాయ కార్మికులు, రైతులు, ఇతర వృత్తిదారులు, చిరుద్యోగులకు అందుకు అవసరమైన ఆదాయం వచ్చే విధంగా చట్టాలను రూపొందించాలి. అపుడు ప్రతి కుటుంబం తన ఆదాయంతోనే అవసరమైనంత పోషకాహారం తీసుకొంటూ ఆరోగ్యంగా ఉంటుంది. లేదా ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండటానికి అవసరమైన పోషకాలుండే ఆహారాన్ని నామమాత్రమైన ధరలకు ప్రభుత్వమే ప్రజలకు అందజేయాలి. ఈ విధంగా చెబుతుంటే అందరికీ కావలసినన్ని ఆహార ధాన్యాలను అందించటానికి ప్రభుత్వానికి ఎక్కడి నుండి ఆదాయం వస్తుందని వాదించే వారున్నారు. కాని ప్రభుత్వం బడా పెట్టుబడి దారులు, బహుళజాతి సంస్థలు, కాంట్రాక్టర్లు తదితరులకు దోచిపెట్టే దానిలో కొంత భాగాన్ని కేటాయిస్తే ప్రజలకు పోషకాహారాన్ని అందించటానికి ఎటువంటి నిధుల సమస్య ఏర్పడదు.

**పంపిణీ లేకపోతే సేకరణా ఉండదు**

ప్రజలకు ఆహారధాన్యాలను అందించటం నుండి తప్పుకొని, ప్రత్యక్షంగా డబ్బును అందిస్తుంటే ప్రభుత్వం ఆహారధాన్యాలను సేకరించి, నిల్వ చేయాల్సిన అవసరం ఉండదు. ఆహారధాన్యాల మార్కెట్‌పై బడా కార్పొరేట్లు, బహుళజాతి సంస్థల ఆధిపత్యం ఏర్పడుతుంది. ఈ సంస్థలు లాభాలు సంపాదించుకోవటానికి అనుగుణంగా ఆహారధాన్యాల సేకరణ, నిల్వ, మార్కెట్‌లోకి సరుకులను విడుదల చేసే పరిమాణం ఉంటాయి. పంటలు మార్కెట్‌లోకి వస్తున్న తరుణంలో కార్పొరేట్ సంస్థలు ఆహారపంటల ధరలు తగ్గించి కొనుగోలు చేస్తారు. వారు ఎంతకు కొనుగోలు చేస్తున్నా అమ్ముకోవటం మినహా రైతాంగానికి మరో ప్రత్యామ్నాయం ఉండదు. చిన్న వ్యాపారులైతే ఒకరితో ఒకరు పోటీపడి కొంతమేరకైనా రేట్లు పెంచటానికి అవకాశం ఉంటుంది. కాని అంతర్జాతీయ మార్కెట్‌ను అదుపుచేయగల సంస్థలు మార్కెట్‌పై ఆధిపత్యం సంపాదించిన తర్వాత అటువంటి అవకాశం ఉండదు. కార్పొరేట్ సంస్థలు చెప్పిన ధరకు అమ్ముకోక తప్పని పరిస్థితి రైతులకు ఏర్పడుతుంది. తమ లాభాల కోసం ధరలను ఎంతకైనా దిగ్గోయటానికి కార్పొరేట్ సంస్థలు వెనుకాడవు. ప్రభుత్వం మద్దతు ధరలను నిర్ణయించటం, కొనుగోలు యంత్రాంగం ఉండి, మార్కెట్‌లోకి వస్తున్న ఆహారధాన్యాలను కొంతమేరకు కొనుగోలు చేస్తున్నపుడే రైతులు మద్దతు ధరలను పొందలేకపోతున్నారు. ఈ సంవత్సరం ఖరీఫ్‌లో వరిధాన్యానికి క్వింటాలుకు సాధారణ రకానికి 1868, గ్రేడ్ ఎ రకానికి 1888 రూపాయలను కనీసమద్దతు ధరగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయిం చింది. ఈ ధరల ప్రకారం గ్రేడ్ ఎ రకం ధాన్యం 75 కిలోల బస్తాకు 1366 రూపాయలు రావాలి. కాని ఎక్కువ మంది రైతాంగం బస్తా 1000 నుండి 1150 రూపాయల మధ్యనే అమ్ముకున్నారు. బస్తాకు 216 నుండి 366 రూపాయల వరకు నష్టపోయారు. తమ ధాన్యాన్ని మద్దతు ధరలకు కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలలోని మార్కెట్ యార్డుల వద్ద రైతులు ఆందోళనలు చేశారు. మద్దతు ధరల నిర్ణయం, ప్రభుత్వ కొనుగోలు యంత్రాంగం ఉన్నప్పటి పరిస్థితి ఇది. ఇవన్నీ లేకుండా పోయిన తర్వాత రైతుల పరిస్థితి మరింత దయనీయంగా తయారవుతుంది. ఆహార ధాన్యాల పంటలకు ధరలు విపరీతంగా తగ్గిపోవటంతో వ్యాపారపంటలు పండిస్తే ఎక్కువ లాభాలొస్తాయని రైతాంగాన్ని మభ్యపెట్టి, వ్యాపారపంటల వైపు మళ్ళిస్తారు. దానితో ఆహారపంటలు పండించే భూమి, ఆహారధాన్యాల ఉత్పత్తి తగ్గుతుంది. ఫలితంగా దేశంఆహార ధాన్యాల కొరతను ఎదుర్కొంటుంది. ఆహార ధాన్యాల సరఫరా కోసం విదేశాలపై ఆధార పడాల్సివస్తుంది.

ప్రభుత్వం ఆహారధాన్యాలను సేకరించటంలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎఫ్‌సిఐ కన్నా రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు ఎపిఎంసిలు, కో ఆపరేటివ్ సొసైటీలు ప్రధానపాత్ర వహిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఆహారధాన్యాల సేకరణలో క్రమంగా ఎఫ్‌సిఐ పాత్రను తగ్గిస్తున్నది. ఎఫ్‌సిఐ 2013-14లో 19 శాతం ధాన్యాన్ని సేకరించగా, 2018-19కి 1.02 శాతానికి తగ్గింది. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వ సంస్థల పాత్ర పెరిగింది. రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోని ఎపిఎంసిలు, కో

ఆపరేటివ్ సంస్థలు ఆహారధాన్యాలను సేకరించి ఎఫ్‌సిఐకి అందజేస్తాయి. ఎఫ్‌సిఐ ఆయా రాష్ట్రాల అవసరాల ప్రాతిపదికగా పంపిణి చేస్తుంది. 2020-21 ఖరీఫ్ సీజన్‌లో గోధుమలు 3.89 కోట్ల టన్నులు సేకరించగా దానిలో ఎఫ్‌సిఐ 38.66 లక్షల టన్నులు, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోని సంస్థలు 3.51 కోట్ల టన్నులు సేకరించాయి. 2020 జూన్ నాటికి 4.77 కోట్ల టన్నుల బియ్యం సేకరించగా దీనిలో నాలుగు కోట్ల టన్నులకు పైగా రాష్ట్రప్రభుత్వ సంస్థలే సేకరించాయి. ఈ విధంగా సేకరించిన ఆహారధాన్యాలను ఎఫ్‌సిఐ, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోని గోడౌన్‌లలో నిల్వచేస్తారు. ఆయా రాష్ట్ర ప్రభుత్వాల అవసరాల మేరకు ఆహార ధాన్యాలను అందజేయటంతో పాటు బహి రంగ మార్కెట్‌లోకి విడుదల చేయటం, ఎగుమ తులు చేయటం కేంద్ర ప్రభుత్వం చేస్తుంది.

కేంద్రం చేసిన వ్యవసాయ చట్టాలలో ప్రైవేటు మార్కెట్ల ఏర్పాటుకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వాల ఆధ్వర్యంలో నడుస్తున్న ఎపిఎం సిలను నిర్వీర్యం చేసే విధానాలను ప్రతిపాదిం చింది. మార్కెట్‌లలో సెస్సులు, ఫీజులు వసూలు చేయటం నిషేధించారు. ఎపిఎంసిలు మార్కెట్ సెస్‌ల ఆధారంగానే పనిచేస్తున్నాయి. ఫీజు వసూలు చేయకపోతే అవి పనిచేయక మూతపడ తాయి. రైతులకు అండగా ఉండి, ప్రైవేటు వ్యాపారుల దోపిడీ నుండి కొంతమేరకు రక్షణ కల్పిస్తున్న ఈ సంస్థలు నిర్వీర్యం అయితే రైతులు పూర్తిగా కార్పొరేట్ సంస్థలపై ఆధారపడటం మినహా ప్రత్యామ్నాయం ఉండదు. ధరల ఒడిదుడుకులు, ప్రభుత్వం, కార్పొరేట్ల ప్రచారం ఫలితంగా రైతాంగం క్రమంగా వాణిజ్య పంటల వైపు మొగ్గుతారు. వాణిజ్యపంటలకు అంతర్జాతీయ మార్కెట్‌లో అధిక ధరలు వస్తాయని, రైతాంగానికి ఎక్కువ లాభాలు వస్తాయని ఇప్పటికే తీవ్రంగా ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వం కూడా సంవత్సరానికి ఐదుశాతం భూమిని అదనంగా వాణిజ్య పంటల వైపు మళ్ళించాలని లక్ష్యంగా నిర్దేశిం చింది. అంతర్జాతీయ మార్కెట్‌లో వాణిజ్య పంటల ధరలలో తీవ్రమైన ఒడిదుడుకులు ఎదురౌతుంటాయి. ఎపుడు ధరలు పడిపో తాయో, ఎపుడు పెరుగుతాయో చెప్పలేని పరిస్థితి ఉంటుంది. బహుళజాతి సంస్థల పెత్తనంలో మార్కెట్‌లు ఉంటాయి. అంతర్జా తీయ మార్కెట్‌లో సరుకుల ధరలు పెరిగి లాభాలు వచ్చినపుడు అవి రైతులకు చేరవు.

**"అంతర్జాతీయ మార్కెట్‌లో వాణిజ్య పంటల ధరలలో తీవ్రమైన ఒడిదుడుకులు ఎదురౌతుంటాయి. ఎపుడు ధరలు పడిపో తాయో, ఎపుడు పెరుగుతాయో చెప్పలేని పరిస్థితి ఉంటుంది. బహుళజాతి సంస్థల పెత్తనంలో మార్కెట్‌లు ఉంటాయి. అంతర్జా తీయ మార్కెట్‌లో సరుకుల ధరలు పెరిగి లాభాలు వచ్చినపుడు అవి రైతులకు చేరవు. ధరలు తగ్గి నష్టాలు వచ్చినపుడు మాత్రం వాటిని రైతాంగం భరించాల్సి వస్తుంది."**



రేషన్ షాపుల్లో ఆహారధాన్యాలను తీసుకుంటున్న పేద ప్రజలు

ధరలు తగ్గి నష్టాలు వచ్చినపుడు మాత్రం వాటిని రైతాంగం భరించాల్సి వస్తుంది. ఫలితంగా రైతాంగం అప్పుల పాలవటం, దివాళా తీయటం, భూములు అమ్ముకోవటం, ఆత్మహత్యలు చేసుకోవటం మరింతగా పెరుగుతాయి. అందువలన ప్రభుత్వంఎఫ్‌సిఐని నిర్వీర్యం చేయటం, ప్రజాపంపిణీ వ్యవస్థను రద్దుచేయటం, వినియోగదారులకు ప్రత్యక్షంగా డబ్బు అందజేసే విధానం వినియోగదారులతో పాటు రైతాంగంపై కూడా తీవ్రమైన దుష్ప్ర భావాలను కలిగిస్తాయి.

**బడాబాబులకు రెండువైపుల నుండి లాభాలు**

ప్రభుత్వ విధానాల వలన బాడా వ్యాపారు లు, కార్పొరేట్ సంస్థలు రెండు వైపుల నుండి లాభాలు పొందుతారు. రైతాంగం నుండి వ్యవసాయోత్పత్తులను కొనుగోలు చేయటంలో ప్రభుత్వ మార్కెట్లు, ఏజన్సీల బెడద వారికి ఉండదు. కాబట్టి అతి తక్కువ ధరలకు కొనుగోలు చేయటం ద్వారా రైతాంగాన్ని దోపిడీచేస్తారు. మరోవైపున అత్యధికంగా ధరలు పెంచి వినియోగదారులను కొల్లగొడతారు. ప్రభుత్వం రెండు వైపుల నుండి ఉపసంహ రించుకోవటం వల్లనే వారి ఇష్టానుసారం లాభాలు పిండుకోవటం జరుగుతుంది. ప్రజా పంపిణి వ్యవస్థ నుండి ఉపసంహరించు కోవటం ద్వారా ప్రజలు మొత్తం ఆహార ధాన్యాలను ప్రైవేటు వ్యాపారుల వద్దనుండి కొనుక్కోక తప్పని పరిస్థితిని ప్రభుత్వం కల్పిస్తున్నది. మరోవైపున ప్రభుత్వ కొనుగోలు వ్యవస్థలను నిర్వీర్యం చేయటం ద్వారా రైతాంగం కార్పొరేట్‌లకు అమ్ముకోవటం మినహా గత్యంతరం లేని స్థితిని కల్పిస్తున్నది. ఈ విధంగా కొనుగోలు, అమ్మకం మార్కెట్లపై కార్పొరేట్‌లు, బహుళజాతి సంస్థలు పెత్తనం చేసే విధానం రైతులు, వినియోగ దారులకు వినాశకరంగా పరిణమిస్తుంది. అందువలన కొందరికి అంతులేని లాభాలను అందించటానికి మినహా ప్రజలకు ఆహారధాన్యా లను, రైతాంగానికి మద్దతు ధరలుఅందించ టానికి ఈ విధానాలు దోహదం చేయవు.

❋

ఈ మాసం ప్రత్యేకం

# 72 సంవత్సరాల భారత గణతంత్రం

పి. అజయకుమార్



రచయిత సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు

దేశ రాజ్యాంగం పవిత్రమైనది అంటారు. దాని మీదనే మన ప్రజా ప్రతినిధులు ప్రమాణస్వీకారం చేస్తారు. మోడీ ప్రభుత్వ పాలనలో రాజ్యాంగం మీద దాడి జరుగుతోంది. కాలం గడిచే కొద్దీ అది తీవ్రమవుతోంది. రాజ్యాంగంలోని ప్రధాన అంశాలు వేటిని కూడా పాలకులు పాటించటంలేదు. వాటికి విరుద్ధంగా పాలన చేస్తున్నారు.

1949 నవంబరు 26న అప్పటి జాతీయ అసెంబ్లీ ఆమోదించిన రాజ్యాంగం 1950 జనవరి 26 నుండి అమలులోకి వచ్చింది. అప్పటి నుండి జనవరి 26ను రిపబ్లిక్‌డే (గణతంత్ర దినోత్సవం) గా జరుపుకుంటున్నాం. రిపబ్లిక్ డే రోజున ఎగరేసే జెండానే మన జాతీయ జెండా. ఈ జెండాను గౌరవిస్తాం. పొరపాటున దాన్ని తిరగేసి ఎగరేసినా, చూడక తొక్కినా నేరం కింద భావిస్తారు. రాజ్యాంగం వల్లనే రిపబ్లిక్‌డేకు ప్రాధాన్యత వచ్చింది. కాని రిపబ్లిక్‌డే జరపటంలో ఉన్నంత ప్రాధాన్యత రాజ్యాంగం అమలులో కనపడదు. మొన్న జనవరి 26 న 72వ గణతంత్ర దినోత్సవాన్ని (రిపబ్లిక్ డే) జరుపుకున్నాం.

రిపబ్లిక్ అంటే గణతంత్రం. ప్రజల స్వామ్యం, ప్రజాస్వామ్యం. భారతదేశం గణ తంత్ర రాజ్యం. ప్రజాస్వామిక రాజ్యం. రాచరికం కాదు. ప్రజలకే ప్రాధాన్యత. ప్రభువులకు కాదు.

### రాజ్యాంగ పీఠిక

రాజ్యాంగ పీఠిక రాజ్యాంగాన్ని పరిచయం చేస్తూ ప్రకటన చేసింది. రాజ్యాంగం, దేశం మరియు దాని ప్రజల ఆశలను, ఆదర్శాలను ప్రతిబింబించింది. భారత ప్రజల ఆకాంక్షల ఆధారంగానే రాజ్యాంగం రూపొందింది. రాజ్యాంగ నిబంధనలకు భాష్యం చెప్పటంలో చట్టబద్ధమయిన సహాయం చేసింది. సాధించ దలుచుకున్న లక్ష్యాలు పీఠికలో ఉన్నాయి.

భారత ప్రజలే తమ రాజ్యాన్ని రూపొంది ంచుకున్నట్లు, భారత పౌరులందరికీ న్యాయం, స్వాతంత్ర్యం, సమానత్వాలను గ్యారంటీ చేస్తున్నట్లు పీఠికలో ఉంది.

"భారత ప్రజలమైన మేము భారతదేశాన్ని సార్వభౌమత్వం (విదేశీ జోక్యం లేని పాలన), సామ్యవాదం, లౌకికతత్వం, ప్రజాస్వామ్యాలతో కూడిన గణతంత్ర రాజ్యంగా తీర్మానిస్తున్నాం. దేశ పౌరులందరికీ సామాజిక, ఆర్థిక మరియు రాజకీయ న్యాయం, ఆలోచన, భావప్రకటన, నమ్మకం, విశ్వాసం, ఆరాధనలలో స్వేచ్ఛ, హోదా, అవకాశాలలో సమానత్వాన్ని మరియు వారందరి మధ్య సోదరభావాన్ని ప్రోత్సహిస్తాం. వ్యక్తి ఆత్మగౌరవానికి, దేశ ఐక్యతకు, సమగ్రతకు హామీనిస్తున్నాం. 1949 నవంబరు 26న రాజ్యాంగ అసెంబ్లీలో రాజ్యాంగాన్ని ఆమోదించి మాకు మేము సమర్పించుకుంటున్నాం."

### ప్రాథమిక హక్కులు

రాజ్యాంగం దేశ పౌరులకు కొన్ని ప్రాథమిక హక్కులను గ్యారంటీ చేసింది. చట్టం ముందు అందరూ సమానులే, జీవితానికి, స్వేచ్ఛకు రక్షణ ఉంటుంది. మతం, జాతి, కులం, లింగం ఆధారంగా వివక్ష నిషేధం, దళిత, గిరిజన, వెనుక బడిన జాతుల అభివృద్ధి ప్రభుత్వ ఉద్యో గాలలో సమానత్వం. అంటరానితనం నిషేధం విద్యాహక్కు, కొన్ని అరెస్టులు మరియు నిర్బంధం నుండి రక్షణ, పౌరులందరికీ మాట్లాడే స్వేచ్ఛ, అభిప్రాయాలు వ్యక్తం చేసే స్వేచ్ఛ, శాంతియుతంగా ఒక చోట జమ కూడే స్వేచ్ఛ, యూనియన్లు, అసోసియేషన్లు పెట్టుకునే హక్కు, దేశంలో ఎక్కడైనా స్వేచ్ఛగా తిరిగే హక్కు, కొన్ని నిబంధనలకు లోబడి తన మనస్సుకు తోచిన విధంగా ఉండటం. మత అవలంబన, ప్రచార స్వేచ్ఛ. మైనార్టీలకు రక్షణ తదితర ప్రాథమిక హక్కులు గ్యారంటీ చేయబడ్డాయి.

దేశ చట్టాలు ప్రాథమిక హక్కులకు అనుగుణంగా తయారుకావాలి. ప్రాథమిక హక్కులను రాజ్యం కాపాడాలి.

### ఆదేశిక సూత్రాలు

ప్రాథమిక హక్కులతో పాటు కొన్ని ఆదేశిక సూత్రాలు కూడా రాజ్యాంగంలో ఉన్నాయి. వాటికి లోబడి పాలన కొనసాగాలి. ఆదేశిక సూత్రాలను ప్రాథమిక హక్కుల మాదిరిగా అమలు చేయాలని కోర్టులు ఒత్తిడి చేసే అవకాశం లేదు. కానీ ఈ సూత్రాల ఆధారంగా చట్టాలు తయారు చేయాలి. సామాజిక, ఆర్థిక, రాజకీయ రక్షణ కల్పించేలా ప్రజలకు సంక్షేమం కల్పించాలి. ఆదాయాలలో అసమానతలను తగ్గించాలి. హోదా, సౌకర్యాలు, అవకాశాలలో అసమానతలను వ్యక్తుల మధ్యే కాకుండా గ్రూపుల మధ్య తొలగించేందుకు రాజ్యం కృషి చేయాలి.

జీవనోపాధి హక్కులను సమానంగా పౌరులందరికీ కల్పించాలి. సామాజిక వనరుల నియంత్రణ మరియు యాజమాన్యం, ఉమ్మడి మేలు కోసం పంపిణీ కావాలి. సంపద కేంద్రీ కరించబడేలా ఆర్థిక వ్యవస్థ నడవ కూడదు. స్త్రీ, పురుషులు ఇద్దరికీ సమానపనికి సమాన వేతనం ఇవ్వాలి.

ఆర్థిక సామర్ధ్యం పరిమితికి లోబడి పనిచేసే హక్కు కల్పనకు సమర్ధవంతమైన నిబంధనలు ఉండాలి. నిరుద్యోగం, వృద్ధాప్యం, వైకల్యం, అనారోగ్యాలకు ప్రభుత్వ సహాయం ఉండాలి. అన్ని రకాల కార్మికులకు జీవన వేతనం కల్పించేలా రాజ్యం కృషి చేయాలి. ఈ లక్ష్యాలకు అనుగుణంగా రాజ్యం తన విధానాలను నిర్దేశించుకోవాలి.

### అధికారాల విభజన

ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలతో పాటు మరో ముఖ్యమైన అంశం కేంద్రం, రాష్ట్రాల మధ్య అధికారాల విభజన. కేంద్రం ప్రధానంగా రక్షణ, విదేశీ వ్యవహారాలు, అంతర్జాతీయ అంశాలు, జాతీయ స్థాయి రంగాలు, జాతీయ పన్నులు మున్నగు వాటికి బాధ్యత వహిస్తుంది. రాష్ట్రాలు వ్యవసాయం,

మార్కెట్లు, శాంతి భద్రతలు, నీరు, భూమి మరియు రాష్ట్రస్థాయి అంశాలపై హక్కులు, బాధ్యతలు కలిగి ఉంటాయి. కేంద్రం, రాష్ట్రాల ఉమ్మడి జాబితాలో విద్యుత్తు, విద్య, పెళ్ళిళ్లు మరియు విడాకులు, ముందస్తు నిర్బంధం, మైనర్ పోర్టులు తదితరాలు ఉన్నాయి.

మోడీ ప్రభుత్వ పాలనలో రాజ్యాంగం ఏ విధంగా ఉల్లంఘించబడుతుందనేది పరిశీలిం చాలి. రైతుల పోరాటం తక్షణంగా మనకు కనపడుతుంది. వ్యవసాయం రాష్ట్రాల పరిధి లోని అంశం కాగా, కేంద్రం తన ఇష్టానుసారం రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాలను చేసి రైతుల పైన, రాష్ట్రాల పైన ఎలా రుద్దగలిగిందనే ప్రశ్న వస్తుంది. రాష్ట్ర పరిధిలోని వ్యవసాయ మార్కెట్ల ను నిర్వీర్యం చేసి కార్పొరేట్ కంపెనీలకు వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్‌ను ఎలా అప్పగిం చింది? వ్యవసాయ చట్టాలను తయారు చేసే హక్కు కేంద్రానికి లేదని సుప్రీంకోర్టులో పిటిషన్లు వేశారు. సుప్రీంకోర్టు ఆ విషయంపై వాదనలు విని తీర్పు ఇవ్వాలి. సుప్రీంకోర్టు ఆ విధంగా తన పని చేయకుండా తన పరిధిలో లేని అంశాలపై మధ్యవర్తిత్వ పాత్ర వహిస్తున్నది. బిజెపి రాష్ట్ర ప్రభుత్వాలు తప్ప మిగతా రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ నల్ల చట్టాలను వ్యతిరేకిస్తున్నాయి. అసెంబ్లీలలో తీర్మానాలు కూడా చేశాయి. సమాఖ్య స్ఫూర్తికి కేంద్రం భంగం కలిగించింది.

కేంద్రం, రాష్ట్రాల ఉమ్మడి పరిధిలో ఉన్న విద్యుత్తు, విద్య, కార్మిక వ్యవహారాలు, మైనర్ పోర్టుల విషయంలో మోడీ ప్రభుత్వం తన ఇష్టాను సారం ఏకపక్షంగా వ్యవహరించింది. రాష్ట్రాలతో సరయిన చర్చలు చేయకుండానే లేబరు కోడ్ బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదింప చేసింది. కార్మిక హక్కులను హరించే విధంగా కార్మిక చట్టాల్లో మార్పులు చేయమని ముందుగా రాష్ట్ర ప్రభుత్వాలను ప్రోత్సహించింది. అంతిమంగా తానే లేబర్ చట్టాలన్నింటినీ రద్దు చేసి వాటిలో ఉన్న కార్మిక హక్కులను కుదించి లేబర్ కోడ్‌లుగా మార్చి ప్రతిపక్ష సభ్యులెవరూ లేనపుడు పార్లమెంట్లో ఆమోదింప చేసింది.

విద్యుత్తు చట్టానికి మోడీ ప్రభుత్వం చేసిన సవరణలను 10 రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేకిం చాయి. అయినా విద్యుత్తు బిల్లు పార్లమెంట్‌లో ఆమోదింపబడకుండానే అందులో ఉన్న నిబంధనలు అమలు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వాలను ఆర్థికంగా బ్లాక్‌మెయిల్ చేసి అమలు చేయిస్తున్నది. విద్యను కూడా మోడీ

**“ కేంద్రం, రాష్ట్రాల ఉమ్మడి పరిధిలో ఉన్న విద్యుత్తు, విద్య, కార్మిక వ్యవహారాలు, మైనర్ పోర్టుల విషయంలో మోడీ ప్రభుత్వం తన ఇష్టాను సారం ఏకపక్షంగా వ్యవహరించింది. రాష్ట్రాలతో సరయిన చర్చలు చేయకుండానే లేబరు కోడ్ బిల్లులను పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదింప చేసింది. కార్మిక హక్కులను హరించే విధంగా కార్మిక చట్టాల్లో మార్పులు చేయమని ముందుగా రాష్ట్ర ప్రభుత్వాలను ప్రోత్సహించింది. ”**



పోర్టుల ప్రైవేటీకరణతో ప్రైవేటువారి చేతుల్లోకి వెళ్ళనున్న విశాఖపట్నం పోర్టు

ప్రభుత్వం పూర్తిగా తన ఆధీనంలోకి తెచ్చుకుం టున్నది.

మైనర్ పోర్టులను కూడా కేంద్రం తన ఆధీనంలోకి తెచ్చుకునేలా ప్రతిపాదనలు చేసింది. రాజ్యాంగంలో ఉన్న ప్రాథమిక హక్కులను హరిస్తున్నది. చట్టబద్ధమయిన నిరసనలు, ఆందోళనలను కూడా అణిచివే స్తున్నది. భీమాకోరేగావ్ అల్లర్లను ప్రేరేపించిన సంఘపరివార్ మనుషులను వదిలేసి మానవ హక్కుల కోసం, దళిత హక్కుల కోసం, ట్రేడ్ యూనియన్ హక్కుల కోసం పోరాడుతున్న నాయకులు, కార్యకర్తలను జైళ్ళలోకుక్కింది. జనవరి 26 న ఎర్ర కోటపై దాడి చేసిన బిజెపి గూండాలను వదిలేసి రైతు ఉద్యమ నాయకులపై కేసులు పెట్టింది.

మోడీ ప్రభుత్వ పాలనలో రాజ్యాంగం ప్రసాదించిన మైనారిటీల హక్కులకు భంగం కలగటమేగాకుండా వారిపై సంఘపరివార్ శక్తులు భౌతిక దాడులకు దిగుతున్నారు. మైనారిటీ మతస్తులకు తమ మతాన్ని ప్రచారం చేసుకునే హక్కు కాలరాయ బడుతోంది. దళితులు, మహిళలు, మైనారిటీలు, గిరిజనులు తదితర సామాజిక తరగతులు మోడీ ప్రభుత్వ పాలనలో వివక్షకు, దాడులకు గురౌతున్నారు. బిజెపి పాలిస్తున్న రాష్ట్రాలలో మహిళలకు రక్షణ లేకుండా పోయింది.

తమ అభిప్రాయాలు వ్యక్తం చేసే స్వేచ్ఛను కూడా పౌరులు కోల్పోతున్నారు. కార్టూనిస్టులు, జర్నలిస్టులు, హేతువాదులు జైళ్ళ పాలవు తున్నారు. హత్యలకు గురవుతున్నారు. న్యాయవ్యవస్థను పరిపాలనా వ్యవస్థ నుండి వేరు చేయాలనే రాజ్యాంగ ఆదేశిక సూత్రం ఉల్లంఘించ బడుతున్నట్లు కొన్ని కోర్టుల తీర్పులు తేటతెల్లం చేస్తున్నాయి.

“విమర్శను, అసమ్మతిని శక్తిమంత మయిన వ్యక్తులు, సంస్థలు సహించలేని పరిస్థితి వస్తే జైళ్ళ పాలయిన ఆర్టిస్టులు, వర్ధిల్లుతున్న పెంపుడు కుక్కల దేశంగా మన దేశం దిగ జారుతుంద”ని ప్రముఖ హాస్య కళాకారుడు కునాల్ కర్మా తనపై వేసిన కేసులో వాదించారు.

**"రాజ్యాంగంలో ఉన్న లౌకికతత్వాన్ని తొలగించాలని కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి డిమాండ్ చేస్తోంది. లౌకికతత్వం అంటే మతాన్ని రాజకీయాల నుండి వేరు చేయడం. లౌకికతత్వం లేకుండా ప్రజలను ఐక్యంగా ఉంచలేం. తన రాజకీయ ప్రయోజనాల కోసం మెజార్టీ మతతత్వ భావాలను రెచ్చగొట్టి విభజించి పరిపాలిస్తున్న బిజెపికి లౌకికతత్వం అంటే గిట్టదు. మతాన్ని రాజకీయాలతో మిళితం చేయటమే దానికి కావాలి."**



ఉద్యోగ భద్రత, వేతనాల పెంపు కోసం పోరాడుతున్న అంగన్‌వాడి కార్మికులు

ఇది నేడు మోడీ పాలనలో ప్రజాస్వామ్యానికి పట్టిన దుర్గతి. ఇక కార్మికుల సంగతి చెప్పనక్కర లేదు. ప్రాథమిక హక్కుగా ఉన్న జీవించే హక్కు కాలరాయబడుతోంది. కార్మికులకు జీవన వేతనాన్ని గ్యారంటీ చేయాలనే ప్రయత్నం రాజ్యం చేయాలి. అటువంటి ప్రయత్నం చేయకపోగా, దానికి ముందస్తుగా ఉన్న కనీస వేతనాల సవరణకు గానీ వాటి అమలుకుగాని కార్మికులు నోచుకోవటంలేదు. యూనియన్లు పెట్టుకునే హక్కు ప్రాథమికహక్కు. కానీ యూనియన్లు పెట్టుకుంటే ఉద్యోగాలు ఊడి పోతున్నాయి. పాలకులు యాజమాన్యాల కొమ్ముకాస్తున్నారు. ఇది రాజ్యాంగ ఉల్లంఘన గాక మరేమిటి?

సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని రాజ్యాంగం ఆదేశం. పర్మినెంట్ కార్మికులతో సమానంగా వారి పనినే చేస్తున్న ఇతర కార్మికులకు పర్మినెంట్ కార్మికుల వేతనాలు ఇవ్వకపోవటం రాజ్యాంగానికి చేసే ద్రోహం కాదా? అక్కడదాకా ఎందుకు? మన రాష్ట్రంలో రాజ్యాంగంలో పేర్కొన్న హక్కులు పాతాళం లోకి పోవటం లేదా? ఊరేగింపు చేస్తాం, నిరసన చేస్తామని పోలీసు వారికి ముందుగా తెలియజేసినా నాయకులను ఇంట్లో నిర్బంధిం చటం ఏ రాజ్యాంగంలో ఉన్న నిబంధన? ముఖ్యమంత్రి ఏ జిల్లాకు పోయినా ఆ జిల్లాలోని కార్మిక నాయకులను గృహ నిర్బంధం చేసే హక్కు ఎక్కడ ఉంది? దేశంలో, రాష్ట్రంలో ప్రజాస్వామ్యం రోజు రోజుకీ అడుగంటిపో తోంది. ఊరేగింపులకు, సమావేశాలకు అనుమ తి ఇవ్వకపోవటం దేన్ని తెలియ జేస్తుంది?

ఆర్థిక అసమానతలను తగ్గించే విధంగా రాజ్యం తన విధానాలను నిర్దేశించుకోవాలని రాజ్యాంగం ఆదేశించింది. కానీ మన పాలకులు ఈ సూత్రాన్ని తిరగేసి పరిపాలి స్తున్నారు. ప్రత్యేకించి మోడీ పరిపాలనలో సంపదంతా కొద్ది మంది చేతుల్లో పోగుపడింది. లాక్‌డౌన్ కాలంలో కూడా శత కోటీశ్వరుల సంపద 35 శాతం పెరగ్గా, 84 శాతం ప్రజల ఆదాయాలు పడిపోయాయి. 2020 మార్చి నుండి 100 మంది శతకోటీశ్వరులకు పెరిగిన ఆదాయాన్ని దేశంలోని అతి పేదలయిన 13.8 కోట్ల మందికి ఒక్కొక్కరికి రూ.94,045 చొప్పున పంచవచ్చని ఆక్స్‌ఫామ్ నివేదిక పేర్కొంది. భూగోళంలో 4వ అత్యంత ధనికునిగా అంబానీ ప్రకటించబడ్డాడు. ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు 8 శాతం పన్ను తగ్గించింది. పెట్రోలు, డీజిల్, గ్యాసు పన్నులను పెంచి ప్రజలపై భారాన్ని మోపింది.

కరోనా జబ్బు ఉన్న కాలంలో ఒక గంటలో ముకేష్ అంబాని సంపాదించిన దాన్ని ఒక అసంఘటిత కార్మికుడు సంపాదించాలంటే 10 వేల సంవత్స రాలు పడుతుంది. అంబానీ ఒక సెకనులో సంపాదించిన దాన్ని సంపాదిం చాలంటే 3 సంవత్సరాలు పడుతుంది. కరోనా కాలంలో మొదటి 11 మంది శత కోటీశ్వర్లు సంపాదిం చిన ఆదాయం మీద ఒక శాతం పన్ను వేసినా ప్రజలకు చౌకధరల మీద మందులు అందించే పథకానికి చేసే కేటాయింపులను 140 రెట్లు పెంచవచ్చు.

భారత దేశాన్ని రాష్ట్రాల కలయికగా రాజ్యాంగం పేర్కొంది. దీనినే రాష్ట్రాల సమాఖ్యగా చెపుతాం. రాష్ట్రాల అధికారాలు మొత్తాన్ని తన గుప్పెట్లో పెట్టుకుం టోంది. రాష్ట్ర ప్రభుత్వాలను నామ మాత్రం చేసి తన చెప్పుచేతల్లోకి తీసుకునే ప్రయత్నం చేస్తోంది. రాజ్యాంగంపై జరిగే ఈ దాడి పైన కూడా ప్రాంతీయ పార్టీలు, వామపక్ష పార్టీలు, కాంగ్రెసు ఐక్యంగా పోరాడాలి.

రాజ్యాంగంలో ఉన్న లౌకికతత్వాన్ని తొలగించాలని కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి డిమాండ్ చేస్తోంది. లౌకికతత్వం అంటే మతాన్ని రాజకీయాల నుండి వేరు చేయడం. లౌకికతత్వం లేకుండా ప్రజలను ఐక్యంగా ఉంచలేం. తన రాజకీయ ప్రయోజనాల కోసం మెజార్టీ మతతత్వ భావాలను రెచ్చగొట్టి విభజించి పరిపాలిస్తున్న బిజెపికి లౌకికతత్వం అంటే గిట్టదు. మతాన్ని రాజకీయాలతో మిళితం చేయటమే దానికి కావాలి. తన కార్పొరేట్ అనుకూల విధానాలను ప్రజలు ఐక్యంగా ఎదుర్కోకుండా ఉండాలంటే భావోద్వేగాలను రెచ్చగొట్టటం దాని ప్రధాన లక్ష్యం. రాజ్యాంగం అంటే దానికి లెక్కలేదు.

కార్మికులు, కర్షకులు, సామాజిక తరగతులు, ఇతర శ్రామిక ప్రజలంతా రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి. దానిలో ఉన్న ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు అమలయేలా ఐక్యంగా పోరాడాలి. రాష్ట్రాల హక్కులను, లౌకికతత్వాన్ని పరిరక్షించుకోవాలి. జాతీయ జెండాకు ప్రాధాన్యత, గౌరవం ఇవ్వటం ఎంత ముఖ్యమో, రాజ్యాంగ నిబంధనలను అమలు చేసేలా చూసుకోవటం అంతే ముఖ్యమైనది. అపుడు మాత్రమే గణతంత్ర దినోత్సవానికి అర్థం, పరమార్థం ఉంటుంది. ❋

ఈ మాసం ప్రత్యేకం

# పుల్వామా దాడి గురించి ప్రభుత్వానికి ముందే తెలుసా

ఆనందో భక్తో

**2019** జనవరి 2, ఫిబ్రవరి 13 మధ్య జైష్-ఇ-మహమ్మదీ "కిసాస్ మిషన్"లో భాగంగా ఆత్మాహుతి దాడి జరగబోతున్నదని అంతర్గత భద్రతను కాపాడటానికి బాధ్యత వహించే వివిధ శాఖల అధికారులకు ఇంటెలిజెన్స్ అధికారులు సమాచారాన్ని అందించారని 'ఫ్రంట్‌లైన్' సంవత్సరం పాటు జరిపిన దర్యాప్తు వెల్లడించింది. ముదాసిర్ అహ్మద్ ఖాన్ నేతృత్వంలో తీవ్రవాద దాడి జరగనున్నదన్న సమాచారం కనీసం రెండుసార్లు తెలిసినప్పటికీ, ఫిబ్రవరి 14, 2019న పుల్వామా దాడి జరిగింది.

పుల్వామాలోని లెత్‌పోరాలోని సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ కాన్వాయ్‌పై 2019 ఫిబ్రవరి 14 న జరిగిన ఫిదాయీల దాడి 40 మంది ప్రాణాలు బలిగొన్నది. ఆ సంఘటన తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తింది. దీనికి ఇంటెలిజెన్స్ వైఫల్యమే కారణమని అనేకమంది అనుమానించడమే కాక, కాశ్మీర్ లోయలో కట్టుదిట్టమైన నిఘా ఉన్నప్పటికీ భారీ మొత్తంలో పేలుడు పదార్థాలను ఎలా సంపాదించారు, ఎలా నిల్వ, రవాణా చేశారనే ప్రశ్నలను సంధించారు.

ఫిబ్రవరి 14 సంఘటనకు సంబంధించి భద్రతా సిబ్బంది లేదా సంస్థలపై విధ్వంసం సృష్టించే పేలుడు పరికరాలతో (ఐఈడి) దాడి జరుగుతుందని దాడికి ముందు వారంలో కనీసం రెండు విడతల సమాచారం ఉన్నదని నివేదికలు వెల్లడించినప్పటికీ, దాడికి ఇంటెలిజెన్స్ వైఫల్యం కారణం కాదని ప్రభుత్వం తోసిపుచ్చింది. 2019 జూన్ 19న పుల్వామా ఉగ్రవాద దాడికి కారణం ఇంటెలిజెన్స్ వైఫల్యమేనా అని రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు హోం శాఖ సహాయమంత్రి జి. కిషన్ రెడ్డి "నో సర్" అనిరాతపూర్వకంగా సమాధాన మిచ్చారు. "అన్ని ఏజెన్సీలు సమన్వ యంతో పనిచేస్తున్నాయి. ఇంటెలిజెన్స్ సమాచారాన్ని వివిధ ఏజెన్సీలకు రియల్ టైమ్ ప్రాతిపదికన అందజేస్తారు" అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

జైష్-ఇ-మహమ్మద్ "కిసాస్ మిషన్"లో భాగమే ఫిదాయీల దాడి. రెండుసార్లు లభించిన సమాచారంలో పుల్వామాపై ముదాసిర్ అహ్మద్ ఖాన్ నేతృత్వంలోని తీవ్రవాదుల దాడికి సంబంధించిన సమాచారం ఉంది, 'కిసాస్ మిషన్' గురించి సరళంగా చెప్పాలంటే చొరబాట్లను ఆరికట్టేందుకు, తీవ్రవాదులందరినీ మట్టుబెట్టేందుకు ఉద్దేశించిన 'ఆపరేషన్ ఆల్ అవుట్' కు ప్రతిస్పందనగా జైష్ రూపొందించిన ప్రతీకార కార్యక్రమం ప్రభుత్వం 'ఆపరేషన్ ఆల్ అవుట్'ను 2017 నుండి కాశ్మీర్ లోయలో అమలు చేస్తున్నది.

**ఆకస్మిక దాడి గురించి ఫిబ్రవరి 13న హెచ్చరిక:**

జమ్మూ కాశ్మీర్ డైరెక్టర్ జనరల్, కాశ్మీర్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ఇతర అధికారులకు దాడి జరగడానికి 24 గంటల ముందు, 2019 ఫిబ్రవరి 13న నిఘా వర్గాలు సమాచారం అందించాయని ఫ్రంట్‌లైన్ పరిశోధనలు వెల్లడించాయి. ఫిబ్రవరి 13న అందిన సమాచారానికి ముందు అందిన ఆరు నిఘా వర్గాల సమాచార నివేదికలు కూడా ఫంట్‌లైన్ వద్ద ఉన్నాయి. అందులో పుల్వామా / అవంతిపోరాను అధిక ప్రమాదభరిత ప్రాంతంగా గుర్తించడమే కాక ఇది "కిసాస్" దాడి అమలు చేసే రంగం అని హెచ్చరించింది.

2019 ఫిబ్రవరి 13న అందిన సమాచారం భద్రతాదళాలను అప్రమత్తం చేయాలని సూచించింది. ఆకస్మిక దాడి హెచ్చరిక ఉన్నప్పటికీ 2,547 మంది సిబ్బందితో 78 వాహనాల అసాధారణమైన సుదీర్ఘ కాన్వాయ్, జమ్మూ నుండి ఫిబ్రవరి 14 తెల్లవారుజామున 3:30 గంటలకు రోడ్డుమార్గంలో బయలు దేరింది, పుల్వామా జిల్లాలోని అవంతిపోరా ప్రాంతంలో హైవేపై ఉన్న లదూరా క్రాసింగ్ గుండా వాహనాలు ప్రయాణించి మధ్యాహ్నం 3:30 గంటలకు కాన్వాయ్ శ్రీనగర్ చేరుకుంది,



రచయిత ప్రముఖ పాత్రికేయులు

జమ్మూ కాశ్మీర్ రక్షణ విభాగంలోని అగ్రశ్రేణి అధికారులు ఇటువంటి పరిస్థితిపై మాట్లాడుతూ 2019 జనవరి చివరి వారంలో అందిన సమాచారం "దాడికి ఆవకాశం ఉందని" తెలిపిందని, అయితే "దాడి నుండి బయట పడ్డామని" ప్రస్తావించారు. ముదాసిర్ అహ్మద్ ఖాన్ నేతృత్వంలోని జైష్-ఇ- మొహమ్మద్ జనవరి 24, 25 తేదీలలో తీవ్రవాద దాడికి పాల్పడుతుందని సమాచారం ఉందని, దాన్ని అడ్డుకున్నామని చెప్పారు.

ముదాసిర్ అహ్మద్ ఖాన్ ఈ దాడికి ప్రధాన కుట్రదారుడని దర్యాప్తులో వెల్లడైంది. మూడు దశాబ్దాలలో కాశ్మీర్‌లో జరిగిన అత్యంత తీవ్రమైన ఉగ్రవాద దాడి ఇది. మార్చి 11, 2019 న ట్రాల్ పింగ్లిష్ ప్రాంతంలో ముదాసిర్ ఖాన్ రక్షక దళాల చేతిలో హతమయ్యాడు.

**ఏజెన్సీల రాడార్‌లో 'పుల్వామా కుట్రదారు' :**

"జైష్-ఇ-మహమ్మద్‌కు చెందిన ముదాసిర్ ఖాన్ ఫిదాయీ దళాల అవంతిపోరా బృందం ఫిదాయీ దాడికి సిద్ధమవుతున్నట్లు నివేదించినట్లు జనవరి 24న అందిన నివేదికలు తెలియజేస్తున్నాయి. పుల్వామా రాజ్‌పోరా లోని జైష్-ఇ- మహమ్మద్‌కు చెందిన షాహిద్ బాబా గ్రూపుతో సంబంధాలు కలిగి ఉన్నది. విశేషమేమిటంటే, జనవరి 25 లభించిన సమాచారంలో ముదాసిర్ అహ్మద్ ఖాన్ ఆచూకీ ఉంది. ముదాసిర్ ఖాన్‌తో పాటు నలుగురు విదేశీ కిరాయి హంతకులు "మిదూరా, లామ్ ట్రాల్ గ్రామాలలో ఉన్నట్లు గుర్తించినట్లు" అందులో ప్రత్యేకంగా పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఈ బృందం దాడికి ప్రణాళికను సిద్ధం చేస్తున్నదని, అందుకు అవంతిపోరా లేదా రాంపూర్‌ను ఎంచుకునే అవకాశం ఉన్నదని ఆ సమాచారం స్పష్టం చేసింది.

ఇంటెలిజెన్స్‌కు నిర్దిష్ట సమాచారం ఉండి

“ ఒకటి: ముదాసిర్ ఖాన్ నేతృత్వంలోని జైష్-ఇ-మహమ్మద్ 2019 జనవరి 24 నాటికి పుల్వామా దాడికి సన్నద్ధమైనట్లు సమాచారం ఉంది. రెండు: 2019 జనవరి 25 నాటికి ముదాసిర్ ఖాన్ ఉన్న ప్రదేశం గురించి సమాచారం ఉంది. మూడు: ఈ నిర్దిష్ట సమాచారం ఆధారంగా ముదాసిర్ ఖాన్‌ను పట్టుకోవటానికి లేదా నిర్మూలించడానికి, అతని కుట్రను విఫలం చేయడానికి కనీసం మూడు వారాల సమయం ఉంది. ”



పుల్వామా ఉగ్రవాద దాడిలో జరిగిన విధ్వంసం

తీవ్రవాదుల ఆచూకీ, వారికి సంబంధించిన వివరాలు, ఇతర గుర్తింపు ఉండే అది “చర్య తీసుకునేందుకు అవసరమైన సమాచారం”గా పరిగణిస్తారని ఇన్స్టిట్యూట్ ఫర్ కాన్ఫ్లిక్ట్ మేనేజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అజయ్ సాహ్ని చెప్పారు.

ఫ్రంట్‌లైన్ వద్ద ఉన్న పత్రాలు మూడు విషయాలను నిర్ధారించాయి. ఒకటి: ముదాసిర్ ఖాన్ నేతృత్వంలోని జైష్-ఇ-మహమ్మద్ 2019 జనవరి 24 నాటికి పుల్వామా దాడికి సన్నద్ధమైనట్లు సమాచారం ఉంది. రెండు: 2019 జనవరి 25 నాటికి ముదాసిర్ ఖాన్ ఉన్న ప్రదేశం గురించి సమాచారం ఉంది. మూడు: ఈ నిర్దిష్ట సమాచారం ఆధారంగా ముదాసిర్ ఖాన్‌ను పట్టుకోవటానికి లేదా నిర్మూలించడానికి, అతని కుట్రను విఫలం చేయడానికి కనీసం మూడు వారాల సమయం ఉంది.

**కిసాస్ దాడి సమాచారం విస్మరించారా?**

గుర్తుంచుకోవలసిన విషయం ఏమిటంటే, జనవరి 24, 25 తేదీల సమాచారం “కిసాస్ మిషన్” గురించి హెచ్చరించటం మాత్రమే కాదు. పుల్వామాలోని రాజ్‌పోరాలో నలుగురు ఉగ్రవాదుల హత్యలకు ప్రతీకారం తీర్చుకునేందుకు దక్షిణ కాశ్మీర్‌లోని జెఎమ్ “కిసాస్ మిషన్” గురించి 2019 జనవరి 2 న ఇంటెలిజెన్స్ సమాచారం భద్రతా సంస్థలను అప్రమత్తం చేసింది. జమ్మూ కాశ్మీర్ డిజిపి కాశ్మీర్ ఇన్స్‌పెక్టర్ జనరల్ జరిపిన చర్చలు “కిసాస్” ముప్పు తీవ్రతను నొక్కి చెప్పాయి. పుల్వామాలోని హాజిన్ పేయెన్‌లోని స్పెషల్ పోలీస్ ఆఫీసర్ సమీర్ అహ్మద్ మీర్‌ను జనవరి 1, 2019 న “కిసాస్ మిషన్” హత్య చేసినట్లు ఇది నొక్కి చెప్పింది.

2019 జనవరి 3 దాడి నివేదిక రాబోయే ప్రమాదాన్ని వివరంగా తెలియజే సింది. “కిసాస్ మిషన్ 2018” సమాచారం ప్రాణాంతక దాడుల ప్రమాదం గురించి ఎత్తి చూపింది. న్యూ పుల్వామాలోని సిఆర్‌పిఎఫ్ శిబిరం 183 బెటాలియన్ పై దాడి, సైన్యానికి ఇన్ఫార్మర్‌గా పనిచేస్తున్న సోపోర్‌కు చెందిన గులాం రసూల్ మీర్ కుమారుడు ముస్తాక్ అహ్మద్ మీర్‌ను జైష్-ఇ-మహమ్మద్‌కు చెందినవారు ఎత్తుకువెళ్లి చంపిన విషయాన్ని గురించి కూడా ‘పేర్కొంది.

**ఐఈడి తయారీకి స్థానికులకు విదేశీ ఉగ్రవాది శిక్షణ**

2019 జనవరి 7 న దక్షిణ కాశ్మీర్‌లో ఐఈడిలను తయారు చేయడంలో వినియోగించడానికి స్థానిక యువతకు విదేశీ కిరాయి హంతకుని ద్వారా శిక్షణ ఇస్తున్నటు సమాచారం ఉన్నది.. “ముగ్గురు ఉగ్రవాదుల బృందంలో ఒకరు షోపియన్ జిల్లాలో ఉన్న విదేశీయుడని భావిస్తున్నారు, స్థానిక యువతకు పేలుడు పరికరాల నిర్వహణలో శిక్షణ ఇస్తున్నారు. ఐఈడిల తయారీలో బలగాలపై చేతి బాంబులను విసరడంలో యువతకు అవగాహన ఉందని ఈ నివేదికలు సూచిస్తున్నాయి.

పుల్వామాలోని అవంతిపోరా ప్రాంతంలో కొంతమంది విదేశీ కిరాయి సైనికులతో పాటు 20 మంది స్థానిక ఉగ్రవాదులు ఉన్నట్లు నివేదికలలో పేర్కొన్నారని” చెప్పింది.

**పొరుగింటి తీవ్రవాదం**

జైష్ ఆధ్వర్యంలో పార్లమెంటుపై దాడి చేసిన కేసులో దోషిగా ఉండి, ఫిబ్రవరి 2013 లో ఉరితీసిన అఫ్జల్ గురు బృందం ఈ ‘కిసాస్ మిషన్’ అనే పదాన్ని తొలుత ఉపయోగించింది. 2018 మధ్య నుండి ‘ఆపరేషన్ ఆల్ అవుట్’ కాశ్మీర్ అంతటా తీవ్రం కావటం, ఉగ్రవాద బృందాలకు తీవ్రమైన నష్టం వాటిల్లడంతో ‘కిసాస్’ దాడులను ప్రారంభించాలని జైష్ సంకల్పించింది.

2019 జనవరి 21న ఉగ్రవాద మూకల సమన్వయ కార్యకలాపాలతో పాటు రాబోయే ‘కిసాస్’ దాడికి మరింత తీవ్రత తోడవుతుందని ఆ సమాచారం తెలియజేసింది. జనవరి 21, 2019, మసూద్ అజార్ మేనల్లుడు తల్హా రషీద్ హత్యకు ప్రతీకారం తీర్చుకోవడానికి జైష్ దాడి చేయాలని యోచిస్తున్నట్లు అందిన సమాచారం పునరుద్ఘాటించింది.

**ముదాసిర్ ఖాన్ చేతిలో ఆదిల్ ఆయుధమా?**

నిరంతర బెదిరింపులు ఉన్నప్పటికీ, జనవరి 24, 25 తేదీల సమాచారంపై జైష్ కమాండర్ ముదాసిర్ ఖాన్ విషయంలో సరిగ్గా వ్యవహరించలేదు లేదా కనీసం అవసరమైన చర్య తీసుకోలేదు. ఈ సమాచారం తెలిసే సమయంలో, ముదాసిర్ ఖాన్ దక్షిణ కాశ్మీర్లో అందరికీ తెలిసిన ఉగ్రవాది. 2017 లెత్‌పోరా దాడికి సంబంధించి సిఆర్‌పిఎఫ్ శిబిరంపై జరిగిన దాడిలో ఐదుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయిన సంఘటనతో అతనికి సంబంధాలున్నాయి. అతను ఈ ప్రాంతంలోని ప్రధాన జైష్ సమూహానికి నాయకత్వం వహించడమే

కాకుండా, ఉగ్రవాది షాహిద్ బాబా నేతృత్వం లోని జైష్ అనుబంధ సమూహం కూడా అతని కనుసన్నల్లో పనిచేసింది. ఫిబ్రవరి 1 న షాహిద్ బాబా హతమైన తరువాత ముదాసిర్ ఖాన్ ఆ గ్రూపుకు నాయకత్వం వహించాడు. ఫిబ్రవరి 14 దాడి నిర్వహించిన 19 ఏళ్ల స్థానిక ఆత్మాహుతి దళ సభ్యుడు ఆదిల్ అహ్మద్ దార్ షాహిద్ బాబా గ్రూపుకు అనుబంధంగా ఉన్నాడు. బాబా నిర్మూలన తరువాత, ముదాసిర్ ఖాన్ ఆదేశాలను పాటించాడు.

ముదాసిర్ ఖాన్ స్థానికుడైనందున జనవరి 24, 25 తేదీల సమాచారం ద్వారా అతనితో సంబంధం ఉన్నవారిని గుర్తించడం, వారి ద్వారా అతను దాక్కునే ప్రదేశాలు తెలుసుకున్నామని ఆ వర్గాలు తెలిపాయి. ముదాసిర్ ఖాన్‌ను చూయించమని కుటుంబ సభ్యులను బలవంతం చేయడం, సాధారణ పోలీసింగ్‌కు మించిన పద్ధతులను కూడా ఉపయోగించామని పేర్కొన్నారు. ఈ అంశాలపై వివరణ కోసం ఈ రిపోర్టర్ అప్పటి కాశ్మీర్ ఐజిపి, జిల్లా ఎస్.పి.కి ఫోన్ చేశాడు, కాని వారు సమాధానం ఇవ్వలేదు

2019 ఫిబ్రవరిలో రాబోయే 'కిసాస్' దాడి గురించి మరింత సమాచారం సేకరిం చారు. పుల్వామా దాడి జరిగిన వెంటనే మీడి యాలో నివేదించినట్లుగా, అఫ్జల్ గురు ఉరికి ప్రతిగా జైష్ దాడి చేయనున్నట్లు హెచ్చరిస్తూ 2019 ఫిబ్రవరి 9న ముఖ్యమైన సమాచారం ఉంది, ఈ సమాచారం గురించి ఎడిజి సిఆర్‌పిఎఫ్, జమ్మూకాశ్మీర్ జోన్‌తో పాటు ఇతరులు చర్చించారు.

**ట్విట్టర్ ద్వారా ఐఈడి పేలుడు సూచన**

2019 ఫిబ్రవరి 12న "అత్యంత గోప్యమైనది, చాలా అత్యవసరం" అని గుర్తించిన సమాచారం ట్విట్టర్ హ్యాండిల్ 313 ఏ, 313 గురించి సమాచారాన్ని అందించింది. ట్విట్టర్ సమాచారం పంపే వ్యక్తి 2019 జనవరి నుంచి ట్విట్టర్‌లో చురుకుగా ఉన్నాడు. ఆ ట్విట్టర్ హ్యాండిల్ పాకిస్తాన్‌లోని జైష్ హ్యాండ్లర్లతో పనిచేస్తూ "కిసాస్ మిషన్" గురించి హెచ్చరించింది.

ఆ సమాచారం ఇలా పేర్కొంది: "హ్యాండిల్‌ను రోజూ పర్యవేక్షించారు. 12.02.2019న జమ్మూ కాశ్మీర్లో భద్రతా దళాలు ఉపయోగిస్తున్న మార్గాల్లో ఐఈడి పేలుళ్లను నిర్వహించడానికి హ్యాండిల్ ఐఈడి పేలుడు వీడియోను ప్రదర్శించింది. ఈ విషయంపై 12.02.2019 నాటి ప్లాట్‌ఫారమ్ ఎంఎసి/ఎస్ఎంఎసి ప్లాట్‌ఫాం

**" ఈ సమాచారం ప్రభుత్వానికి తెలుసా, తెలియదా? పుల్వామా దాడికి ఒక రోజు ముందు, 2019 ఫిబ్రవరి 13 న జమ్మూ కాశ్మీర్ పోలీసుల పునర్వ్యవస్థీకరణ జరిగింది, ఇది అవంతిపోరా ఎస్‌పి మహ్మద్ జైద్ బదిలీకి దారితీసింది, ఆయన తీవ్రవాదులను గురించి అందుతున్న సమాచారం ఆధారంగా పని చేయడంలో కీలక పాత్ర పోషించారు. ఉగ్రవాద ముప్పు తీవ్రమౌతున్న సమయంలో పునర్వ్యవస్థీకరణతో ముందుకు సాగడం వివేకవంతమైన పనేనా? "**



టెర్రరిస్టు దాడి తర్వాత పుల్వామాలో కొనసాగుతున్న సైనిక పహరా

వైడ్ ఇన్‌పుట్ నంబర్ 334808లో 19:27:41 గంటలకు సమాచారం పెట్టారు. మల్టీ-ఏజెన్సీ-సెంటర్ (ఎంఎసి)ఒక ఇంటెలిజెన్స్ బ్యూరో వేదిక. ఇది ఇంటెలిజెన్స్ నివేదికలను అందజేస్తూ, అనేక ఏజెన్సీల ప్రతినిధుల మధ్య సమన్వయాన్ని సులభతరం చేయడానికి ఇరవైనాలుగు గంటలూ పనిచేసే సంస్థ.

2019 ఫిబ్రవరి 13న, "జమ్మూ కాశ్మీర్ అంతటా భద్రతా దళాల మార్గాల్లో ఐఈడి దాడులు" గురించి తుది హెచ్చరిక చేసింది.

**సమాధానం లేని ప్రశ్నలు**

2019 జనవరి 2, ఫిబ్రవరి 13 మధ్య అందిన సమాచారాన్ని పరిశీలిస్తే అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఫిబ్రవరి 14 సంఘటన సూత్రధారి అయిన ముదాసిర్ ఖాన్ దాడి జరిగిన మూడు వారాల్లోనే దొరికి పోయాడు. అతని సహ-సూత్రధారి అబ్దుల్ రషీద్ ఘాజీని 100 గంటలలోపు హతం చేసినపుడు ముదాసిర్‌ను ఎందుకు అంతం చేయలేక పోయారు? జమ్మూ కాశ్మీర్‌లోని రక్షణ విభాగానికి రాబోయే ఉగ్రవాదదాడి గురించి తెలిసినా, రెండు అణ్వాయుధ దేశాలైన భారతదేశం, పాకిస్థాన్‌లను యుద్ధం అంచుకు నెట్టడం, జరగనున్న సాధారణ ఎన్నికలలో పాలకపార్టీకి మార్గం సుగమం చేయటం వంటివి ఉన్నాయా? ఇంటెలిజెన్స్ బ్యూరో నేతృత్వంలోని ఎంఎసి ప్లాట్‌ఫారమ్‌లో 'కిసాస్ మిషన్' సమాచారంపై కూడా చర్చించి నందున జైష్ కుట్రను అరికట్టడానికి ఇంటెలి జన్స్ బ్యూరో ప్రతి చర్య, వ్యూహం ఏమిటి? ఈ సమాచారం ప్రభుత్వానికి తెలుసా, తెలియదా? పుల్వామా దాడికి ఒక రోజు ముందు, 2019 ఫిబ్రవరి 13 న జమ్మూ కాశ్మీర్ పోలీసుల పునర్వ్యవస్థీకరణ జరిగింది, ఇది అవంతిపోరా ఎస్‌పి మహ్మద్ జైద్ బదిలీకి దారితీసింది, ఆయన తీవ్రవాదులను గురించి అందుతున్న సమాచారం ఆధారంగా పని చేయడంలో కీలక పాత్ర పోషించారు. ఉగ్రవాద ముప్పు తీవ్ర మౌతున్న సమయంలో పునర్వ్యవస్థీకరణతో ముందుకు సాగడం వివేకవంతమైన పనేనా? ముఖ్యంగా రెండు సందర్భాలలో చర్యలు తీసుకోవటానికి తగిన సమాచారం లభించి నపుడు, పుల్వామా దాడికి కారణమైన కిసాస్ మిషన్ పథకం గురించి తెలిసినపుడు తగిన చర్యలు ఎందుకు తీసుకోలేదు? నిఘా వర్గాలు అందించిన సమాచారాన్ని విశ్లేషిం చటంలో జరిగిన వైఫల్యానికి, ఎవరు బాధ్యత వహి స్తారు?

**(అనువాదం: జి ఆంజనేయులు)**

అధ్యయనం

# భారతదేశ సంపదను కొల్లగొట్టిన బ్రిటన్



రచయితలు ప్రముఖ ఆర్థిక వేత్తలు

**ప్రభాత్ పట్నాయక్, ఉత్సా పట్నాయక్**

పశ్చిమ యూరోపియన్ దేశాలు తమ వలసల నుండి కొల్లగొట్టిన అదనపు ధనంతో 18వ శతాబ్దం తర్వాత తమ దేశాలలో పారిశ్రామిక విధానాన్ని నిర్మించుకోవటంతో పాటు దానిని తమ వలసలకు కూడా విస్తరింప జేశాయి. ఆ విధమైన తరలింపును, దాని పరిణామాలను, తరలించిన విధానాలను గురించి ఆర్థికాంశాలకు సంబంధించిన రచనలలో చాలా తక్కువగా చర్చించారు. దీనిని గురించి చాలా అధ్యయనం జరగవలసి ఉన్నది. భారతదేశానికి సంబంధించి సంపదను కొల్ల గొట్టుకెళ్ళటంపై ఇద్దరు ప్రసిద్ధ ఆర్థికవేత్తలు దాదాభాయ్ నౌరోజి, ఆర్‌సి దత్‌లు విలువైన చర్చ చేశారు. భారతదేశం నుండి సంపదను తరలించుకెళ్ళిన అంశానికి సంబంధించిన చర్చకు మాత్రమే మనం పరిమితమౌదాం.

కొదిపాటి మినహాయింపులతో 18. 19 శతాబ్దాలలో జరిగిన పారిశ్రామికాభివృద్ధిని గురించిన రచనలలో వలసల నుండి తరలించుకువచ్చిన సంవదను గురించి విస్మరించారు. పెట్టుబడిదారీ విధానం ప్రధానంగా అంతర్గత వనరులతోనే అభివృద్ధి అయిందని చెప్పారు. కొందరైతే వాటికి వలసలు భారంగా పరిణమించాయని కూడా చెప్పారు.

భారతదేశానికి సంబంధించి సంపదను కొల్లగొట్టుకెళ్ళటంలో భాగంగా దేశంలో వసూలు చేసిన పన్నులలో మూడింట ఒకవంతు ఇక్కడ ఖర్చుపెట్టలేదు. ఆ డబ్బుతో సరుకులు కొని వాటిని ప్రపంచదేశాలకు ఎగుమతి చేసి, బంగారం, విదేశీ మారకాన్ని పొందటానికి వినియోగించారు. అంతర్జాతీయంగా కొనుగోలు శక్తికి ప్రాతినిధ్యం వహించే ఈ నిల్వలు మనదేశంలో ఉండటానికి అనుమతించలేదు. అందుకు బదులుగా అధికారంలో ఉన్నవారు తమ దేశప్రయోజనాల కోసం వాటిని వినియోగించుకున్నారు. ఉష్ణదేశాల వలసల నుండి పొందిన బంగారం, విదేశీ మారకం 19వ శతాబ్దం చివరి 25 సంవత్సరాలలో భారీగా పెరిగి, వలసలకు ఆధిపత్యం వహిస్తున్న దేశాలలో పెట్టుబడిదారీ విధానం త్వరగా విస్తరించటానికి తోడ్పడింది. తమ వలసల ద్వారా వస్తున్న పెట్టుబడులను భారీగా ఎగుమతి చేయటంతో యూరప్ దేశాలు, వాటి వలసలు త్వరగా పారిశ్రామికంగా అభివృద్ధి అయ్యాయి. దీనికి రెండోవైపున వలస దేశాల లోని ప్రజలకు లభించే తలసరి ఆహార ధాన్యాలు తగ్గిపోయి, వారు దరిద్రులుగా మారారు.

ఈ విధంగా సంపదను కొల్లగొట్టటం అనేక విధాలుగా జరిగింది. కౌలు, పన్నుల రూపంలో ఉత్పత్తిదారుల నుండి ఆర్థిక మిగులును దోపిడి చేశారు. భారతదేశంలో పన్నులను డబ్బు రూపంలో వసూలు చేయటం ప్రధానంగా ఉండేది. చాలాకాలం పన్ను ఆదాయంలో భూమిశిస్తు ప్రధానంగా ఉంది. స్వతంత్ర వ్యవసాయ ఉత్పత్తిదారులు ప్రత్యక్షంగానే ప్రభుత్వానికి పన్ను చెల్లించేవారు. కౌలురైతులుగా ఉన్నవారు తమ ఉత్పత్తిలోని మిగులును ప్రభుత్వం భూస్వామిగా నియమించిన వ్యక్తికి చెల్లిస్తే ఆయన ప్రభుత్వానికి పన్ను చెల్లించేవాడు. నల్లమందు, ఉప్పుపై ప్రభుత్వ గుత్తాధిపత్యం వలన ఆ భారం కూడా రైతులు, కార్మికులపై పడేది. వీటిద్వారా ప్రభుత్వం అదనపు ఆదాయం పొందేది. కాని పన్నులు వేయటం దానికదే సంపదను కొల్లగొట్టు కెళ్ళటానికి దారితీయలేదు. నౌరోజి, దత్ చెప్పిన రెండవ అంశమైన "విదేశీకోణం", వసూలైన పన్నులలో గణనీయమైన భాగాన్ని ఇతర దేశాలలో ఖర్చు పెట్టటం కోసమని బడ్జెట్‌లో కేటాయించేవారు. అంటే దేశంలో క్రమ పద్ధతిలో ఖర్చుచేసేవారు కాదు. ఎగుమతుల కోసం ఉత్పత్తి చేసిన వారికి తిరిగి చెల్లించటం పేరుతో ఆ మొత్తాన్ని లండన్‌లో ఉంచేవారు. జమాఖర్చులలో రక రకాల కుతంత్రాలకు పాల్పడటం ద్వారా ఎగుమతుల వలన సంపాదించిన ఈ స్టెర్లింగ్ మిగులును ప్రభుత్వం తన చిత్తం వచ్చినట్లుగా ఉపయోగించుకొనేది.

ఉత్పత్తిదారుల సరుకులకు వారు కట్టిన పన్నుల నుండి చెల్లించటం, అంతర్జాతీయంగా ఎగుమతులకు వచ్చిన అదనపు మొత్తాన్ని దేశ వనరులకు జమచేయక పోవటం సార్వభౌమత్వం కలిగిన ఏ దేశంలోనూ జరగలేదు. ఇది వలస విధానానికి ప్రత్యేకమైనది. ఎగుమతి సరుకులను ఉత్పత్తిచేసిన వారందరికీ చెల్లింపులు చేసేవారు. ఇందులో ఒక భాగాన్ని దిగుమతి చేసుకున్న సరుకులు, ప్రధానంగా బ్రిటిష్ వస్త్ర ఉత్పత్తిదారులు చేసిన ఉత్పత్తుల ద్వారా చెల్లించేవారు. వలస ఆర్థికవ్యవస్థలో వాణిజ్య సరళీకరణ ద్వారా ఈ దిగుమతులు చేసేవారు. స్థానికంగా ఉన్న పత్తిని వడికేవారు, బట్టలు నేసేవారికి పనిపోగొట్టటం, ఇక్కడి నుండి ఉత్పత్తి అయిన సరుకులు తమ దేశంలోకి రాకుండా ఒక శతాబ్దం పాటు రక్షణాత్మక విధానాలను అనుసరించారు. ఈ విధంగా చేసుకున్న దిగుమతులకు మినహాయించుకున్న తర్వాత, ఇక్కడ వసూలు చేసిన పన్నుల నుండే ఉత్పత్తిదారులకు చెల్లించేవారు ఆ పన్నులలో అత్యధిక భాగాన్ని భూమిశిస్తు, కౌలు, ఇతర పరోక్ష పన్నులు, ముఖ్యంగా ఉప్పుపై గుత్తాధిపత్యం ద్వారా వారినుండే వసూలు చేసేవారు. ఈ విధంగా ఉత్పత్తిదారులకు చెల్లిస్తున్నట్లు కన్పించినా, వారిపైనే పన్నులు వేయటం ద్వారానే వసూలు చేసి, చెల్లింపులు చేసేవారు.

అంటే దేశంలోని ఉత్పత్తిదారుల నుండి ఉచితంగానే సరుకులను సేకరించేవారు. ఉత్పత్తిదారుడు ప్రభుత్వానికి 100 రూపాయలు పన్నుల రూపంలో కట్టాడు. తన వద్దఉన్న బియ్యం, బట్టలను 50 రూపాయలకు అమ్ము

“ కాని స్థానికంగా వసూలు చేసిన పన్నులను ఉపయోగించి, ఎగుమతి చేసే సరుకులను ఉచితంగా పొందటం ప్రారంభమైన 1765 సంవత్సరం తర్వాత జరిగిన దోపిడీతో దీనికి పోలిక లేదు. మూడు కోట్లమంది బెంగాల్ ప్రజలు బ్రిటన్ జనాభా కన్నా నాలుగురెట్లు ఎక్కువ. కాని దురాశతో కంపెనీ తర్వాతి ఐదు సంవత్సరాలలో పన్నుల వసూలు ను మూడురెట్లు పెంచటంతో 1770లో సంభవించిన తీవ్రమైన కరువుతో ప్రజానీకంలో మూడోవంతు మంది చనిపోయారు. ”

కున్నాడు. ఉత్పత్తిదారుడు అమ్ముకున్న సరుకుకు చెల్లించిన 50 రూపాయలను అతను కట్టిన పన్నునుండే చెల్లించారు. అయితే ఈ రెండూ ఒకేసారి జరగవు కనుక పన్ను చెల్లింపుకు, సరుకు అమ్మకానికి సంబంధం లేనట్లు కనిపిస్తుంది. కాబట్టి తను చెల్లించిన పన్నునుండే తన ఉత్పత్తులకు చెల్లిస్తున్నారన్న విషయాన్ని ఉత్పత్తి దారులు గమనించలేరు. ఆ సరుకులు ఇంగ్లండ్‌కు వెళ్ళిన తర్వాత బియ్యాన్ని ఇంగ్లండ్‌లో వినియోగించుకొని, బట్టలను తిరిగి ఇతర దేశాలకు ఎగుమతి చేస్తారు. (ఆసియా దేశాల నుండి దిగుమతి అయిన బట్టలను వినియోగించటంపై 1700 సంవత్సరం నుండి ఇంగ్లండ్‌లో నిషేధం ఉంది).

పన్నులు చెల్లించేవారిలో ప్రధానభాగం రైతులు, చేతివృత్తిదారులే కాబట్టి వారి ఉత్పత్తులకు వాస్తవంగా డబ్బు చెల్లించటం లేదని ఇది స్పష్టం చేస్తున్నది. జరిగింది ఏమిటంటే వారు పన్నురూపంలో చెల్లించిన డబ్బు ఎగుమతి సరుకుల రూపంలోకి మారిపోయింది. ఈ విధంగా వాణిజ్య విధానంతో ద్రవ్య విధానం ప్రత్యక్షంగా ముడిపడి ఉండటమే వలసదేశాల సంపద తరలిపోవటానికి కారణం. ఉత్పత్తి దారులు బానిసలు కాదు. కాని పన్ను చెల్లించే రైతులు, చేతివృత్తిదారులుగా ఉన్నారు.

**బెంగాల్‌లో బ్రిటన్ దోపిడి**

ఈస్టిండియా కంపెనీ 1765లో బెంగాల్‌లో పన్నులు వసూలు చేసుకొనే అధికారాన్ని పొందింది. ఆ రోజు నుండే బెంగాల్ నుండి సంపదను దోచుకెళ్ళటం ప్రారంభమైంది. ఉత్పత్తి దారులకు తక్కువ చెల్లించి సరుకులను బలవంతంగా తీసుకెళ్ళటం అంతకుముందు నుండే ఉంది. కాని స్థానికంగా వసూలు చేసిన పన్నులను ఉపయోగించి, ఎగుమతి చేసే సరుకులను ఉచితంగా పొందటం ప్రారంభమైన 1765 సంవత్సరం తర్వాత జరిగిన దోపిడీతో దీనికి పోలిక లేదు. మూడు కోట్లమంది బెంగాల్ ప్రజలు బ్రిటన్ జనాభా కన్నా నాలుగురెట్లు ఎక్కువ. కాని దురాశతో కంపెనీ తర్వాతి ఐదు సంవత్సరాలలో పన్నుల వసూలును మూడురెట్లు పెంచటంతో 1770లో సంభవించిన తీవ్రమైన కరువుతో ప్రజానీకంలో మూడోవంతు మంది చనిపోయారు. 1792 నాటికి గాని పూర్తిగా కోలుకోవటం జరగలేదు. కాని భూమిపై శాశ్వత హక్కు(పర్మినెంట్ సెటిల్‌మెంట్)నిస్తూ నిర్ణయించిన పన్నురేట్ల ద్వారా బ్రిటన్‌లోని భూములపై విధించిన పన్నుద్వారా వచ్చిన ఆదాయం కన్నా ఎక్కువ ఆదాయం వచ్చింది. తర్వాతి ఎనిమిది సంవత్సరాలలో భూమిశిస్తును మూడురెట్లు పెంచటం ద్వారా బెంగాల్‌ను తన ఆర్థిక పునాదిగా చేసుకొని, బాంబే,దక్కన్, మద్రాస్, పంజాబ్, అవధ్ లాంటి భారతదేశంలోని వివిధ ప్రాంతాలపై ఆధిపత్యం సాధించింది. కంపెని బర్మాతో మూడు యుద్ధాలు చేసింది. ఆ దేశంలోని సారవంతమైన దిగువభాగాన్ని 1856 నాటికి స్వాధీనం చేసుకొని, 1885 నాటికి దేశం మొత్తాన్ని ఆక్రమించుకొంది. తక్షణమే భూమిశిస్తు వసూలు విధానాన్ని అమలులోకి తీసుకువచ్చింది. పన్నులను వసూలు చేసే బ్రిటిష్ అధికారిని కలెక్టర్ అంటారు. పన్నుల వసూలు ద్వారా కొనుగోలు చేసిన, ఏ మాత్రం ధరల భారం లేని బట్టలు, బియ్యం, ఉప్పు, నీలిమందు, ముడిపత్తి జనపనార తదితరాల ప్రవాహం స్థిరంగా బ్రిటన్‌లోకి రావటం పెరిగింది. ఈ సరుకులు ఆ దేశప్రజల అవసరాలకు మించి అదనంగా వస్తున్నాయి. తమ అవసరాలకు సరిపోగా మిగిలిన సరుకులను ఇతర దేశాలకు ఎగుమతి చేశారు.

భారత్‌తో బ్రిటన్‌కు ఏర్పడిన వాణిజ్య లోటు స్వతంత్రదేశాలైన ఫ్రాన్స్‌లాంటి దేశాలతో చేస్తున్న వాణిజ్యంలో ఏర్పడిన లోటులాగా ఎలాంటి విదేశీ చెల్లింపుల సమస్యకు దారితీయ లేదు. సంపదను ఏ విధంగా కొల్లగొడుతున్నా రనేది దీనిలోనే ఉంది. ఫ్రాన్స్‌తో తనకు ఏర్పడిన వాణిజ్యలోటును డబ్బు చెల్లించటం, రుణాల ద్వారా లేదా ఈ రెండింటినీ కలపటం ద్వారా బ్రిటన్ తీర్చింది. అన్ని స్వతంత్రదేశాలతోనూ, 1765 వరకు భారతదేశంతోనూ జరిపిన వాణిజ్యంలో బ్రిటన్ ఈ విధంగానే రుణాలను తీర్చింది. స్థానికంగా పన్నులు వసూలు చేయటం ప్రారంభమైన తర్వాత ఈ పరిస్థితి మారింది. అప్పటి నుండి బ్రిటన్ భారత్ నుండి చేసుకొంటున్న బియ్యం, బట్టల దిగుమతికి ఏ మాత్రం చెల్లించాల్సిన అవసరం లేకుండా పోయింది. తాము కడుతున్న పన్నుల ద్వారా ఆ సరుకులకు భారతీయ ఉత్పత్తి దారులు అప్పటికే చెల్లించివేశారు. కాబట్టి ఆ సరుకుల కోసం బ్రిటన్ ఏమీ చెల్లించలేదు. తాము తీసుకు పోతున్న సరుకులకు సమానంగా పన్నులను అదనంగా వసూలు చేయటం ద్వారా సరుకులను ఉచితంగా తరలించుకుపోయే విధానం సంపదను కొల్లగొట్టుకుపోవటంతో సమానమైనది. ఏ మాత్రం ఖర్చులేకుండా సరుకులను పొందటం కంపెని తన లాభాలను ఆకాశానికంటే విధంగా పెంచుకోవటానికి మాత్రమే కాక మొత్తంగా బ్రిటన్‌కు లాభం కలిగించింది. ఉష్ణదేశాల నుండి ఏ మాత్రం డబ్బు చెల్లించకుండా వస్తున్న మిగులు దిగుమతులను ఇతర దేశాలకు తిరిగి ఎగుమతి చేయటం ద్వారా ఫ్రాన్స్‌లాంటి దేశాల నుండి సరుకులను దిగుమతి చేసుకొని, ఆ దేశాలతో తనకున్న వాణిజ్యలోటును తగ్గించుకొంది.

**పెరిగిన ఇంగ్లండ్ సంపద**

స్థానికంగా సమకూరే పన్నులతోనే ఇక్కడ సరుకులను సేకరించటంతో భారతదేశంతో ప్రతికూల వాణిజ్యలోటు తమ వనరులకు అదనపు జోడింపు అని బ్రిటిష్ వారు గుర్తించారు. 1790లో బ్రిటన్ ఎగుమతి, దిగుమతుల నివేదికలో ఈ విధంగా పేర్కొన్నా రు. “తూర్పు ఇండియాతో జరుగుతున్న ఎగుమతి, దిగుమతుల వాణిజ్యంలో లోటు మనకు వ్యతిరేకంగా ఉన్నది. కాని కంపెనీ ఆ ప్రాంతంలో వసూలు చేస్తున్న పన్నులు, వ్యక్తులకు పంపిస్తున్న మిగులు కలిపి చూస్తే మనకు అనుకూలంగా ఉన్నది” అని పేర్కొన్నారు.

వలసగా ఉన్న దేశం స్వతంత్రంగా ఉన్నట్లైతే, దాని విదేశీమారక నిల్వలు పూర్తిగా దానికోసమే ఉపయోగ పడితే, దేశం యొక్క అంతర్జాతీయ కొనుగోలు శక్తి పెరిగేది. పన్నులు చెల్లించటం, చెల్లించకపోవటంతో సంబంధం లేకుండా స్థానిక ఉత్పత్తిదారులు తమ ఎగుమతులకు సమానమైన స్థానిక రూపాయల

**❝ 18వ శతాబ్దం అంతా, 19వ శతాబ్దం మధ్య భాగం వరకు వలనల నుండి దిగుమతి అవుతున్న వాటిలో ఆహారధాన్యాలు అతిముఖ్యమైనవిగా ఉన్నాయి. 18వ శతాబ్దం లో సరుకులను తిరిగి ఎగుమతి చేయటం ఎంత ముఖ్యమైన విషయమో ఫిల్లిస్ డీన్ చెప్పింది. దీనిద్వారా బ్రిటన్ యూరప్ నుండి వ్యూహాత్మక మైన నౌకా నిర్మాణసామాగ్రిని కొనుగోలు చేసింది. 1800 నుండి మూడు సంవత్సరా లలో బ్రిటిష్ వాణిజ్యం మొత్తం దేశీయ ఉత్పత్తిలో 58 శాతానికి చేరింది. ❞**

ను పొందేవారు. వారు చెల్లించిన పన్నులను స్థానికబడ్జెట్ ద్వారా ఇక్కడే ఖర్చుచేసేవారు. కాని వలసవాద దేశం స్థానిక ప్రజల నుండి ఆస్తులను సంపాదించే హక్కులను పొందుతుం ది. అదనపు ఉత్పత్తిని స్వంతం చేసుకోవటానికి, దానిని తన దేశానికి తరలించటానికి ఇది దానికి అవసరం.

ఆసియా నుండి దిగుమతి అవుతున్న నూలు బట్టలను వినియోగించటంపై విధించిన నిషేధ ం ఇంగ్లండ్‌లో పత్తితో బట్టలను తయారు చేసే యంత్రాలు, నూతన ఉత్పత్తులను రూపొందించ టానికి, పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా దిగుమతులకు ప్రత్యామ్నాయాలను అన్వేషించే క్రమంలో పారిశ్రామిక విప్లవానికి దారితీ సింది. భారతీయ వస్త్రాలకు వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలు కూడా ఈ అంశాన్నే ధృవ పరుస్తు న్నాయి. పూర్తిగా పత్తితో నేసిన బట్టలను దిగు మతి చేసుకోవటాన్ని నిషేధించారు. ఉత్పత్తి చేసే వారికి దేశీయ మార్కెట్‌పై పూర్తి గుత్తాధిపత్యం ఇవ్వకుండా ఏ రక్షణ కూడా పూర్తికాదని మాన్ టాక్స్ చెప్పాడు.

1650 నౌకాయాన చట్టాల ప్రకారం సరుకులను ఎక్కడికి రవాణా చేస్తున్నప్పటికీ మొదటగా బ్రిటిష్ ఓడరేవులకు రావాలని, అక్కడి నుండి తర్వాత ఎగుమతి చేయాలని నిర్ణయించారు. సరుకులను బ్రిటిష్ ఆఫీసర్లు ఉన్న, బ్రిటిష్ నౌకలలోనే రవాణా చేయాలని ఆదేశించారు. 18వ శతాబ్దం అంతా, 19వ శతాబ్దం మధ్య భాగం వరకు వలనల నుండి దిగుమతి అవుతున్న వాటిలో ఆహారధాన్యాలు అతిముఖ్యమైనవిగా ఉన్నాయి. 18వ శతాబ్దం లో సరుకులను తిరిగి ఎగుమతి చేయటం ఎంత ముఖ్యమైన విషయమో ఫిల్లిస్ డీన్ చెప్పింది. దీనిద్వారా బ్రిటన్ యూరప్ నుండి వ్యూహాత్మక మైన నౌకా నిర్మాణసామాగ్రిని కొనుగోలు చేసింది. 1800 నుండి మూడు సంవత్సరా లలో బ్రిటిష్ వాణిజ్యం మొత్తం దేశీయ ఉత్పత్తిలో 58 శాతానికి చేరింది.

### తరగని బంగారు గని భారత్

శీతల వాతావరణంలో ఉన్న దేశం సమశీతోష్ణస్థితిలో ఉన్న దేశంపై ఆధిపత్యం సంపాదించటం ఎప్పటికీ తరగని బంగారు గనిపై ఆధిపత్యం సంపాదించటం లాంటిది. ఇది బంగారం కన్నా లాభకరమైనది. బంగారం నిల్వలు ఎప్పటికైనా ఒట్టిపోతాయి. పన్ను చెల్లించేవారిని అదనపు దోపిడీ ద్వారా పూర్తిగా నాశనం చేయకపోతే అదనపు ఉత్పత్తిచేసే, పన్నులు చెల్లించే రైతులు, చేతివృత్తిదారుల శక్తి ఎప్పటికీ ఒట్టిపోదు.

ఉష్ణమండల పంటలైన పంచదార, బియ్య ం, సుగంధ ద్రవ్యాలు, కాఫీ, టీ, కోకోవా, పొగాకు, కూరగాయలు, వేరుశనగనూనె, లిన్‌సీడ్ పామాయిల్ లాంటి వంటనూనెలు, నల్లమందు, నీలిమందు, జనపనార, పత్తి, టేక్, రోజ్‌వుడ్, ఎబోని తదితర ఆహారపంటలు, ముడి సరుకు లు, అటవీ ఉత్పత్తులు బ్రిటన్‌కు ఎగుమతి చేస్తున్నారు. శీతల వాతావరణం ఉన్న భూము ల్లో ఈ పంటలను పండించటం సాధ్యం కాదు. ఆయా దేశాల ఉత్పత్తులలో ఉన్న ఈ వైవిధ్యం యూరోపియన్ దేశాలు సమశీతోష్ణ దేశాలను వలసలుగా చేసుకోవటానికి దారి తీశాయి. ఆ దేశాల ప్రజలు తమతో వాణిజ్యం చేసే విధంగా తుపాకులతో బెదిరించారు. రికార్డో ఉద్దేశ్యపూర్వకంగానే ఈ అంశాలను వదిలివేశాడు.

తమ ఉత్పత్తులతో ఉభయులు లబ్దిపొంద టం గురించి రికార్డో పేర్కొన్నాడు. రెండు దేశాలు రెండు సరుకులను ఉత్పత్తి చేయటం, అన్ని దేశాలు అన్ని సరుకులను ఉత్పత్తిచేయటం గురించి చెప్పి, ఎవరికి నైపుణ్యం ఉన్న ఉత్పత్తు లను వారు చేసి, పరస్పరం మార్పిడి చేసుకుంటే ఉభయులకు లాభదాయకం అని చెప్పాడు. సమశీతోష్ణ దేశాలలో పండే పంటల ఖర్చును, శీతల దేశాలలో పండే పంటలతో పోల్చ లేమనే విషయాన్ని ఆయన వదిలివేశాడు. అందువలన రెండు ఉత్పత్తులను పోల్చుకున్న పుడు పరస్పర లాభదాయకం అనేది కూడా సరికాదు. దేశీయ వనరుల నుండి భారీ స్థాయిలో సరఫరా చేస్తున్న సరుకులను ఏ ధరకు సరఫరా చేసినా ప్రస్తుతం అది సున్నాగానే ఉన్నది. ఈ సిద్ధాంతాన్ని రూపొందించటంలో రికార్డో చిన్న పొరపాటు చేశాడు. ఒక ప్రత్యేకమైన అంశాన్ని(రెండు దేశాలు రెండు సరుకులను ఉత్పత్తి చేయటం, వాణిజ్యం పరస్పరం లాభదాయకం కావటం) తీసుకొని, దాని నుండి కొన్ని నిర్ధారణలు చేసి, వాస్తవంలో అటువంటి లాభాలు లేని వాటికి దానిని వర్తింపజేయటానికి పూనుకున్నాడు. అందుకు భిన్నంగా తక్కువ శక్తివంతమైన దేశం తప్పనిసరిగా ఎగుమతికి అవసరమైన పంటలు పండించటం వలన, భిన్నమైన పంటలు పండించే విస్తీర్ణం తగ్గిపోవటంతో పాటు ఆహారోత్పత్తి పడిపోతుందని చారిత్రక అను భవాలు స్పష్టం చేస్తున్నాయి. అది దిగు మతులకు తప్పనిసరిగా ద్వారాలు తెరవాల్సి రావటం వలన దేశీయ పారిశ్రామిక ఉత్పత్తుల తగ్గుదలకు దారితీయటంతో పాటు ఈ ఉత్పత్తి నుండి బయటికి వచ్చిన వారికి ఉపాధి కల్పించటానికి అవసరమైన భూమి తక్కువగా ఉండటంతో నిరుద్యోగం పెరుగుదలకు దారి తీస్తుంది.

ఉత్తరాది దేశాలలో బ్రిటిష్ సరుకులకు ఉన్న డిమాండ్‌తో పోల్చినపుడు సమశీతోష్ణ దేశాల ఉత్పత్తులకు గిరాకి అధికంగా ఉంది. దిగుమతి చేసుకున్న సరుకులను తిరిగి ఎగుమతి చేయటంతో 1765- 1821 మధ్య బ్రిటిష్ ప్రజల కొనుగోలు శక్తి 55 శాతం పెరిగింది. తిరిగి ఎగుమతి చేసిన సరుకులలో ఐదింట నాలుగొంతులు సమశీతోష్ణ దేశాల నుండి దిగుమతి చేసుకున్నవే ఉన్నాయి. వాటిని తిరిగి యూరప్‌ఖండంలోని దేశాలకు ఎగుమతి చేసింది. 18వ శతాబ్దంలో నెదర్లాండ్స్ తమ దేశంలో ఉత్పత్తి అయిన సరుకుల కన్నా దిగుమతి చేసుకున్న సరుకులనే ఎక్కువగా ఎగుమతి చేసింది. అందువలన వలసలు ఉన్న దేశాలు రెండు విధాలుగా లాభపడ్డాయి. అభివృద్ధి చెందిన దేశాలు తమ వినియోగానికి ఉచితంగా సరుకులను పొందటంతో పాటు, ఆ సరుకులను విదేశాలకు ఎగుమతి చేసి లాభం పొందాయి.

1784-1826 మధ్య బ్రిటన్‌లోకి వచ్చిన వాటిలో సగం దిగుమతులు ఆసియా, ఐర్లాండ్, వెస్టిండీస్‌ల నుండి వచ్చాయి. 1801 నుండి 1821 మధ్య ఆసియా, వెస్టిండీస్‌లలోని వలసల నుండి బ్రిటన్‌లోకి వచ్చిన సరుకుల విలువ

బ్రిటన్ జిడిపిలో 5.3 నుండి 6.1 శాతంగా ఉంది. 1784 నుండి 1786 వరకు, తిరిగి 1824 నుండి 1826 ల మధ్య మూడు సంవత్సరాల కాలం పాటు ఈ దేశాలతో బ్రిటన్ వాణిజ్యలోటు జిడిపిలో 4 నుండి 6 శాతంగా ఉంది.

1765 నుండి 1836 సంవత్సరాల మధ్య ఎగుమతుల మిగులు 27.02 కోట్ల పౌండ్లుగా ఉంది. దీనిలోని మధ్యకాలం, 1800ల సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకొని 5 శాతం వడ్డీరేటును లెక్కిస్తే ఈ మొత్తం స్వాతంత్ర్యం వచ్చిన 1947 నాటికి 36,965 కోట్ల పౌండ్లు, 2020 నాటికి 12 లక్షల 40 వేలకోట్ల పౌండ్లకు చేరుతుంది. సంపదను కొల్లగొట్టుకెళుతున్న మధ్య సంవత్సరాన్ని లెక్కింపుకు ప్రారంభంగా తీసుకోవటం అంటే దోపిడీని తక్కువ చేసి చూయించటమే అవుతుంది. దీనిని నిశితంగా పరిశీలిస్తున్న మాంట్ గోమెరి 1840లో సెలెక్ట్ కమిటీ ముందు సాక్ష్యమిస్తూ ఈ దోపిడీని ఖండించాడు. సంవత్సరానికి 30 లక్షల హోం ఛార్జెస్‌ను 12 శాతం వడ్డీతో లెక్కిస్తే 1833 నాటికి మూడు దశాబ్దాలలో దాని విలువ 72.4 కోట్ల పౌండ్లని చెప్పాడు. అంతకు ముందు 50 సంవత్సరాల కాలంలో సంవత్సరానికి 20 లక్షల పౌండ్లకు పైగా తరలించిన ధనాన్ని అదే వడ్డీరేటు ప్రకారం లెక్కిస్తే 840 కోట్లపౌండ్లకు చేరుతుందని చెప్పాడు.

భారత వస్త్రాలను యూరప్ మార్కెట్ల నుండి తప్పించిన తర్వాత బ్రిటిష్ ఉత్పత్తి దారులు భారతదేశ మార్కెట్‌లోకి ప్రవేశించాలని చేస్తున్న డిమాండ్ తీవ్రం కావటంతో 1833లో భారత్, చైనా వాణిజ్యంపై ఈస్టిండియా కంపెనీ గుత్తాధిపత్యం ముగిసింది. అయినప్పటికీ 1857–59 లలో జరిగిన ప్రథమ స్వాతంత్ర్య పోరాటం వరకు కంపెనీ పాలన కొనసాగింది. బ్రిటన్‌కు భారత ఎగుమతులు తగ్గి, దేశాన్ని పారిశ్రామిక రహితం చేసే నూలు, బట్టల దిగుమతులు వేగంగా పెరిగాయి. 1840 దశకం చివరి నాటికి బ్రిటన్‌తో భారత్ వాణిజ్యం లోటులో ఉంది. అయినప్పటికీ బ్రిటన్‌తో ఏర్పడిన లోటును మించిపోయి, అత్యధిక మిగులును సాధించేలా ప్రపంచదేశాలకు భారత ఎగుమతులు పెరిగాయి. ఫలితంగా ఎగుమతులలో భారతదేశం నిరంతరం మిగులు లోనే ఉంది. ఉప్పు, నల్లమందు ద్వారా ఎక్కువ ఆదాయం పొందటం, బాంబే దక్కన్, మద్రాస్ ప్రెసిడెన్సీలను భూమిశిస్తు విధానం కిందికి తీసుకురావటంతో 1800 నుండి 1820 మధ్య

“1765 నుండి 1836 సంవత్సరాల మధ్య ఎగుమతుల మిగులు 27.02 కోట్ల పౌండ్లుగా ఉంది. దీనిలోని మధ్యకాలం, 1800ల సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకొని 5 శాతం వడ్డీరేటును లెక్కిస్తే ఈ మొత్తం స్వాతంత్ర్యం వచ్చిన 1947 నాటికి 36,965 కోట్ల పౌండ్లు, 2020 నాటికి 12 లక్షల 40 వేలకోట్ల పౌండ్లకు చేరుతుంది. సంపదను కొల్లగొట్టుకెళుతున్న మధ్య సంవత్సరాన్ని లెక్కింపుకు ప్రారంభంగా తీసుకోవటం అంటే దోపిడీని తక్కువ చేసి చూయించటమే అవుతుంది.”



భారతీయులపై దారుణ హింసాకాండను కొనసాగిస్తున్న బ్రిటీష్ అధికారులు

భూమిశిస్తు వసూళ్ళు మూడురెట్లు పెరిగాయి.

1871నుండి 1901 వరకు జరిగిన సరుకుల ఎగుమతుల మిగులు 42.85 కోట్ల పౌండ్లు భారతదేశ నిధులతో బ్రిటన్ చేసిన ఖర్చుకు సమానంగా ఉన్నది. దేశీయంగానూ, ప్రపంచంలోని పరిస్థితుల రీత్యా భారతదేశ ఎగుమతులలో హెచ్చుతగ్గులు ఉంటూ వచ్చాయి. కాని ఈ నిల్వలను ఉపయోగించుకొని స్టెర్లింగ్‌లలో బ్రిటన్ చేస్తున్న ఖర్చు స్థిరంగా పెరిగింది. ఏమైనప్పటికీ కంపెనీ ప్రారంభించిన ఎగుమతుల కోసం కొనుగోలు చేసిన సరుకులకు వారి నుండి వసూలు చేసిన పన్నుల ద్వారానే చెల్లించటం అనేది కొనసాగింది. అందువలన ఆ ఉత్పత్తులకు వారేమాత్రం చెల్లించటం లేదు. సరుకులు, బంగారం రూపంలో, విదేశీ మారకంగా వచ్చినవి కేంద్ర దేశాల వద్దే ఉండిపోయాయి.

భారతదేశం ప్రపంచదేశాలకు చేసిన ఎగుమతుల మిగులు భారతదేశంలోని ఉత్పత్తి దారులకు, భారత ప్రభుత్వ విదేశీ మారక నిల్వలకు చేరకుండా నిరోధించి, తన ప్రయోజనాల కోసం బ్రిటన్ వినియోగించుకున్నది. భారతదేశ విదేశీమారకంలోని కొంతభాగాన్నైనా రూపాయలలో కూడా భారతదేశంలోకి పంపలేదు. భారతదేశం కోసం రూపొందించిన బడ్జెట్‌లో కూడా కొంతభాగాన్ని బ్రిటన్, ఇతర దేశాలలో ఖర్చు చేస్తున్నట్లు విదేశాంగశాఖ కార్యదర్శి పేర్కొనేవాడు. ఈ విధంగా ఆదాయం తగ్గింపుతో పాటు డబ్బుకొరత, తగినన్ని వనరులు అందుబాటులో లేకపోవటంతో నిరంతరం అధికవడ్డీలకు రుణాలు తీసుకోవలసి వచ్చేది. సరుకులను ఎగుమతి చేయటం ద్వారా భారతదేశం సంపాదిస్తున్న భారీ విదేశీ మారక ద్రవ్యాన్ని ప్రభుత్వ నిర్వహణకు అవసరమైన రుణాలుగా చూయించేవారు. ప్రభుత్వ నిర్వహణకు చూపే ఖర్చులు, కుతంత్రాల ద్వారా చూయిస్తున్న రుణాల ద్వారా మాత్రమే కాక ఇతర విధాలుగా కూడా సంపదను దోచుకెళ్ళారు.

**భారతదేశ బడ్జెట్ నుండి విదేశాలలో ఖర్చు**

1837–38 నుండి 1900–1901 మధ్య భారతదేశ బడ్జెట్‌లోని నిధుల నుండి 59.67 కోట్ల పౌండ్లను విదేశాలలో ఖర్చు చేశారు. 1861 నుండి కౌన్సిల్ బిల్లులకు

**"2020 వరకు ఈ పెరుగుదలను లెక్కిస్తే 13.39 లక్షల కోట్ల పౌండ్లు ఉంటుంది. ఇది ఆ సంవత్సరం బ్రిటన్ జిడిపి కన్నా నాలుగు రెట్లు ఎక్కువ. ఈ కాలం అంతా పౌండు, అమెరికా డాలరు మధ్య మారకం రేటు ఒక పౌండుకు 4.84 డాలర్లుగా ఉంది. ఆ విధంగా లెక్కిస్తే 1765 నుండి 1900 వరకు తరలించుకుపోయిన సంవద పెరుగుదల విలువను కూడా కలిపి లెక్కిస్తే 1947 నాటికి 1.925 లక్షల కోట్ల డాలర్లు, 2020 నాటికి 64.82 లక్షల కోట్ల డాలర్లు అవుతుంది."**



భారత దేశం నుండి కొల్లగొట్టిన సరుకులను తమ దేశానికి తరలిస్తున్న బ్రిటిష్ అధికారులు

భారతదేశ ఎగుమతుల మిగులు నుండి చెల్లించారు. ఈ విధంగా ఖర్చు చేసిన పౌండ్లు, రూపాయల వివరాలన్నీ బ్రిటిష్ ఇండియా రికార్డులలో లభిస్తాయి. 5 శాతం కాంపౌండ్ వడ్డీ చొప్పున 1947 నాటికి 79 సంవత్స రాలకు, 2020కి 152 సంవత్సరాలకు లెక్కిస్తే 1947 నాటికి 2,800 కోట్ల పౌండ్లు, 2020 నాటికి 9,92,144 కోట్ల పౌండ్లు అవుతుంది. ఈ లెక్కలను 1775-1836 సంవత్సరాల మధ్య జరిగిన దోపిడీకి మనం కలిపితే 1947 నాటికి 39,765 కోట్లపౌండు, 2020 నాటికి 21,16,144 కోట్లపౌండ్లు అవుతుంది.

ఈ దోపిడీ ఎంత తీవ్రంగా ఉందో, దాని విలువ ఏమిటో తెలియటం కోసం 1836, 1900, 1947 సంవత్సరాల బ్రిటన్ జిడిపిని చూడాలి. 1765 నుండి 1900 సంవత్సరం వరకు జరిగిన దోపిడీని వడ్డీతో కలిపి లెక్కిస్తే 1947 నాటికి 39,780 కోట్లపౌండ్లు ఉంటుంది. ఇది 1947లో బ్రిటన్ జిడిపి కన్నా 38 రెట్లు ఎక్కువ. 2020 వరకు ఈ పెరుగుదలను లెక్కిస్తే 13.39 లక్షల కోట్ల పౌండ్లు ఉంటుంది. ఇది ఆ సంవత్సరం బ్రిటన్ జిడిపి కన్నా నాలుగు రెట్లు ఎక్కువ. ఈ కాలం అంతా పౌండు, అమెరికా డాలరు మధ్య మారకం రేటు ఒక పౌండుకు 4.84 డాలర్లుగా ఉంది. ఆ విధంగా లెక్కిస్తే 1765 నుండి 1900 వరకు తరలించుకుపోయిన సంవద పెరుగుదల విలువను కూడా కలిపి లెక్కిస్తే 1947 నాటికి 1.925 లక్షల కోట్ల డాలర్లు, 2020 నాటికి 64.82 లక్షల కోట్ల డాలర్లు అవుతుంది. 1947లో బ్రిటన్, అమెరికా, కెనడాల ఉమ్మడి జిడిపి కన్నా మొదటి అంకె ఎక్కువ. తర్వాతి అంకె 2020 లో ఈ దేశాల ఉమ్మడి జిడిపి కన్నా చాలా ఎక్కువ.

మనం వేసిన అంచనాలు చాలా తక్కువ. బ్రిటన్ ప్రయోజనా కోసం భారత్ నుండి దోచుకున్న సంవదను అవి ప్రతిబింబించవు. ఎగుమతుల ద్వారా భారతదేశం సంపాదిస్తున్న సొమ్మంతా ప్రభుత్వ కార్యదర్శి లెక్కల్లో అదృశ్యమయేది. భారతదేశం బ్రిటన్‌కు ఎప్పుడూ రుణపడే ఉండేది. భారతదేశం ఎగుమతి చేస్తున్న సరుకుల్లో కొంతమొత్తమైనా తన ఎకౌంట్‌లో జమపడి ఉన్నట్లైతే 1868 లో జపాన్ మీజి విప్లవం తర్వాత చేసిన దానికంటే ముందుగానే భారతదేశం ఆధునిక పారిశ్రామిక యంత్రాలను దిగుమతి చేసుకొని, పారిశ్రామి కంగా అభివృద్ధి చెందేది లేదా విదేశీ రుణ భారం లేకుండా తానే పెట్టుబడులను ఎగుమతి చేసేది. ముడిపత్తికి అత్యధికంగా ధరలు వచ్చిన 1860, 70 లలో తాను సంపాదించిన విదేశీ మారకం ద్వారా భారతీయ రైల్వేలను అనేక రెట్లు ఎక్కువగా నిర్మించేది. 1860-76 మధ్య ఎగుమతుల ద్వారా 13.5 కోట్ల పౌండ్లు రాగా, రైల్వేలు, నీటి పారుదల సదుపాయల కల్పనకు పెట్టిన పెట్టుబడులు 2.6 కోట్ల పౌండ్లు మాత్రమే. కాని ఇంతకు ముందు మనం చర్చించిన విధంగా ఎగుమతులకు వస్తున్న మొత్తాన్ని బ్రిటన్ స్వంతం చేసుకోవటంతో దేశంలో రైల్వేల నిర్మాణం కోసం లండన్‌లోని వడ్డీ వ్యాపారులు డిమాండ్ చేసిన వడ్డీని చెల్లించటానికి అంగీకరించి అప్పులు తీసుకోవా ల్సి వచ్చింది.

భారతదేశ బడ్జెట్‌లో ఇంగ్లండ్‌లో చేయా ల్సిన ఖర్చును రూపాయలు, స్టెర్లింగ్‌లలోనూ చూయించేవారు. వీటిలో హోం ఛార్జీలు, రక్షణ, రుణాలపై వడ్డీలు ప్రధానంగా ఉండేవి. హోంఛార్జీలంటే భారతదేశంలో పనిచేసిన విదేశీయులకు పెన్షన్లు, సెలవులలో చెల్లించే అలవెన్సులు, అటువంటి ఇతర ఖర్చులనే తప్పుడు భావన ఉన్నది. కాని 1861 నుండి 1934 వరకు బడ్జెట్ వివరాలను పరిశీలిస్తే ఈ నిర్వహణ ఛార్జీలన్నీ కలిపి హోంఛార్జీలలో 12.7 శాతంగా మాత్రమే ఉన్నాయని స్పష్టమౌతున్నది. వేగంగా పెరుగుతున్న భారత దేశపు ఎగుమతి ఆదాయం కన్నా ఈ ఖర్చులు విపరీతంగా పెరగటంతో రుణం వేగంగా పెరిగింది. దేశంలో జరిగిన ప్రథమ స్వాతంత్ర్య పోరాటాన్ని అణచివేయటం కోసం ఖర్చు పెరగటం వలన 1856-61 మధ్య రుణం 40 లక్షల పౌండ్ల నుండి 35 కోట్లకు, తొమ్మిది రెట్లు పెరిగింది. 1870లలో స్టెర్లింగ్ రుణం 7 కోట్లపౌండ్లకు పెరిగింది. 1880లలో స్టెర్లింగ్ రుణాలు రూపాయి రుణాలను మించి పోయాయి. రిజర్వు అవసరాల కోసం బంగారాన్ని దిగుమతి చేసుకోవటంతో 1891లో రుణం తిరిగి భారీగా పెరిగింది. 1901 నాటికి మొత్తం స్టెర్లింగ్ రుణం 13.5 కోట్లకు చేరింది. ఈ మొత్తం బ్రిటిష్ ఇండియా జిడిపిలో ఐదవ వంతు,

దాని ఎగుమతుల మిగులులో ఎనిమిదవ వంతుగా ఉంది.

ఆర్థిక అంశాలను బ్రిటన్ చక్కబెట్టటంతో ఎగుమతులలో వస్తున్న మిగులును రకరకాల పేర్లతో స్వంతం చేసుకొనేవారు. ఎగుమతుల ఆదాయాన్ని స్వతం చేసుకోవటానికే పరిమితం కాకుండా తనకు అదనపు నిధులు కావలసిన పుడల్లా రుణభారాన్ని పెంచు తుండేది. ఈ అంశాలను బయటివారికి అర్థం కాని విధంగా నిర్వహించేది. భారతదేశ ఎగుమతులు బాగా పెరిగినపుడు ఈ అదనపు ఆదాయాన్ని కాజేయ టానికి కొత్త డిమాండ్లను ముందుకు తెచ్చేది. 1919లో ఎగుమతుల మిగులు 11.4 కోట్లపౌండ్లకు చేరింది. భారత్ నుండి దిగుమతి చేసుకున్న ఆయుధాలకు 6.7 కోట్ల పౌండ్లను చెల్లించలేదు. భారతదేశ ఆదాయంతో బ్రిటిష్ వారు తమకు తాము బహుమతులు ఇచ్చుకునే వారు. మొదటి ప్రపంచయుద్ధం సందర్భంలో 10 కోట్ల పౌండ్లను బహుమతుల రూపంలో బ్రిటన్ తీసుకున్నది. ఇది అతిపెద్దమొత్తం. భారతదేశ బడ్జెట్ కన్నా ఎక్కువ. బ్రిటన్ జాతీయ ఆదాయంలో 3 శాతం ఉంటుంది. ఈ బహు మతులు తీసుకున్న విషయం సామాన్యులకెవరికీ తెలియదు. తర్వాతి సంవత్సరం మరో 4.5 కోట్లపౌండ్లను బహుమతులుగా తీసుకున్నారు. ఈ రెండూ భారతదేశ రుణభారాన్ని పెంచాయి. ఒకవేళ భారతదేశ ఎగుమతులు పడిపోయి నప్పటికీ స్టెర్లింగ్‌లలో చెల్లించాలని డిమాండ్ చేస్తున్న మొత్తాన్ని ఎప్పుడూ తగ్గించేవారు కాదు.

ఉత్పత్తిదారుల నుండి తీసుకున్న డబ్బును దేశంలో ఖర్చు చేయకపోతే ఉత్పత్తిదారుల ఆదాయాన్ని తీవ్రంగా పీల్చివేయటమేనన్న వాస్తవం నౌరోజి, దత్తులకు తెలుసు. ఈ అంశానికి సంబంధించి 1830లో లార్డ్ వింటేజ్ చెప్పిన అంశాలను దత్తు ఉదహరిం చాడు. "ప్రస్తుత విధానంలో బ్రిటన్‌కు చెల్లిస్తున్న పన్ను విధానం పూర్తిగా అభ్యంతరకరమైనది. పన్నులు వసూలు చేసిన దేశాలలోనే వాటిని ఖర్చు చేయటం వలన వచ్చిన ఫలితాలకు, ఒక దేశంలో వసూలు చేసిన పన్నులను వేరే దేశంలో ఖర్చు చేయటం వలన వచ్చిన ఫలితాలు భిన్నంగా ఉంటాయి. జాతీయో త్పత్తిపై ప్రభావం రీత్యా చూసినపుడు వేరే దేశానికి బదలాయించిన పన్నులు సముద్రంలో పారబోసిన వాటితో సమానమౌతాయి".

ఆదాయాలు తగ్గిపోవటంతో ఉత్పత్తిదారులు తక్కువ ఆహారధాన్యాలను వినియోగిస్తారు.

> **"వాటిని భారతదేశంలో ఖర్చు చేసే బడ్జెట్ నుండే చెల్లిస్తున్నారు. 1861 నుండి 1934 వరకు సెలవులు, పెన్షన్లు, ఇతర ఖర్చుల కోసం స్టెర్లింగ్ ఛార్జీలలో 12.7 శాతం మాత్రమే ఖర్చు చేశారు.ఆయుధాల కొనుగోలు కోసం చేసిన రుణాలపై వడ్డీలు చెల్లించటానికి, అప్పటి విదేశాలలో యుద్ధఖర్చులు, సైనికఖర్చుల కోసం హోం ఛార్జీలలో 77 శాతం వినియోగించేవారు. ప్రభుత్వ అవసరాల కోసం కొనుగోలు చేసేవాటికి 10 శాతం మాత్రమే ఖర్చు చేసేవారు."**

ఆహారపంటలు పండించే భూములను ఎగుమతి పంటలకు వినియోగించటం, ఆహారధాన్యాలను ఎగుమతి చేయటం చేస్తారు. బ్రిటిష్ పాలనలో భారతీయుల ఆదాయాలు తగ్గిన ఫలితంగా ఆహారధాన్యాల వినియోగం స్థిరంగా తగ్గిపోయింది. బ్రిటన్‌లో ఖర్చు చేయటం కోసం భారతదేశ బడ్జెట్‌లో కేటాయిం చిన మొత్తం సముద్రంలో పారబోయటం కాదని, బ్రిటన్ ప్రజలకు విస్తారంగా సరుకులను ఉచితంగా అందించటమేనన్న అంశాన్ని వింటేజ్ మాటలకు మనం అదనంగా జోడించాల్సి ఉంటుంది.

బ్రిటిష్ వారికి ముందున్న పాలకులు దేశంలోని వారైనా లేదా విదేశీయులైనా వారు దేశప్రజలలో భాగమైనందున వసూలు చేసిన పన్నులు దేశం నుండి బయటికి తరలిపోలేదు. ఆ మొత్తాన్ని దేశంలోనే ఖర్చుచేశారు. ప్రజల పన్నులతో సరుకులు కొనుగోలుచేసి, వాటిని ఉచితంగా ఎగుమతులు చేయటం జరగ లేదు. అందువలన బ్రిటిష్ పాలనలో జరిగిన విధంగా సంపద ఇతర దేశాలకు తరలిపోలేదు. దేశం బయట ఖర్చుపెట్టే ఖాతాలు అనేకం ఉండటం, వాటికి భారత దేశ బడ్జెట్ నుండి నిధులను తరలిం చటం భారతదేశం వలసగా ఉండటం వలననే సాధ్యమైందని నౌరోజి, దత్తు పేర్కొన్నారు. అందువలన భారతదేశ సంపదను బ్రిటన్ దోచుకెళ్ళగలిగిందని వారు పేర్కొన్నారు. హోం ఛార్జెస్ అనేవి దేశంలో పనిచేస్తున్న బ్రిటిష్ సివిల్, మిలిటరి అధికారులకు చెల్లిస్తున్న మొత్తాలు కావు. వాటిని భారతదేశంలో ఖర్చు చేసే బడ్జెట్ నుండే చెల్లిస్తున్నారు. 1861 నుండి 1934 వరకు సెలవులు, పెన్షన్లు, ఇతర ఖర్చుల కోసం స్టెర్లింగ్ ఛార్జీలలో 12.7 శాతం మాత్రమే ఖర్చు చేశారు. ఆయుధాల కొనుగోలు కోసం చేసిన రుణాలపై వడ్డీలు చెల్లించటానికి, అప్పటి విదేశాలలో యుద్ధఖర్చులు, సైనికఖర్చుల కోసం హోం ఛార్జీలలో 77 శాతం వినియోగిం చేవారు. ప్రభుత్వ అవసరాల కోసం కొనుగోలు చేసేవాటికి 10 శాతం మాత్రమే ఖర్చు చేసేవారు. భారతదేశం బయట బ్రిటిష్ వలసల విస్తరణ కోసం చేసే యుద్ధాల ఖర్చులను పాక్షికంగా లేదా పూర్తిగా భారతదేశంపైనే మోపేవారు. 1941-46 మధ్య దక్షిణాసియాలో మిత్రదేశాల యుద్ధ భారాన్ని భారతదేశంపై మోపారు. ఇందుకోసం తీసుకున్న రుణాన్ని బలవంతంగా భారత దేశంపై రుద్దారు. దీని వినాశకర పరిణామాల వలన 30 లక్షల మంది ప్రజలు ఆకలితో మరణించారు.

పాలించే దేశం సంపదను దోచుకు పోతున్నదని మనం చెబుతున్నాం. కాని తీసుకుపోయిన సంపదకు బదులుగా తాము తగిన సేవలను అందజేస్తున్నామని, అందువలన తాము తీసుకెళ్ళిన మొత్తానికి తగిన ప్రతిఫలం చెల్లించామని చెబుతున్నారు. అటువంటపుడు వలసదేశాలపై ఆధిపత్యం వహించిన దేశాలు సంపదను దోచుకుపోయాయని వాదించటం సరైనదేనా?

ఈ ప్రశ్నకు రెండు విధాలుగా సమాధానం చెప్పవచ్చు. దోపిడీ చేసుకెళ్ళిన సంపదను ఏ విధంగా పంపకం చేశారన్నది ప్రధానం కాదు. దానిని ఏ విధంగా పంపిణి చేసినప్పటికీ దాని దోపిడి స్వభావం మారదు. సంపద తరలిం చుకు పోయిన దానికి ప్రతిగా పరిపాలన చేస్తున్నామని, రక్షణ కల్పిస్తున్నామని ఆధిపత్య దేశం చేస్తున్న వాదన సరైనది కాదు. రెండవది, స్థానిక పరిపాలన మొత్తాన్ని భారతీయులకే బదలాయించినప్పటికీ రాజకీయ ఆధిపత్యం బ్రిటన్ చేతుల్లోనే ఉన్నంత వరకు ఈ దోపిడీలో ఏ మాత్రం మార్పుండదు. దేశ అంతర్గత బడ్జెట్‌ను విదేశాలకు చెందిన అంశాలతో ముడిపెట్టి తన దోపిడీని కొనసాగిస్తూనే ఉంటుంది.

**(స్వేచ్ఛానువాదం: ఎ కోటిరెడ్డి)**

❋

**❝ మరోవైపు చైనా పలుకుబడి గణనీయంగా పెరుగుతోంది. చైనా తోడ్పాటు లేకుండా ప్రపంచ ఆర్థికాభివృద్ధి సాధ్యం కాదని అందరికీ అర్థమౌతోంది. చైనా పట్ల అనేక విషయాలలో భేధాభిప్రాయాలు ఉన్నప్పటికీ ఆ దేశం సాధిస్తున్న అభివృద్ధి, కరోనాతో సహా మానవజాతి ఎదుర్కొంటున్న ముఖ్య సమస్యలను ఆ దేశం పరిష్కరిస్తున్న తీరును ప్రతి ఒక్కరూ అంగీకరించక తప్పటం లేదు. ❞**

**(6వ పేజీ తరువాయి)**

డబ్ల్యు. హెచ్. ఓ కమిటీ చైనాలోని వూహాన్‌లో పర్యటించి అనేక వివరాలు సేకరించింది. 'వైరస్‌కు వూహాన్ లేబరేటరీ లీక్ కారణం కాదని' ఆ కమిటీ స్పష్టంగా ప్రకటించింది. కమిటీ ఊహిస్తున్న కారణాలు 4 ఉన్నాయి. 1. వైరస్ జంతువుల నుండి మనుషులకు పాకిందా? 2. ఇలా పాకటానికి మరోజాతి జీవి మధ్యవర్తిగా పనిజేసిందా? 3. శీతలీకరించబడిన ఆహారం రవాణా ద్వారా జరిగిందా? 4. లాబరేటరీల నుండి లీకయిందా? ఇక మిగతా మూడు కారణాలను పరిశీలించాల్సి ఉందని, ఇందు కోసం ఇతర ప్రాంతాలు, దేశాలు పర్యటి స్తామని ఆ కమిటీ ప్రకటించింది. ఈ విధంగా చైనాపై తాము చేసిన ఆరోపణలు నిజం కాదని రుజువు కావటం అమెరికాకు, కొన్ని పాశ్చాత్యదేశాలకు, వాటి మీడియాకు మింగుడుపడటం లేదు.

**జి 7 దేశాల సమావేశం :**

జి 7 దేశాల సమావేశం ఒక వారం కిందట జరిగింది. బైడెన్ పర్యావరణ సమస్యలపైనా, కరోనా నియంత్రణపైనా, చైనాకు వ్యతిరేకంగా అందరు కల్సి వ్యవహరించటంపైనా మాట్లాడారు. చైనా విషయంలో ఆయన ప్రతిపాదనలకు మిగతా వారిలో ఎక్కువ మంది అంగీకించలేదు.

ఫిబ్రవరి 10 నుండి 17వరకూ జరిగిన చైనా నూతన సంవత్సర వేడుకలు గతంలో ఎన్నటికంటే కూడా ఘనంగా జరిగాయి. అమెరికా అధ్యక్షుడు కూడా గతానికి భిన్నంగా ఆ దేశానికి, ప్రజలకు శుభాకాంక్షలు చెప్పకతప్పలేదు. బైడెన్ ఈ సందర్భాన్ని ఉపయోగించి మొదటిసారిగా చైనా అధ్యక్షునితో ఫోన్‌లో గంటకుపైగా మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా ఇదివరకు స్పందించని దేశాలు కూడా చైనాకు శుభాకాంక్షల సందేశాలు పంపాయి. చైనా కమ్యూనిస్టు పార్టీని స్థాపించి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 2021 సంవత్సరమంతా ఆ దేశంలో వేడుకలు జరుగుతున్నాయి. దేశంలో పేదరికాన్ని జయించినట్లుగా ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రకటించింది. 2049 (పీపుల్స్ రిపబ్లిక్ స్థాపించి 100సం॥రాల)కు ఆధునిక సోషలిస్టు రాజ్యంగా అవతరించటం లక్ష్యంగా పార్టీ ప్రకటించింది.

**మానవజాతి సమస్యలకు పరిష్కారం సోషలిజమే :**

ఈ అన్ని ఘటనలు, పరిణామాలను బట్టి మనకు అర్థమయ్యేదేమంటే అమెరికా ఆధిపత్యం ఇంతకు ముందులాగా సాగదు. దాని నాయకత్వ శక్తి బలహీనపడింది. అంతర్గతంగా అనేక సమస్యలలో చిక్కుకోవటంతో బాటు, దాని మిత్రదేశాలు కూడా అమెరికాను పూర్తిగా నమ్మే పరిస్థితి లేదు. మరోవైపు చైనా పలుకుబడి గణనీయంగా పెరుగుతోంది. చైనా తోడ్పాటు లేకుండా ప్రపంచ ఆర్థికాభివృద్ధి సాధ్యం కాదని అందరికీ అర్థమౌతోంది. చైనా పట్ల అనేక విషయాలలో భేధాభిప్రాయాలు ఉన్నప్పటికీ ఆ దేశం సాధిస్తున్న అభివృద్ధి, కరోనాతో సహా మానవజాతి ఎదుర్కొంటున్న ముఖ్య సమస్యలను ఆ దేశం పరిష్కరిస్తున్న తీరును ప్రతి ఒక్కరూ అంగీకరించక తప్పటం లేదు. పెట్టుబడిదారీ విధానం ఈ సమస్యలను పరిష్కరించ జాలదనేది, దానికి సోషలిజమే సరైన ప్రత్యామ్నాయమనేదీ అంతకంతకూ ప్రపం చానికి స్పష్టమౌతోంది. అయినా అమెరికా పెట్టుబడి దారీ దోపిడీ రాజ్యాలను పోగేయటానికీ, చైనాపై కేంద్రీకరించటానికీ, సోషలిస్టు శక్తులను అణచటానికి శతవిధాలా ప్రయత్నిస్తుందీ... పెనుగులాడుతుంది. ఈ పెనుగు లాటలో జయాపజయాలే ప్రపంచ భవిష్య త్తును నిర్ణయిస్తాయి. అంతిమంగా సోషలిజం విజయం సాధించటం అనివార్యం కదా !. ❋

# పాఠకుల అభిప్రాయాలు

కామ్రేడ్

2021 జనవరి మార్క్సిస్టు పత్రికలో సిపిఐ(ఎం) కేంద్రకమిటి సభ్యులు కా॥శ్రీనివాసరావుగారు రాసిన వ్యాసం “వ్యవసాయ చట్టాలతో రైతులకు మరణ శాసనము'' నల్ల చట్టాల గురించి మరింత లోతుగా అధ్యయనం చేయడానికి ఉపయోగపడుతుంది. వారికి ప్రత్యేక ధన్యవాదములు

ఎన్ని ఆటంకాలు ఎదురైనా మొక్కవోని దీక్షతో పోరాడుతున్న రైతులకు, వారికి సహకరిస్తున్న కార్మికులకు, క్రీడాకారులకు, గాయకులకు, ప్రజలందరికి విప్లవాభివందనాలు. “నేనుసైతం” అని శ్రీశ్రీగారిస్ఫూర్తితో ప్రతిఒక్కరు నల్లచట్టాను రద్దు చేయాలని పోరాడుతున్న రైతులకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరుకుంటున్నాను.

రైతు ఉద్యమ తీరు, ఉద్యమ అవసరం, చట్టాలు అమలు అయితే రైతులకు, తద్వారా ప్రజలకు జరిగే నష్టం గురించి అనేక విషయాలు తెలియ చేసిన కా॥ శ్రీనివాసరావు గారికి మరొక్కమారు అభినందనలు తెలుపుతూ వారి నుంచి మరిన్ని వ్యాసాలు రావాలని ఆశిస్తున్నాము.

విప్లవాభినందనలతో

ఏ. హరి (పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు)

అనంతపురం జిల్లా (దక్షిణం) - హిందూపురం

# భారతదేశ విప్లవ పంథాకై అన్వేషణ

(2వ పేజీ తరువాయి)

నిర్మాణానికి సంబంధించిన అంశాలపై నిర్ణయాలను ఆమోదించటం కోసం కొత్త కేంద్రకమిటీ, ప్రాంతీయ కమిటీ ప్రతినిధులతో ఆరునెలల్లో ప్లీనం నిర్వహించాలని నిర్ణయించారు.

ఆంధ్ర కమిటీ ప్రతిపాదించిన 'భారత కమ్యూనిస్టు పార్టీలో వామపక్ష పెడధోరణి 'రాజకీయ నోట్‌ను కేంద్రకమిటి కొన్ని సవరణలతో ఆమోదించింది. అంతకు ముందు పొలిట్ బ్యూరో ప్రవేశ పెట్టిన మూడు డాక్యుమెంట్లను – జనతా ప్రజాస్వామ్యం, వ్యవసాయ సమస్య, ఎత్తుగడల పంథా – కేంద్ర కమిటీ వెనక్కు తీసుకుంది. ఇతర డాక్యుమెంట్లను పునఃపరిశీలించాలని నిర్ణయించింది. పార్టీలో అంతర్గత చర్చల కోసం, జరగబోయే ప్లీనంలో ఆమోదం పొందడానికి కేంద్ర కమిటీ నాలుగు డాకుమెంట్లను–అంతకు ముందు పొలిట్‌బ్యూరో సర్క్యులేట్ చేసిన మూడు డాక్యుమెంట్లపై విమర్శ, రాజకీయ తీర్మానాలు, మావో గురించి తీర్మానం, పొలిట్‌బ్యూరో వామపక్ష ఒంటెత్తు కార్యకలాపాలపై నిర్మాణ నివేదిక– ఆమోదించి సర్క్యులేట్ చేసింది.

ఈ పరిణామాల వలన భారతదేశ విప్లవ పంథాను నిర్ణయించడంలో ప్రధానమైన మార్పు జరిగింది. భారతదేశంలో అధికారాన్ని హస్తగతం చేసుకోడానికి రాజకీయంగా సార్వత్రిక సమ్మెలకు పిలుపునివ్వాలని, నగరాలలో కార్మిక వర్గం సాయుధ తిరుగుబాటు చేయాలని పార్టీ రెండో మహాసభలో ఎన్నికయిన పొలిట్ బ్యూరో ప్రతిపాదించింది. పాక్షిక పోరాటాలు చేస్తూ కొన్ని ప్రాంతాలను విముక్తి చేస్తూ పోవాలని, చివరగా పట్టణాలను విముక్తి చేసుకోవాలని ఆంధ్ర కమిటీ చేసిన ప్రతిపాదనను కొత్తగా ఎన్నికయిన పార్టీ నాయకత్వం అంగీకరించింది. భారత దేశంలో ఒకేసారి ప్రజాతంత్ర, సోషలిస్టు విప్లవాలను సాధించడం సాధ్యం కాదని చెప్పింది. అందువలన విప్లవ పోరాటంలో వర్గ మిత్రులను ఎంచుకునే వ్యూహంలో మార్పులు చోటు చేసుకున్నాయి. ధనిక రైతులతో సహా మొత్తం బూర్జువాలందరినీ జనతా ప్రజాతంత్ర విప్లవానికి శత్రువులుగా చూడకూడదని, అందులో కొన్ని తరగతులను మిత్రులుగా గెలుచుకోనే ప్రయత్నం చేయాలని అంగీకరించారు.

కొత్తగా ఆమోదించిన రాజకీయ పంథా కూడా భారతదేశ పరిస్థితులను అంచనా వేయడంలో విఫలమయింది; ఫలితంగా విప్లవ వ్యూహాన్ని రూపొందించడంలో కూడా విఫలమయింది. భారతదేశం పొందిన స్వాతంత్ర్య స్వభావాన్ని అంచనా వేయటం, సామ్రాజ్యవాదుల పాత్ర, భారతదేశ పాలకవర్గాలపై దాని ప్రభావం వగైరాలలో ఈ తప్పుడు అంచనాలు ప్రతిబింబించాయి. తెలంగాణాలో గాని, భారత దేశంలోని ఇతర ప్రాంతాలలోగాని జరిగిన తదనంతర పరిమాణాలు ఈ పరిమితులను ముందుకు తెచ్చాయి. తిరిగి మరొకసారి పార్టీలో తీవ్రస్థాయిలో అంతర్గత చర్చలు ప్రారంభమయ్యాయి.

పార్టీ రెండో మహాసభకు ముందు పార్టీలో తలెత్తిన మితవాద ధోరణులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకున్నాయి. బొంబాయిలోని పార్టీ కార్యాలయం ఈ కార్యకలాపాలకు కేంద్రంగా మారింది. ఎస్.ఏ డాంగే, అజోయ్ కుమార్ ఘోష్, ఎస్ వి ఘాటే ఈ మార్పుకు నాయకత్వం వహించారు. వారికున్న చట్ట పరమైన స్వేచ్ఛను ఉపయోగించుకుని వారు పార్టీ కార్యకర్తలలో గందరగోళాన్ని వ్యాపింప చేశారు. కేంద్ర నాయకత్వం, తెలంగాణ సాయుధ పోరాట నాయకులు, ఇతర రైతాంగ పోరాట ఉద్యమకారులు రహస్య జీవితాలు గడపడం వలన వారీ మార్పులలో జోక్యం చేసుకోలేక పోయారు. పార్టీలో తిరిగి అంతర్గత పరిస్థితి దిగజారింది. వివిధ ధోరణులు, ముఠాలుగా పార్టీ చీలిపోయింది.

మితవాద సంస్కరణ వాదాన్ని వామపక్ష దుందుడుకు వాదంతో గెలవలేమని, వామపక్ష దుందుడుకు వాదాన్ని గెలవడానికి మితవాద సంస్కరణవాదం పనికి రాదని, ఈ రెండు తప్పుడు ధోరణులను పూర్తిగా నిర్మూలించాల్సిందేనని ఈ కఠినమైన పోరాటాల అనుభవాల ద్వారా పార్టీ అర్థం చేసుకున్నది

పార్టీలోని ఈ రాజకీయ, సైద్ధాంతిక గందరగోళాన్ని సరిచేయడానికి సోదర కమ్యూనిస్టు పార్టీ అయిన సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ, కామ్రేడ్ స్టాలిన్‌ల సహకారం కోరింది. సి పి ఎస్ యు నాయకత్వం ఇందుకు తక్షణమే అంగీకారం తెలిపింది. సి రాజేశ్వర రావు, ఎం బసవపున్నయ్య, అజయ్‌కుమార్ ఘోష్, ఎస్ ఏ డాంగే నాయకత్వంలో ప్రతినిధి బృందం సి పి ఎస్ యు నాయకత్వాన్ని, కామ్రేడ్ స్టాలిన్‌ని కలిసి పార్టీలో చర్చ జరుగుతున్న, వివాదాస్పదంగా ఉన్న అంశాలపై చర్చించి స్పష్టత తీసుకోవాలని సోవియట్ యూనియన్ వెళ్లారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించడానికి సి పి ఎస్ యు కేంద్ర కమిటి స్టాలిన్ నాయకత్వంలో ఒక కమిటీని ఏర్పరచింది. ఈ కమిటిలో కామ్రేడ్ స్టాలిన్, మాలటోవ్, మాలెంకోవ్, సుస్లోవ్ ఉన్నారు,

ఈ చర్చలలో పార్టీ కార్యక్రమంపై ప్రధానంగా చర్చ జరిగింది. సిద్ధాంతాన్ని నిర్దిష్ట పరిస్థితులకు నిర్దిష్టంగా వర్తింపచేయడం, ఎత్తుగడలు, అటువంటి ఇతర విషయాలు చర్చించారు. భారత కమ్యూనిస్టు పార్టీయే భారత దేశంలోని నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా విశ్లేషించి, ఆ పరిస్థితులకు మార్క్సిజం లెనినిజం సూత్రాలను అన్వయించు కోవాలని, భారత కమ్యూనిస్టులు స్పష్టమైన అవగాహన కు వచ్చేలా సహకరించటానికి మాత్రమే తమ పాత్ర పరిమితమని స్టాలిన్, సి పి ఎస్ యు నాయకులు స్పష్టం చేశారు.

1951 మేలో పార్టీ కేంద్ర కమిటీ సమావేశంలో ఈ చర్చల సారాంశాన్ని వివరించడం జరిగింది. వాటి ఆధారంగా కేంద్ర కమిటీ కొన్ని నిర్ణయాలు తీసుకుంది. వీటిని కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమం ముసాయిదాలో చేర్చి 1951 ఏప్రిల్‌లో ప్రచురించారు. ఆ తరువాత 1951 అక్టోబర్‌లో జరిగిన అఖిల భారత కాన్ఫరెన్స్ సవరణలతో దీనిని ఆమోదించింది. తరువాత 1953 లో మదురైలో జరిగిన మూడవ పార్టీ మహాసభ దీనిని ఆమోదించింది. భారతదేశ విప్లవ పంథాకు సంబంధించిన 'విధాన ప్రకటన', ఎత్తుగడల విధానం 1951లో జరిగిన అఖిల భారత కాన్ఫరెన్స్‌లో ఆమోదంపొందాయి. రష్యా విప్లవ పంథా, చైనా విప్లవ పంథాలకు భారతదేశ విప్లవ పంథా భిన్నంగా ఉంటుందని, భారతదేశ పరిస్థితులకు లెనినిజాన్ని అన్వయిం చడం ద్వారా విప్లవాన్ని సాధించటం జరుగుతుందని ఈ పత్రాలలో స్పష్టంగా పేర్కొన్నారు.

పార్టీ తిరిగి ఐక్యంగా పనిచేయడానికి అవసరమైన పరిస్థితులు కల్పించడానికి, కొత్తగా రూపొందించబడిన పార్టీ పంథాను అమలు చేయడానికి వీలుగా 1950 మేలో ఎన్నికయిన పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, పార్టీ కార్యదర్శి రాజేశ్వరరావు రాజీనామా చేశారు. అజయ్ కుమార్ ఘోష్ కార్యదర్శిగా నూతన పొలిట్ బ్యూరోను ఏర్పాటు చేశారు.

(అనువాదం: కె ఉషారాణి)

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-03-2021 (36 pages) Postal Regd. No D/VJ/172/2021-23

# అధ్యయనం చేసినపుడే సమస్యను పరిష్కరించగలం



– మావో

**ఒక** విషయాన్ని గురించి అధ్యయనం చేయనట్లైతే ఆ విషయాన్ని గురించి మాట్లాడే అర్హతను నీవు కోల్పోతావు. ఆ విషయాన్ని గురించి నీవు తెలుసుకోనట్లైతే, దాని గత చరిత్ర, ప్రస్తుత వాస్తవాలను నీవు అర్థం చేసుకోవట్లైతే, దానికి సంబంధించిన ముఖ్య విషయాలపై అవగాహన లేనట్లైతే, నిస్సందేహంగా దానిని గురించి నీవు చెప్పేదంతా పనికిమాలినదౌతుంది. పనికిమాలిన విషయాలు మాట్లాడటం వలన ఏ సమస్యా పరిష్కారం కాదని ప్రతివారికీ తెలుసు. కొద్దిమంది కామ్రేడ్ ఎల్లప్పుడూ తమ కళ్ళు మూసుకొని, పనికిరాని విషయాలు మాట్లాడుతుంటారు. ఒక కమ్యూనిస్టు ప్రతిష్ఠను అది దిగజారుస్తుంది.

ఒక సమస్యను పరిష్కరించటం కోసమే ఆ సమస్యను గురించి అధ్యయనం చేయాలి. మీరు ఒక సమస్యను పరిష్కారం చేయలేనపుడు దాని గత చరిత్ర, ప్రస్తుత వాస్తవాలను అధ్యయనం చేయాలి. ఆ సమస్యను సాకల్యంగా అధ్యయనం చేసినట్లైతే దానిని ఎలా పరిష్కారం చేయాలో నీవు అర్థం చేసుకోగలుగుతావు. అధ్యయనం చేసిన తర్వాత నిర్ధారణలు చేయగలం మినహా ముందుగా నిర్ధారణలు చేయటం సాధ్యంకాదు. తమబుర్రను ఉపయోగించుకుండా, తనకుతానుగా లేదా తనతో కలిసివుండే కొద్దిమందితో మాత్రమే కలిసి ఆలోచనలు చేసే మూర్ఖుడు మాత్రమే ఎటువంటి అధ్యయనం లేకుండా సమస్యకు పరిష్కారం చెబుతాడు. సమస్యను సరైన పద్ధతిలో పరిష్కరించటానికి ఇది ఏ మాత్రం ఉపయోగపడదు. వారు తప్పుడు అభిప్రాయాలతో ఉంటూ, సమస్యను తప్పుడు పద్ధతులలో పరిష్కారం చేయటానికి ప్రయత్నం చేస్తారు.

పర్యవేక్షణ చేయని కొద్దిమంది కామ్రేడ్స్‌తో పాటు నూతనంగా బాధ్యతలలోకి వచ్చిన గెరిల్లా నాయకులు, కార్యకర్తలు తామున్న ప్రాంతాన్ని గురించిన అవగాహన లేకుండా పనికిమాలిన రాజకీయ ప్రకటనలు చేస్తుంటారు. వారు కేవలం పైపైన చూసి మాత్రమే, అత్యల్ప విషయాలను మాత్రమే అర్థం చేసుకొని ఇటువంటివి చేస్తున్నారు. వీరు విషయాలను గజిబిజి చేసి, ఏ సమస్యను పరిష్కరించలేని వారిగా రుజువు చేసుకొని, ప్రజల విశ్వాసం కోల్పోతారు.

ఇటువంటి వారు కఠినమైనన సమస్యలను ఎదుర్కొన్నపుడు వాటిని పరిష్కరించలేకపోతారు. ఇటువంటి సమస్యలను పరిష్కరించగల శక్తి తమకు లేదని, తమను వేరేచోటుకు బదిలీ చేయమని వారు అసహనంతో కోరుతుంటారు. ఇవి పూర్తిగా పిరికిమాటలు. మీరు మీ కాళ్ళపై నిలబడండి. మీ పర్యవేక్షణలో ఉన్న ప్రాంతంలోని ప్రతి విషయాన్ని గురించి వివరాలు తెలుసుకోండి. మీరెంత పరిమితమైన శక్తికలిగినవారైనప్పటికీ, కన్‌ఫ్యూసియస్ చెప్పినట్లుగా అపుడు మీ కెదురైన సమస్యలను పరిష్కరించుకోగలుగుతారు. అధ్యయనం కోసం బయటకు వెళ్ళేటపుడు మీ బుర్రఖాళీగా ఉన్నప్పటికీ మీరు తిరిగి వచ్చేటపుడు ఖాళీగా ఉండదు. సమస్యను పరిష్కరించటానికి అవసరమైన సమాచారం అంతా మీ బుర్రలోకి వస్తుంది. సమస్యలను పరిష్కారం చేసే పద్ధతి అది. ఇందుకోసం తప్పనిసరిగా బయటికి వెళ్ళాల్సిన అవసరం లేదు. మీకు కష్టమైన సమస్య అన్నదానిని గురించి వాస్తవాలను తెలుసుకోవటం కోసం సమస్యకు సంబంధించిన ప్రజలతో ఒక సమావేశం జరపవచ్చు. ప్రస్తుతం దాని పరిస్థితి ఏమిటో అర్థం అవుతుంది. మీకు కష్టం అనిపించిన సమస్యను ఆ విధంగా సులభంగా పరిష్కరించవచ్చు. సమస్యను గురించి అధ్యయనం చేయటాన్ని దీర్ఘకాలం గర్భం ధరించివుండటంతోనూ, దానిని పరిష్కరించటాన్ని ప్రసవంతోనూ పోల్చవచ్చు. ఒక సమస్యను గురించి అధ్యయనం చేయటం అంటే దానిని పరిష్కరించటానికే అనేది అర్థం చేసుకోవాలి.

**(1930లో మావో రాసిన "పుస్తకాల పూజను నిలిపి వేయండి" వ్యాసంలోని భాగాలు)**

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 9490098977.
Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.15, No.10. Published on March 1, 2021